www.visalaandhra.com | VISALAANDHRA Regd No.VJ/042/2018-20 | పేజీలు : 12+టాబ్లాయిడ్ +ఆదివారం అనుబంధం | వెల: రూ.4.00

SUNDAY

విశాలాంధ్ర

స్థాపితం : 1952

సంపుటి : 66, సంచిక : 266

అక్షరాక్షరం అభ్యుదయం

ఆదివారం 18-03-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | విజయవాడ ప్రచురణ

పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు
విశాలాంధ్ర
ఉగాది శుభాకాంక్షలు

గమనిక :
ఉగాది సందర్భంగా నేడు మా కార్యాలయానికి సెలవు. కనుక సోమవారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం మంగళవారం





హోదా ఇవ్వాల్సిందే

- బీజేపీ ఓటమికి భావసారూప్య పార్టీలతో అవగాహన
- ఎన్డీఏ హయాంలో రాజ్యాంగ విలువలకు పాతర
- ఈవీఎంల స్థానే బ్యాలెట్‌పేపర్లు తేవాలి
- కాంగ్రెస్ ప్లీనరీ తీర్మానం

విశాలాంధ్ర బ్యూరో - న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే అని కాంగ్రెస్ డిమాండు చేసింది. వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్‌ను ఓడించేందుకు భావసారూప్యత కలిగిన అన్ని పార్టీలకు సహకరించేందుకు "ఆచరణాత్మక విధానాన్ని' కాంగ్రెస్ పార్టీ శనివారం ఆమోదించింది. ఇందుకోసం ఉమ్మడి కార్యక్రమాన్ని రూపొందించింది. ఢిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో

- మిగతా 2 లో




రాజకీయ తీర్మానానికి ఆమోదం తెలుపుతున్న రాహుల్, సోనియా, మన్మోహన్, ఆంటోని, ఆజాద్, ఖర్గే తదితరులు

ఈ సారి గెలుపు మనదే - సోనియా | విద్వేషమే బీజేపీ అజెండా - రాహుల్ 9 లో

అధికారుల వైఫల్యమే

- గుంటూరు ఘటనపై చంద్రబాబు ఆగ్రహం
- పైపులైన్ల లీకేజీలపై స్పెషల్ డ్రైవ్ చేయాలని కమిషనర్లకు ఆదేశం



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : గుంటూరు కార్పొరేషన్ ఘటనను దృష్టిలో పెట్టుకొని పైపులైన్ల లీకేజీలపై రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని సీఎం చంద్రబాబు మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. శనివారం తన నివాసం నుంచి మున్సిపల్ కమిషనర్లు, పట్టణాభివృద్ధి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

'గుంటూరు దుర్ఘటన శాఖాపర వైఫల్యం. ఒక వ్యక్తి నిర్లక్ష్యం పది మంది మృతికి కారణం కావడం దురదృష్టకరం. విపత్తు వస్తే దానిని చక్కదిద్దే వరకు వదిలిపెట్టకూడదు. విశాఖలో హుద్ హుద్ తుపాన్ వచ్చినప్పుడు ఎలా చేశాం. గుంటూరులో ఆ స్ఫూర్తి ఏమైంది. స్థానికంగా వైఫల్యం చెందితే ఉన్నతస్థాయి యంత్రాంగం చక్కదిద్దాలి. అధికార యంత్రాంగం పని తీరు ప్రభుత్వం గౌరవం

- మిగతా 2 లో

స్మో 'క్వీన్స్'

యువతుల్లో పెరుగుతున్న సిగరెట్ వ్యసనం

- దురలవాటుకు దూరమౌతున్న యువకులు
- ఒత్తిడికి ఉపశమనం, ఆధునికతకు చిహ్నమనే భావన
- మాతృత్వాన్ని దూరం చేస్తున్న పాడు అలవాటు
- అసోచమ్ అధ్యయనంలో వెల్లడైన చేదు నిజాలు



సిగరెట్ తాగడం మహా ప్రమాదకరమైన అలవాటు. దాని వలన జరిగే అనర్థాలు అన్నీ ఇన్నీ కాదు. ఇవన్నీ తెలిసి యువకులు దీనికి దూరంగా జరుగుతుంటే... భారతదేశంలోని యువతుల్లో మాత్రం సిగరెట్ తాగేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నదట. ఈ అలవాటును ఒత్తిడికి ఉపశమనంగా, ఆధునికతకు చిహ్నంగా వారు భావిస్తున్నారట.

7 లో



సమస్యల సుడిగుండంలో గాజులదిన్నె

- శిథిలావస్థకు చేరిన స్పిల్‌వే గేట్లు
- ఒండ్రు పేరుకొని తగ్గిన నిల్వ సామర్థ్యం
- కుచించుకుపోయిన ఆయకట్టు ప్రాంతం
- రూ. 128 కోట్ల ఆధునీకరణకు మోక్షమెప్పుడో!

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: తాగు,సాగునీటి అవసరాలను తీర్చేందుకు కొత్త ప్రాజెక్టుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్న ప్రభుత్వం ఉన్న ప్రాజెక్టులను ఆధునీకరించే విషయంలో చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఏటా లక్షలాది ఎకరాల కొత్త ఆయకట్టును తీసుకురావడమే కాకుండా స్థిరీకరిస్తున్నట్లు ఒకవైపు చెబుతూనే మరోవైపు పాత ఆయకట్టును చేజేతులా నాశనం చేస్తోంది. ఇందుకు కర్నూలుజిల్లాలో మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు 'సంజీవయ్య సాగర్'గా వ్యవహరించే

- మిగతా 2 లో



మా ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిందే

- రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది : రామ్‌మాధవ్
- అమిత్‌షా నివాసంలో ఏపీ బీజేపీ అత్యవసర సమావేశం
- చంద్రబాబు తీరుపై అసంతృప్తి
- ఏపీ బీజేపీ ఇన్‌ఛార్జ్‌గా రామ్‌మాధవ్

న్యూఢిల్లీ-విశాలాంధ్ర బ్యూరో : ఏపీ బీజేపీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా రామ్‌మాధవ్‌ను నియమిస్తూ బీజేపీ అధినాయకత్వం కీలక నిర్ణయం తీసుకుంది. శనివారం న్యూఢిల్లీలో బీజేపీ చీఫ్ అమిత్‌షా నివాసంలో ఏపీ బీజేపీ నేతల అత్యవసర సమావేశం జరిగింది. ఎన్‌డీఏ నుంచి టీడీపీ బయటకు వచ్చిన నేపథ్యంలో ఏపీ రాజకీయ పరిస్థితులపై అంచనా వేసి పార్టీని ముందుకు నడిపించేందుకు అమిత్‌షా వేగంగా పావులు కదిపారు. ఇందులో భాగంగా జరిగిన సమావేశానికి బీజేపీ సీనియర్ నేత రామ్‌మాధవ్, ఏపీ బీజేపీ చీఫ్ కంభంపాటి హరిబాబు, సోము వీర్రాజు, పురంధేశ్వరి, కామినేని

- మిగతా 2 లో

ప్రేమించినవారికన్నా ఫోనే ప్రాణం

- డిజిటల్ ప్రపంచంలో 33శాతం యువత
- 53శాతం.. స్మార్ట్‌ఫోన్‌లపైనే మక్కువ
- 64 శాతం..ఫోన్లలోనే సంబంధాలు

ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే 47శాతం మంది భారతీయులు తమ ప్రియమైన వారికంటే స్మార్ట్ ఫోన్లకే ఎక్కువ మొగ్గుచూపుతున్నట్లు వెల్లడైంది. మరో గమ్మత్తైన విషయం... ఫోన్ల వినియోగంతో మనుషులతో సంబంధం ఉండేవారి సంఖ్య 64శాతంతో భారత్ మరింత ముందంజలో ఉంది.



7 లో

విహారం.. విషం.. విషాదం

గుంటూరు, విశాఖ జిల్లాల్లో రెండు వేర్వేరు ఘటనల్లో ఆరుగురి మృతి

విశాలాంధ్ర-గుంటూరు/నక్కపల్లి : రాష్ట్రంలో శనివారం రెండు విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనల్లో మొత్తం ఆరుగురు మృత్యువాత పడ్డారు. గుంటూరు జిల్లా బాపట్ల మండలంలోని సూర్యలంక సముద్ర తీరంలో ఇద్దరు విద్యార్థులు అలల్లో కొట్టుకుపోయి మరణించారు. కళాశాల విద్యార్థుల బృందంతో విహార యాత్రకు వచ్చి వీరు ప్రాణాలు కోల్పోయారు. అయితే విశాఖ జిల్లా నక్కపల్లి మండలం ఉపమాకలో విష వాయువుకు ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు. పాత సెప్టిక్ ట్యాంకులోని నీరు కొత్త ట్యాంకులోకి పోయేందుకు రంధ్రం చేస్తుండగా విషవాయువు బయటకు రావడంతో స్పృహ తప్పిన తండ్రిని రక్షించే ప్రయత్నంలో తండ్రితో సహా కుమారుడు, సోదరుడి కుమారులు మృత్యువాత పడ్డారు. దీంతో బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదం అలుముకుంది.



3 లో



యువతలో సౌందర్య కాంక్ష

- చర్మరంగుపై మోజు
- వాణిజ్య ప్రకటనల హోరు
- పురుషులదే పైచేయి

7 లో

బీజేపీకి కష్టాలు

- టీడీపీ కటీఫ్‌తో 314కు తగ్గిన ఎన్డీఏ బలం
- శివసేన ఊపిరిలూదేదీ అనుమానమే
- వేరేదారి చూసుకుంటున్న ఇతర మిత్రులు
- వైసీపీ, టీడీపీల అవిశ్వాసంతో తంటా

న్యూఢిల్లీ : కేంద్రంలోని కాషాయ ప్రభుత్వం కకావికలమవుతోంది. అనూహ్య పరిణామాలు ఎన్‌డీఏను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలన్న డిమాండు ఇపుడు దేశంలో సంచలనం సృష్టిస్తోంది. ఎన్నికలకు ముందు కాషాయ ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఏపీకి ఐదేళ్లు కాదు...10 ఏళ్లపాటు ప్రత్యేక హోదా ఇస్తామంటూ ఇచ్చిన హామీని అమలు చేయాలని నాలుగేళ్లుగా వామపక్ష పార్టీలు సీపీఐ, సీపీఎం, ఏపీలోని ఇతర విపక్ష పార్టీలు చేస్తున్న ఆందోళనలు తారాస్థాయికి చేరడంతో హస్తిన రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయి. ఇన్నాళ్లూ బీజేపీతో చెలిమి చేస్తూ ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ అంటూ రెండు నాల్కల ధోరణి అవలంబిస్తూ వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు వామపక్ష, విపక్ష ఉద్యమానికి తలొగ్గి కేంద్రంలోని ఎన్‌డీఏ కూటమి నుంచి వైదొలుగుతూ శుక్రవారం నిర్ణయం



తీసుకున్నారు. ఇపుడు ఆ నిర్ణయమే ఎన్‌డీఏ కాషాయ ప్రభుత్వానికి ప్రాణసంకటంగా మారింది.

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా డిమాండుతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, టీడీపీలు గురువారం కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానానికి నోటీసులు ఇచ్చాయి. ఇందుకోసం జాతీయస్థాయిలో వివిధ విపక్ష పార్టీల మద్దతు కూడగట్టాయి. ఈ నేపథ్యంలో అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొనేందుకు కేంద్రానికి తగిన బలం అవసరం. బీజేపీతో తన నాలుగేళ్ల మైత్రిని కాదని ఎన్‌డీఏ నుంచి వైదొలుగుతూ టీడీపీ నిర్ణయం తీసుకుంది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజార్టీతో అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ నుంచి నిష్క్రమించిన తొలి ప్రధాన పార్టీ(సీట్ల పరంగా) టీడీపీ కానుంది. 16 మంది సభ్యులు కలిగిన టీడీపీ.. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. సుదీర్ఘరాజకీయ అనుభవం గల చంద్రబాబు ప్రత్యర్థి పార్టీ వైసీపీ అడుగుజాడల్లో వెళుతున్నట్టు కనిపిస్తోంది. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వలేమని కేంద్రం స్పష్టం చేయడంతో ఈ రెండు పార్టీలు

- మిగతా 2 లో

ఇదీ లోకం!



ట్రంప్, కిమ్‌ల భేటీకి సన్నాహాలు

ఆర్ఓకే, జపాన్‌తో అమెరికా చర్చలు



వాషింగ్టన్ : అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, డెమొక్రటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా (డీపీఆర్‌కే) అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ మేనెలలో భేటీ కానున్నారు. అయితే వారిద్దరూ ఎక్కడ సమావేశమవుతారన్న దానిపై ఇప్పటివరకు స్పష్టత రాలేదు. ఈ క్రమంలో ఇద్దరు అగ్రనేతల కీలక సమావేశానికి సంబంధించి అమెరికా ముమ్మర ఏర్పాట్లు మొదలుపెట్టింది. అమెరికా సహాయ కార్యదర్శి జాన్ సుల్లివాన్ ఇప్పటికే రిపబ్లిక్ ఆఫ్ కొరియా (ఆర్ఓకే) విదేశాంగ మంత్రి కాంగ్ కుయుంగ్ వాతో సమావేశమయ్యారు. దక్షిణ కొరియా, జపాన్ విదేశాంగ మంత్రులతో వేర్వేరుగా భేటీ అయిన ఆయన ట్రంప్, కిమ్‌ల సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లు, సహకారంపై సుదీర్ఘంగా చర్చించారు. కొరియా ద్వీపకల్పం అణునిరాయుధీకరణ అంశంపై ఇద్దరు అగ్రనేతలు ప్రధానంగా చర్చించనున్న విషయం తెలిసిందే. శుక్రవారం దక్షిణ కొరియా, జపాన్ దేశాల అధికారులతో జరిగిన ద్వైపాక్షిక చర్చల్లో తమ మధ్య సయోధ్యకు, అణునిరాయుధీకరణ దిశగా ప్యాంగ్యాంగ్‌పై సాధ్యమైనంత ఎక్కువగా ఒత్తిడి తేవాలని నిర్ణయించినట్టు అమెరికా అధికారి హేథర్ నౌయెట్ తెలిపారు.

23 మంది బ్రిటీష్ దౌత్యవేత్తల బహిష్కరణ

- స్నేహ వ్యతిరేక చర్యలను సహించబోమన్న రష్యా
- రష్యాపై చర్యలకు ఏకంకండి: థెరెసా మే



మాస్కో : బ్రిటీష్ దౌత్యవేత్తలను బహిష్కరించామని రష్యా ప్రకటించింది. మాజీ రష్యా ఏజెంటు, అతని కుమార్తెను విషంతో హత్యచేసినందుకు ప్రతిగా బ్రిటన్‌కు దౌత్యవేత్తలను బహిష్కరించామని రష్యా తెలిపింది. మాస్కో దౌత్యకార్యాలయంలోని 23 మంది బ్రిటన్ రాయబారులను వారంలోగా దేశం విడిచి వెళ్లాలని విదేశాంగ శాఖ ఆదేశించింది. బ్రిటన్ కవ్వింపు చర్యల మూలంగానే ఈ పరిస్థితి తలెత్తిందని మార్చి 4న సెర్గీ స్క్రిపాల్, యూలియాను రష్యా తరపున గూఢచర్యానికి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ విషంతో హత్య చేయడంలో రెండు దేశాల మధ్య సంబంధాలు తెగిపోయాయని రష్యా స్పష్టం చేసింది. బ్రిటన్‌తో సాంస్కృతిక, విద్యా సంబంధాలు పూర్తిగా తెగిపోయాయని, మరోసారి స్నేహ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించబోమని రష్యా బ్రిటన్‌ను హెచ్చరించింది.అయితే బ్రిటన్ విదేశీ వ్యవహారాల కార్యదర్శి రష్యా ఆరోపణలను ఖండిస్తూ, ప్రాణాపాయంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్క్రిపాల్‌కు విషమిచ్చి చంపమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ వ్యక్తిగతంగా ఆదేశించాడన్నారు. ఈ వ్యాఖ్యలను పుతిన్ అధికార ప్రతినిధి తోసిపుచ్చారు.

జిన్‌పింగ్ జీవితాంతం చైనా అధ్యక్షుడే



బీజింగ్ : చైనా అధ్యక్షుడిగా జిన్‌పింగ్ మళ్లీ ఎన్నికయ్యారు. చైనా రాజ్యాంగం ప్రకారం అధ్యక్షుడు రెండు పర్యాయాలు మాత్రమే పదవిలో ఉండే నిబంధనను ఎత్తేస్తూ ఇటీవల చైనా పార్లమెంటు సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దీంతో రెండో పర్యాయం అధ్యక్షుడిగా జిన్ పింగ్‌ను మరోసారి ఎన్నుకున్నారు. దీంతో ఆయన చైనాలో తిరుగులేని నేతగా ఆవిర్భవించారు. చైనా సైన్యానికి హైకమాండ్‌గా వ్యవహరించే అత్యంత శక్తివంతమైన సెంట్రల్ మిలిటరీ కమిషన్ అధినేతగా కూడా జిన్‌పింగ్ ఎంపికయ్యారు. వాంగ్ చైనా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కొత్త ప్రభుత్వంలో ప్రధాని లీ కెకియాంగ్ మినహా ఉన్నత స్థాయి అధికారులను, మంత్రిమండలిని, అక్కడి సెంట్రల్ బ్యాంకు గవర్నర్‌ను మార్చేయనున్నారు. చైనాలోని అధికార కమ్యూనిస్టు నేషనల్ పార్టీ అధ్యక్షుడి, ఉపాధ్యక్షుడి పదవీకాల పరిమితిని ఎత్తేస్తూ ప్రతిపాదించిన చట్ట సవరణను మార్చి 11న నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్‌కు చెందిన 2900 మంది డిప్యూటీలంతా కలిసి ఆమోదించారు. రెండు పర్యాయాల కాల పరిమితి ప్రకారం జిన్‌పింగ్ 2023 నాటికి కమ్యూనిస్ట్ నేషనల్ పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవాల్సి ఉండేది. కానీ ఇప్పుడా అవసరం లేకుండా చేశారు. 1982లో డెంగ్ జియావోపింగ్ కాలంలో.. అప్పటి ప్రభుత్వం ఏ వ్యక్తి అయినా అధ్యక్ష పదవిని రెండుసార్లు మాత్రమే చేపట్టాలని చట్టం చేసింది. ఆ తరువాత మళ్లీ 36 ఏళ్లకు రాజ్యాంగ సవరణ చేశారు. దీంతో ప్రస్తుత అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ జీవితాంతం చైనా అధ్యక్షుడిగా కొనసాగేందుకు మార్గం సుగమమైంది. ఆయన 2013లో అధ్యక్షుడు అయ్యారు. ఇప్పుడు ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన వాంగ్ అంటే చైనాలో అధికారులు భయపడిపోతున్నారు. జిన్‌పింగ్ ప్రవేశపెట్టిన అవినీతి వ్యతిరేక కార్యక్రమం వాంగ్ ఆధ్వర్యంలో జరుగుతోంది. వాంగ్ ఇప్పటికే వంద మంది మంత్రులు సహా 1.5 మిలియన్ల మంది అధికారులకు శిక్షలు వేశారు.

శ్రీలంక ప్రధాని

విక్రమసింఘేపై అవిశ్వాసం

వ్యతిరేక వర్గానికి రాజపక్సే సారథ్యం



కొలంబో : శ్రీలంక ప్రధాని రణిల్ విక్రమ సింఘేపై విపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాయి. ఈ ప్రతిపాదన వెనుక శ్రీలంక మాజీ అధ్యక్షుడు మహేంద్ర రాజపక్సే ఉన్నారు. కేంద్ర కాండీలో అల్లర్లు చెలరేగిన నేపథ్యంలో న్యాయశాఖ మంత్రిని తొలగించడంతో ఈ పరిస్థితి తలెత్తింది. వచ్చేవారం పార్లమెంటు సమావేశాల్లో 68 ఏళ్ల విక్ర మసింఘేపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామని పార్లమెంటు సభ్యురాలు రంజిత్ సోయసా తెలిపారు. త్వరలో ఆయన పదవిని కోల్పోతారని, మూడేళ్ల నుంచి ఆయన ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నా రన్నారు. ఆయన సారథ్యం వహించే యునైటెడ్ నేషనల్ పార్టీ (యూఎన్‌పీ) సభ్యుల్లో కొందరు కూడా దీనిపై సంతకాలు చేస్తారన్నారు. 2015,2016ల్లో జరిగిన సెంట్రల్ బ్యాంకు బాండు స్కామ్ కూడా ఆయన మెడకు చుట్టుకోనుంది. ఆ బ్యాంకు గవర్న ర్‌గా సింగపూర్‌కు చెందిన అర్జున మహేంద్రన్ బ్యాంకు గవర్నర్ నియమించి అనేక ఆర్థిక అవక తవకలకు పాల్పడ్డారని సోయసా వెల్లడించారు. దేశంలో ముస్లింలకు వ్యతిరేకంగా జరిగిన అల్లర్లను అదుపుచేయడంలో కూడా న్యాయశాఖ మంత్రిగా విఫలమయ్యారన్నారు. ఫిబ్రవరి 10న రాజపక్సే పార్టీ శ్రీలంక పీపుల్స్ పార్టీ (ఎస్ఎల్‌పీపీ) స్థానిక ఎన్నికల్లో విజయం సాధించినప్పటి నుంచి రణిల్‌పై రాజీ నామా ఒత్తిడి పెరిగింది. అయితే విక్రమసింఘే అవిశ్వాస తీర్మానాన్ని గెలిపించుకోవడానికి ఎస్ఎల్ పీపీ వద్ద సరిపడినంతమంది సభ్యులు లేరు. న్యాయ వ్యవహారాల శాఖ మంత్రిగా విక్రమసింఘే స్థానంలో సిరిసేనను నియమించినప్పటికీ ఆయనను పదవిచ్యు తుడిని చేయడంలో ఎస్ఎల్‌పీపీ విఫలమైంది. కాండీలో శ్రీలంక బౌద్ధులకు మైనార్టీలైన ముస్లింలకు మధ్య ఘర్షణలు చెలరేగిన విషయం తెలిసిందే. దీంతో ఆప్రాంతంలో అత్యవసర పరిస్థితి అమలు చేశారు. 2009లో అంతర్యుద్ధం ముగిసిన తర్వాత అల్లర్లు జరగడం ఇదే ప్రథమం. కాండీలో 75 శాతం మంది బౌద్ధులే.

ఇంట్లోకి దూసుకువెళ్లిన విమానం, 9 మంది మృతి

మనిలా : ఐదుగురితో ప్రయాణిస్తున్న చిన్న విమానం ఇంట్లోకి దూసుకుపోవడంతో 9 మంది మృతి చెందారు. ఈ ఘటన మనీలా బులాకేవ్ ప్రాంతంలోని ప్లారిడల్ పట్టణంలో చోటు చేసుకుంది. విమానంతోపాటు ఇల్లుకూడా దగ్ధమైందని ఫిలిప్పీన్ అధికార ప్రతినిధి ఎరిక్ అపొలోనియో వెల్లడించారు. ఈ ఘటనలో విమానంలోని ఐదుగురు, ఇంటిలోని నలుగురు మృతి చెందారన్నారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయన్నారు. తెగిపడిన విమాన రెక్కలు ప్రహరీపై పడి కాలుతున్న దృశ్యాలను స్థానిక టీవీ ప్రసారం చేసింది. శిథిలమైన ఇంటిలో మరొక వ్యక్తి ఆచూకీకోసం సహాయ చర్యలు చేపట్టారు. ప్రమాదకారణంపై దర్యాప్తు జరుపుతున్నామని అధికారులు వెల్లడించారు.

ముందస్తు ఎన్నికలు నిర్వహించాలి

స్లోవాక్ ఆందోళనకారుల డిమాండు

బ్రాటిస్లావా : బ్రాటిస్‌లావా, స్లోవాకియాలో ఆందోళనలు మిన్నంటాయి. 1,00,000 మందికిపైగా స్లోవాకీయన్లు ముందస్తు ఎన్నికల కోసం పెద్దపెట్టున డిమాండు చేస్తున్నారు. ప్రభుత్వంలో కీలక మార్పులు అవసమని, వాటిని చేపట్టేంత వరకు ఆందోళనను విరమించేది లేదని నిర్వాహకులు స్పష్టంచేశారు. ఇటీవల యంత్రాంగంలో చోటుచేసుకున్న మార్పులు గతంలో చర్చించినట్లుగా లేవన్నారు. ఈ నేపథ్యంలో ముందస్తు ఎన్నికల నిర్వహణే ఏకైక ప్రత్యామ్నాయమని అన్నారు. జర్నలిస్టులు, టీచర్లు, విద్యార్థుల ప్రతినిధులు ప్రసంగాలు చేశారు. ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగంపై తమకు ఏ మాత్రం నమ్మకం లేదని స్పష్టంచేశారు. పాలనా యంత్రాంగంలో కీలక మార్పులు అవసమని, ముందస్తు ఎన్నికలు జరిపి తీరాల్సిందేనని డిమాండు చేశారు. అదే సమయంలో పోలీస్ కార్ప్స్ ప్రెసిడెంట్ తిబర్ గాస్పర్, స్పెషల్ పాసిక్యూటర్ దుసన్ కోవాసిక్‌ల రాజీనామాను కూడా ఆందోళనకారులు డిమాండు చేశారు. ప్రభుత్వం దిగివచ్చి, మార్పులు చేసేంత వరకు తమ ఆందోళన కొనసాగుతుందని తేల్చిచెప్పారు.



గౌటాపై వైమానిక దాడి : 30 మంది పౌరులు మృతి

బీరుట్ : సిరియాలోని గౌటా ప్రాంతంలో జరిగిన వైమానిక దాడిలో 30 మంది పౌరులు మృతి చెందారు. నెలరోజుల నుంచి తిరుగుబాటు దారులకు ప్రభుత్వానికి మధ్య తీవ్ర పోరాటం జరుగుతోంది. ఈ దాడి ఎవరు చేశారన్నదానిపై సిరియా మానవహక్కుల సంఘం ప్రకటన విడుదల చేయలేదు. డెమాస్కస్ శివారు ప్రాంతంలో ప్రభుత్వ దళాలు, ఫెలక్ అల్ రెహమాన్ తిరుగుబాటు వర్గం నుంచి 70 శాతం ప్రాంతాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నాయి. ఈ ప్రాంతంలో 1,390 మంది సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోయారు. శనివారం ఉదయం 10 వేల మంది పౌరులు ఉగ్రవాదుల నిర్బంధ ప్రాంతాలనుంచి విడుదల కాగ, గురువారం నుంచి ఇప్పటివరకు 40 వేల మంది విడుదలైనట్లు అధికారులు వెల్లడించారు.

బీజేపీకి కష్టాలు

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీపై ఆగ్రహంతో ఉన్నాయి. 2014లో 336 సీట్లతో ఎన్‌డీఏ అధికారం చేపట్టింది. ఇందులో బీజేపీ ఒక్కటే 282 సీట్ల బలం కలిగి ఉంది. అయితే ఉపఎన్నికల్లో వరుస ఓటముల తర్వాత లోక్‌సభలో కాషాయ పార్టీ బలం 274కు పడిపోయింది. దాని 11 మిత్రపక్షాలు శివసేన, జేడీ(యూ), అప్నాదళ్, ఎల్‌జేపీ, ఎస్ఏడీ, ఆర్ఎల్ఎస్‌పీ, పీడీపీ, పీఎంకె, ఎన్‌డబ్ల్యూపీ, ఎన్‌పీపీ, ఏఐఎన్ఆర్ కాంగ్రెస్‌లతో ఎన్‌డీఏ బలం 314గా ఉంది. చెలిమిని కొనసాగించాలని టీడీపీని ఒప్పించగలిగితే, తగిన మెజార్టీ 330కి పెరుగుతుంది. మిత్రపక్షాలు, ప్రత్యేకించి శివసేనతో బీజేపీ చెలిమి అంత ఆరోగ్యకరంగా లేదు. ఎన్‌డీఏ నుంచి టీడీపీ మాదిరిగా శివసేన కూడా బయటకు వచ్చేస్తే...314 నుంచి 296కు పడిపోతుంది. అప్పుడు మేజిక్ ఫిగర్‌కంటే 23 స్థానాలు మాత్రమే ఎక్కువ ఉంటాయి. అంటే ఇక బీజేపీ భవిష్యత్ కచ్చితమైనదిగా ఉండబోదు. గత ఏడాది శివసేన విడిపోవాలని నిర్ణయించింది. బీజేపీతో పీడీపీ సంబంధాలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఆర్ఎల్ఎస్‌పీ ఇప్పటికే బీహార్‌లో ప్రతిపక్షంతో చేతులు కలిపేందుకు చర్చలు జరుపుతోంది. ఈ పరిస్థితులన్నీ బీజేపీకి ఇబ్బంది కలిగించేవిగా ఉండవచ్చు. బీజేపీ, దాని మిత్రపక్షాల మధ్య సంబంధాలు ఇబ్బందికరంగానే ఉన్నాయి.

పార్లమెంటులో పీడీపీ ఇద్దరు ఎంపీలను కలిగి ఉంది. అయితే ఒకసారి రాష్ట్రంలో బీజేపీతో పొత్తు కలపడం గొప్పగా భావించిన తర్వాత జమ్మూ, కాశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ...ఆర్థిక మంత్రి హసీబ్ దబును తొలగించిన తరువాత బీజేపీతో పీడీపీ సంబంధాలు దెబ్బతిన్నాయి. బీజేపీకి బలమైన మిత్రపక్షంగా ఉన్న శివసేనకు 18 మంది ఎంపీలున్నారు. బీజేపీకి చెందిన దేవేంద్ర ఫడ్నవిస్ ముఖ్యమంత్రిగా ఉన్న మహారాష్ట్రలో బీజేపీ-శివసేన చెలిమి కొనసాగుతోంది.

గత ఏడాది మున్సిపల్ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు వేర్వేరుగా పోటీ చేశాయి. 2019లో లోక్‌సభ, శాసనసభ ఎన్నికలకు ఒంటరిగానే పోటీ చేస్తామని శివసేన ఈ ఏడాది మొదట్లో ప్రకటించింది. బీజేపీకి ఎంతోకాలంగా మిత్రపక్షంగా ఉన్న శిరోమణి అకాలీదళ్(ఎస్ఏడీ)కి పార్లమెంటులో నలుగురు సభ్యులున్నారు. కానీ గత ఏడాది పంజాబ్ శాసనసభ ఎన్నికల్లో 117 సీట్లకుగాను 77 సీట్లతో కాంగ్రెస్ పార్టీ అధికారం చేజిక్కించుకున్న తర్వాత బీజేపీ-ఎస్ఏడీ సంబంధాలు అంత ప్రకాశవంతంగా కనిపించడం లేదు.

జేడీ(యూ) ప్రత్యేక హోదా పాట

2014 లోక్‌సభ ఎన్నికల సమయంలో జేడీ(యూ) ప్రతిపక్షంలో ఉంది. దాణా కుంభకోణం కేసులో ఆర్‌జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్‌కు శిక్ష పడిన నేపథ్యంలో బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఎన్‌డీఏకు ఫిరాయించారు. జేడీ(యూ)కు ఇద్దరు ఎంపీలున్నారు. అయితే బీహార్‌కు ప్రత్యేక హోదా కల్పించాలన్న డిమాండును నితీష్ కుమార్ తెరపైకి తెచ్చారు. హోదా మాట ఇపుడు దేశంలోని రెండో రాష్ట్రంలో ప్రారంభమై కాషాయ పార్టీని వెంటాడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎన్‌డీఏ నుంచి టీడీపీ నిష్క్రమణతో హోదా విషయాన్ని నితీష్ తీవ్రంగా పరిగణించే అవకాశాలున్నాయి.

అంతేకాకుండా, శరద్ యాదవ్ నేతృత్వంలోని జేడీ(యూ) అసమ్మతి వర్గం పార్టీ నుంచి దూరమైంది. ఈ క్రమంలో జేడీ(యూ)లో చీలికలు కూటమిలో నిలిచేందుకు గల పార్టీ అవకాశాలను ఏ విధంగా ప్రభావితం చేస్తాయో చూడాల్సి ఉంది. ఇక దేశవ్యాప్తంగా మోడీ హవాను తిప్పికొడుతూ 2014లో బీహార్ నుంచి మూడు స్థానాల్లో పోటీ చేసిన రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ(ఆర్ఎల్ఎస్‌పీ) మూడింటిలోనూ గెలుపొందింది. బీహార్ రాజకీయాల్లో చిక్కుకుపోవడంతో ఆర్ఎల్ఎస్‌పీ క్రమంగా బీజేపీ పంచ నుంచి తప్పుకుంటుంది. బీహార్‌లో రెండు ఉపఎన్నికల్లో ఆర్‌జేడీ విజయం సాధించిన తర్వాత, ఎన్‌డీఏను వీడి ఆర్‌జేడీ నేతృత్వంలోని 'మహా కూటమి'లో చేరనున్నట్లు ఆర్ఎల్ఎస్‌పీ గురువారం ప్రకటించింది.

హోదా ఇవ్వాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభమైన ఏఐసీసీ 84వ ప్లీనరీ రాజకీయ తీర్మానంలో ఏపీకి ప్రత్యేక హోదా అంశాన్ని చేర్చారు. కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రత్యేక హోదా అంశాన్ని ప్రస్తావనకు తీసుకువచ్చారు. ఇప్పటి వరకు ఏపీకి హోదా ఇవ్వకపోవడాన్ని కాంగ్రెస్ ఖండించింది. ఏపీ విభజన చట్టాన్ని అమలు చేయాలని డిమాండు చేసింది. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని యూపీఏ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, బీజేపీ సహా అన్ని పార్టీలు ఒప్పుకున్నాయని కాంగ్రెస్ గుర్తుచేసింది. ఏపీకి ప్రత్యేక హోదాకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేసింది. విభజన చట్టంలోని హామీలను ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించింది. తాము అధికారంలోకి వచ్చాక హోదా ఇవ్వడంతో పాటు విభజన హామీలు తప్పనిసరిగా అమలు చేస్తామని కాంగ్రెస్ ఆ తీర్మానంలో పేర్కొంది. జెండా ఆవిష్కరణ అనంతరం మరణించిన నాయకులకు ప్లీనరీ సంతాపం తెలిపింది. ఎన్డీయే వైఫల్యాలు, యూపీఏ పాలన, కాంగ్రెస్ భవిష్యత్ కార్యాచరణపై ప్లీనరీ ప్రధానంగా చర్చిస్తోంది. బీజేపీ-ఆర్ఎస్ఎస్‌పై కాంగ్రెస్ రాజకీయ తీర్మానం తీవ్ర దాడి చేసింది. రాజ్యాంగాన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్ పూర్తిగా అవమాన పరుస్తున్నాయని, దేశ రాజ్యాంగ విలువలను దిగజారుస్తున్నాయని, అన్ని రకాల స్వేచ్ఛలపై దాడులు జరుగుతున్నాయని తీర్మానం పేర్కొన్నది. రాజ్యాంగ విలువలను కాపాడేందుకు త్యాగాలకు సిద్ధమని పేర్కొన్నది. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నది.

బీజేపీ పాలనలో రైతులు, కార్మికులు, అసంఘటిక కార్మికులు, స్వయం ఉపాధి వర్గాలు, దళితులు, మైనార్టీలు, చిరువ్యాపారుల మనుగడ కష్టమైందని ఆవేదన వ్యక్తం చేసింది. రాజ్యాంగ ఉల్లంఘనను అడ్డుకునేందుకు త్యాగాలకు సిద్ధపడాలని, దేశ ప్రజల మనోభావాలను గౌరవించాలని, బీజేపీ హయాంలో జరుగుతున్న దురాగాతాలను అడ్డుకోవాలని పిలుపు నిచ్చింది. కేంద్ర సంస్థల అధికారాన్ని బీజేపీ దుర్వినియోగం చేస్తోందని, రాజకీయ ప్రత్యర్థులను నిర్వీర్యం చేయటానికి, రాజకీయ వేధింపులకు ఈ సంస్థలను ఉసిగొల్పుతోందని ప్లీనరీ ఆగ్రహం వ్యక్తం చేసింది. యువత మహిళలు, ఎస్సీ, ఎస్టీ, నిరుద్యోగం, పేదరిక నిర్మూలన, దేశభద్రత, విదేశాంగ విధానం, ఆర్థిక విధానాలు, వ్యవసాయం, కుంభకోణాలు, అవినీతిపై ప్లీనరీలో తీర్మానాలు ప్రవేశపెట్టనున్నారు. న్యాయవ్యవస్థలో తక్షణ సంస్కరణలు అవసరమని, రోజు రోజుకు పెండింగ్ కేసుల సంఖ్య పెరిగిపోతున్నాయని, కేసుల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. లోక్‌సభ పక్షనేత మల్లిఖార్జున్ ఖర్గే మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావటానికి దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తే...ప్రస్తుతం మోడీ హయాంలో ప్రజాస్వామ్యానికి ప్రమాదం వాటిల్లిందన్నారు.

ఎన్నికలు నిర్వహించే విధానంలో మార్పు రావాలని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవిఎం) స్థానే పాతపద్ధతి బ్యాలెట్ పేపరుకు వెళ్లాలని రాజకీయ తీర్మానం విజ్ఞప్తి చేసింది.

ఎన్నికల క్రమంపై విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు ఇది ఎంతో అవసరమని పేర్కొంది. ఈవీఎంలు దుర్వినియోగం అవుతున్నాయని, ప్రజాతీర్పును తారుమారు చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో పాతపద్ధతికి వెళ్లటం ఎంతో అవసరమని తెలిపింది. ఎన్నికలు ఏకకాలంలో నిర్వహించాలన్న బీజేపీ యోచనను కూడా తీర్మానం వ్యతిరేకించింది. ఆ విధంగా ఏక కాలంలో ఎన్నికలు నిర్వహించడంలో అనేక సమస్యలు ఎదురవుతాయని, ఈ విషయమై క్షుణ్ణంగా పరిశీలన జరిపి, ఏకాభిప్రాయం సాధించడం అవసరమని పేర్కొన్నది.

గాజులదిన్నె

(మొదటిపేజీ తరువాయి)

గాజులదిన్నె ప్రాజెక్టు ఉదాహరణగా నిలుస్తోంది. కర్నూలుజిల్లాలో గోనెగండ్ల, కొడుమూరు, కృష్ణగిరి, దేవరకొండ గ్రామాల్లోని 24,372 ఎకరాలకు సాగునీటిని ఇవ్వడమే కాకుండా జిల్లా కేంద్రం కర్నూలు, ఎమ్మిగనూరు ప్రజలకు తాగునీటిని అందించేందుకు నిర్దేశించిన ఈ ప్రాజెక్టును తుంగభద్ర ఉపనది అయిన హంద్రీపై 1979లో నిర్మించారు. ఈ ప్రాజెక్టును 4.5 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో 6 స్పిల్‌వే గేట్లతో డిజైన్ చేశారు. అయితే 2009లో భారీ వరదల కారణంగా ఈ ప్రాజెక్టు కరకట్ట పూర్తిగా దెబ్బతింది. అలాగే స్పిల్‌వే గేట్లు కూడా ధ్వంసమయ్యాయి. చివరి ఆయకట్టు భూములకు నీరందించడం, ప్రాజెక్టు గట్టు బలోపేతం చేయడం.. వంటి ఆధునీకరణ పనుల కోసం జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ (జైకా) అందించిన రూ. 44 కోట్లను ఖర్చు చేశారు. అయినప్పటికీ సమస్యలు ఎక్కడేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారాయి. ఆయకట్టు ప్రాంతం రోజురోజుకూ కుచించుకుపోతూ 10వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు సరఫరా అవుతోందని స్థానిక రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది. కోట్లు వెచ్చించినా చివరి భూములకు నీరు అందడంలేదని పలువురు అన్నదాతలు వాపోతున్నారు. అలాగే 70వ దశకంలో నిర్మించిన ఈ ప్రాజెక్టు ఒండ్రుతో పూడుకుపోవడం వల్ల నిల్వ సామర్థ్యం తగ్గిందని, స్పిల్‌వే గేట్లు తుప్పుపట్టి పూర్తిగా ధ్వంసమై చాలా చోట్ల లీకేజీలు ఏర్పడి నీరు దిగువకు వెళ్లిపోతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు గేట్ల నిర్వహణకు సంబంధించి ఇటీవల శాసనసభ సమావేశాల్లో కర్నూలు ఎమ్మెల్యే ఎస్వీ మోహనరెడ్డి, ఎమ్మిగనూర్ ఎమ్మెల్యే బి జయనాగేశ్వరరెడ్డి మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ ప్రాజెక్టు వద్ద స్లూయిజ్‌ను నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు స్పందించి ఈ సీజన్‌లోనే గేట్ల నిర్మాణం పూర్తి చేసి, స్లూయిజ్‌ను నిర్మిస్తామని సభాపూర్వకంగా హామీ ఇచ్చారు. ఆయా మరమ్మతుల కోసం నీరు-చెట్టు కార్యక్రమంలో భాగంగా రూ. 1.96 కోట్లను జిల్లా కలెక్టర్ మంజూరు చేసారన్నారు. ఫ్యాబ్రికేషన్ స్టాప్‌లాగ్ గేట్ ఎలిమెంట్ల నిర్మాణం కోసం అవసరమైన డిజైన్లు ఖరారైన వెంటనే మరమ్మతులు చేపడతామన్నారు. రూ. 128 కోట్ల వ్యయంతో సాగునీటి అంతరాన్ని భర్తీ చేసేందుకు ప్రోత్సాహక పథకంలో భాగంగా గాజులదిన్నె ప్రాజెక్టు ఆధునీకరణ పనులను చేపట్టాలని ప్రతిపాదించినట్లు మంత్రి వివరించారు. ఈ వేసవిలోనే ప్రాజెక్టు ఆధునీకరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని రైతు సంఘాల నేతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

బడ్జెట్‌లో కేటాయింపులు నిల్

రాష్ట్రంలో భారీ నీటిపారుదల ప్రాజెక్టుల్లో ఏడింటికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం 2018-19 బడ్జెట్‌లో మధ్య తరహా నీటి ప్రాజెక్టులకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. మరికొన్నింటికి అరకొరగానే నిధులు మంజూరు చేసింది. ముఖ్యంగా గాజులదిన్నె ప్రాజెక్టు సహా స్వర్ణముఖి బ్యారేజ్, తెన్నేటి విశ్వనాథం పెద్దేరు జలాశయం, వెలిగల్లు, ఆంధ్ర రిజర్వాయర్, భైరవానితిప్ప ప్రాజెక్టు, కంభం చెరువు, గండిపాలెం ప్రాజెక్టు, కోనాం, లోయర్ సగిలేరు, మద్దిగెడ్డ, మద్దిలేరు జలాశయం, మోపాడ్ చెరువు, పెన్నార్ కుముదవతి ప్రాజెక్టు, రైవాడ, రాళ్లపాడు జలాశయం, సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు, అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు, వరదరాజస్వామిగుడి ప్రాజెక్టు, విజయరాయి అనకట్ట పథకం, ఒట్టిగడ్డ ఇలా అనేక ప్రాజెక్టులకు బడ్జెట్‌లో మొండిచెయ్యి చూపింది. కాగా సీఎం డ్యాష్‌బోర్డులో మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టులుగా పేర్కొన్న 17 ప్రాజెక్టుల్లో ఏఒక్కదానిలోనూ చుక్కనీరు లేకపోవడం గమనార్హం.

ఏపీ స్పందన కోసం

ఎదురుచూస్తున్నాం : జైట్లీ

న్యూఢిల్లీ- విశాలాంధ్ర బ్యూరో



ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అంశంపై కేంద్రం మరోమారు స్పందించింది. ప్రత్యేక ప్యాకేజీ నిధులు పంపిణీ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పందన కోసం ఎదురుచూస్తూనే ఉన్నామని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. శనివారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడుతూ నిధులిచ్చే విషయంలో తమవైపు నుంచి ఏవిధమైన ఆలస్యం లేదన్నారు. ప్రత్యేక హోదాకు బదులుగా ప్యాకేజీ ఇచ్చే విధివిధానాలపై 2016 సెప్టెంబర్‌లోనే అంగీకారం కుదిరిందని చెప్పారు. అయితే ఈ ఏడాది జనవరిలో నిధుల స్వీకరణపై రాష్ట్ర ప్రభుత్వం మాట మార్చిందన్నారు. నాబార్డు ద్వారా నిధులివ్వాలని కోరిందని, దీనివల్ల ఆర్థికలోటు ఎక్కువై అప్పులు చేయడానికి ఇబ్బంది వస్తుందని జైట్లీ తెలిపారు. అందువల్లే నాబార్డ్ నుంచి నిధుల మళ్లింపునకు స్పెషల్ పర్పస్ వెహికల్‌ను ఏర్పాటు చేయాలని సూచించామన్నారు. దీనిపై కార్యాచరణతో వస్తామని ఫిబ్రవరి 7న రాష్ట్ర అధికారులు చెప్పారని, ఇప్పటి వరకూ ఎవరూ రాలేదని తెలిపారు. 2015 నుంచి 2020 వరకూ ఏపీకి ఉండే రెవెన్యూ లోటును 14వ ఆర్థిక సంఘం లెక్కించి ఇస్తుందన్నారు.

అధికారుల వైఫల్యమే

(మొదటిపేజీ తరువాయి)

పెంచేదిగా ఉండాలి. తప్పు జరగకూడదు, ఒకవేళ జరిగితే సకాలంలో సమర్థంగా సరిదిద్దాలి. అంతేతప్ప ఉదాసీనత, నిర్లక్ష్యాన్ని సహించేది లేదు' అని ముఖ్యమంత్రి అధికారులను హెచ్చరించారు. గుంటూరులో అతిసార ప్రబలడం, అనంతర పరిణామాలను మంత్రి నారాయణ, పట్టణాభివృద్ధి శాఖ అధికారి కన్నబాబు వివరించారు. దీనిపై ఇప్పటికే విచారణ చేపట్టామని, తాగునీటి పైపులైన్లను యుద్ధప్రాతిపదికన మారుస్తున్నామని, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ గుంటూరు ఘటనపై వెంటనే సమగ్ర నివేదిక పంపాలని ఆదేశించారు. బాధితులను వెంటనే పరామర్శించలేక పోయారని, ప్రకటించిన పరిహారం కూడా వెంటనే అందించలేక పోయారని సీఎం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పట్టణాలు, నగరాలలో పైపులైన్ల లీకేజీలపై తక్షణమే స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. మురుగు కాలువలన్నీ శుభ్రపరచాలని, శిథిలావస్థకు చేరిన పాత పైపులైన్లు తొలగించి కొత్తలైన్లు వేయాలని సూచించారు. రోడ్లు కొట్టేయడం, గుంతలు అలాగే వదిలేయడంతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు.

సూపర్ వైజర్లను నియమించుకోవడంలో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేయడాన్ని తప్పుబట్టారు. పట్టణ ప్రజల ఆరోగ్య రక్షణ బాధ్యత అధికార యంత్రాంగానిదేనని స్పష్టం చేశారు. తాగునీటి నమూనాలు విధిగా సేకరించాలని, రక్షిత నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. ఇటువంటి దుర్ఘటనలు పునరావృతం కారాదని, బాధ్యతారాహిత్యాన్ని సహించేది లేదని సీఎం హెచ్చరించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో జిల్లాల కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, పట్టణాభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

సమాధానం చెప్పాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

శ్రీనివాస్, పైడి కొండల మాణిక్యాలరావు, కావూరి సాంబశివరావు, కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు వైఖరిపై అమిత్‌షా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు బీజేపీ నేతలు చెప్పారు.

అయితే ప్రస్తుతం ఇక్కడ ఒంటరిగానే పోటీ చేయటం వల్ల పార్టీకి లాభం చేకూరుతుందని బీజేపీ భావిస్తోంది. అంతేకాక బీజేపీని ప్రజల్లోకి ఏ విధంగా తీసుకువెళ్లాలి అనే అంశంపై దిశాదశను అమిత్‌షా ఏపీ నేతలకు నిర్దేశించారు. అంతేకాక ఏపీలో బీజేపీని ఉన్నత స్థాయిలోకి తీసుకువెళ్ళే బాధ్యతలను రామ్‌మాధవ్‌కు అప్పగించారు. అమిత్‌షాతో సమావేశం తర్వాత రామ్‌మాధవ్ మాట్లాడుతూ ఇప్పటి వరకు బీజేపీ, టీడీపీ కలిసి ఉన్నాయని, ఇప్పుడు బీజేపీ ఏపీలో ప్రతిపక్షంగా మారిపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

ప్రతిపక్ష హోదాలోనే తాము ఏపీ ప్రభుత్వంపై అనేక ప్రశ్నలు సంధిస్తామని వాటికి సమాధానం చెప్పేందుకు ఏపీ నేతలు సిద్ధంగా ఉండాలన్నారు. ఏపీ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని, హోదాకు సమానమైన ప్యాకేజీని అందిస్తామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా కేంద్రం ఏపీకి అండగా ఉంటుందన్నారు. త్వరలో జరగనున్న బీజేపీ కార్యవర్గ సమావేశంలో రాజకీయ తీర్మానం చేస్తామని, బీజేపీ నిర్ణయాన్ని ఏపీ ప్రజల ముందు పెడతామన్నారు. ప్రత్యేక హోదా సెంటిమెంటును రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని దానికి సమాధానంగా అభివృద్ధిని తమ పార్టీ చేస్తుందన్నారు. కేంద్రంపై టీడీపీ అవిశ్వాస తీర్మానాన్ని పెట్టడం ద్వారా తమంతట తాముగా బీజేపీకి వ్యతిరేకంగా మారిపోయారన్నారు. బీజేపీ ఏపీ అధ్యక్షుడు హరిబాబు మాట్లాడుతూ విభజన చట్టంలో పేర్కొన్న వివిధ అంశాలను కేవలం మూడున్నర సంవత్సరంలోనే ఏర్పాటు చేశామన్నారు.

పోలవరం ప్రాజెక్టు విషయంలో కేంద్రం పూర్తిగా సహకరిస్తుందన్నారు. ఏపీ బీజేపీ కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసి రాజకీయంగా ప్రజల్లోకి వెళతామన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ తానే అన్ని సాధించానని, కేంద్రం ఏపీకి నిధులు ఇస్తుందని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు యూ టర్న్ తీసుకున్నారని విమర్శలు గుప్పించారు.



కాంక్రీట్ కనోయింగ్ విజేత 'విట్'

విశాలాంధ్ర-నెల్లూరు బ్యూరో : అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్‌కి చెందిన ఇండియా స్టూడెంట్ సెక్షన్ ఆధ్వర్యంలో కృష్ణపట్నం పోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ స్థాయి కాంక్రీట్ కనోయింగ్ పోటీలను కేపీసీఎల్ మెరైన్ ప్రెసిడెంట్ కెప్టెన్ ప్రదీప్ గౌర్, పీఆర్ హెడ్ వేణుగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ, జాతీయ స్థాయి పోటీలకు కృష్ణపట్నం పోర్టు వేదికగా మారిందన్నారు. సిమెంట్ ఇసుకలతో కూడిన కాంక్రీట్‌తో కనోయింగ్ పడవలను తయారు చేయడంలో సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు చూపిన ప్రతిభను ప్రశంసించారు. అమెరికాలో జరిగే ఈ పోటీలను తొలిసారిగా దేశంలోని కృష్ణపట్నం పోర్టులో నిర్వహించడం విశేషం. దేశంలోని వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల, చెన్నైకి చెందిన బన్నారీ అమ్మన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల, బెంగళూరుకు చెందిన ఆర్‌వి ఇంజనీరింగ్ కాలేజీ, పంజాబ్ ఇంజనీరింగ్ కాలేజీ, నార్సీముంజి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ (ముంబై) కళాశాలలకు చెందిన సివిల్ ఇంజనీర్ విద్యార్థులు 150 మంది పోటీల్లో పాల్గొన్నారు. వీరందరూ కృష్ణపట్నం పోర్టులోనే తమ కనోయింగ్ బోట్లను కాంక్రీట్‌తో స్వయంగా తయారు చేసుకున్నారు. తయారు చేసిన కనోయింగ్ పడవలను ప్రదర్శనకు ఉంచారు. జాతీయ స్థాయి పోటీల్లో భాగంగా కాంక్రీట్ కనోయింగ్ పడవలను మూడు విభాగాల్లో పరీక్షించి విజేతలను ఎంపిక చేశారు. తొలుత డిజైనింగ్ టెస్టింగ్, ఫ్లోటింగ్ టెస్టింగ్, రైడింగ్‌లో ఐదు కళాశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఆసక్తికరంగా జరిగిన కనోయింగ్ పోటీల్లో వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(విట్) విద్యార్థులు విజేతలుగా నిలిచారు. న్యాయనిర్ణేతలుగా వరంగల్ నిట్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగ అధిపతి గర్లేష్ కుమార్, బాంబే ఐఐటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగ అధిపతి బాలాజీలు వ్యవహరించారు. గెలుపొందిన వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(విట్) కళాశాల విద్యార్థులు అమెరికాలో జరుగనున్న అంతర్జాతీయ కాంక్రీట్ కనోయింగ్ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. కాంక్రీట్ కనోయింగ్ పోటీల నిర్వహణలో కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం, యాచింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అందించిన సహకారం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో కేపీసీఎల్ సీఓఓ సుబ్బారావు, కెప్టెన్ రవీంద్ర, బాబు రాజేంద్రప్రసాద్, పోర్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

విహారం.. విషం.. విషాదం

- విష వాయువుకు నలుగురు మృత్యువాత
- శోకసంద్రంలో ఉపమాక
- కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు
- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా, చంద్రన్న బీమా






విశాలాంధ్ర-నక్కపల్లి : వారంతా నిరుపేదలు, పైగా దళితులు, ప్రతి రోజూ కూలి పనికి వెళితే కానీ వారి పోషణ గడవని పరిస్థితి. ఆ ఇంటి కుటుంబ పెద్దలను సెప్టిక్ ట్యాంక్ రూపంలో బలిగొన్న విషాద సంఘటన విశాఖ జిల్లా నక్కపల్లి మండలం ఉపమాక గ్రామంలో చోటుచేసుకుంది.

శనివారం కొత్త అమావాస్య కావడంతో అంతా పండగ సరదాలో ఉన్నారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో సెప్టిక్ ట్యాంక్‌లో దిగిన నలుగురు విష వాయువు బారినపడి మృత్యువాత పడగా ఒకరు మాత్రం బయటపడగలిగారు. ఈ విషాద సంఘటనతో ఉపమాక గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. వివరాల్లోకి వెళితే.. విశాఖ జిల్లా నక్కపల్లి మండలం ఉపమాక గ్రామంలో హరిజన కాలనీకి చెందిన కాండ్రకోట అప్పారావు(50) తన ఇంట్లో సెప్టిక్ ట్యాంకు నిండిపోవడంతో కొత్తగా మరొక ట్యాంకును నిర్మించాడు. శనివారం ఉదయం పదకొండు గంటల సమయంలో సెప్టిక్ ట్యాంకులోకి తన కుమారుడు కాండ్రకోట రాజశేఖర్(28) సహాయంతో నిచ్చెన వేసుకొని దిగాడు. పాత ట్యాంకులోని నీరును కొత్త ట్యాంకులోకి పోయేందుకు రంధ్రం చేస్తుండగా ట్యాంకులోంచి విషవాయువు బయటకు రావడంతో స్పృహ తప్పి అప్పారావు ట్యాంకులోకి పడిపోయాడు. దీన్ని గమనించిన కుమారుడు రాజశేఖర్ తండ్రిని రక్షించే ప్రయత్నంలో ట్యాంకులో దిగి అతను కూడా విష వాయువుతో ఊపిరాడక ట్యాంకులో పడిపోయాడు. వీరిని గమనించిన అప్పారావు సోదరుని కుమారుడు సత్తిబాబు ట్యాంకులోకి దిగగా అతను పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు అతడ్ని పైకి లాగడంతో అతను ప్రాణాప్రాయంనుంచి బయటపడ్డాడు. అయితే లోపలున్న వారిని బయటకు తెచ్చేందుకు అప్పారావు సోదరుని కుమారులు కాండ్రకోట కృష్ణ(30), కాండ్రకోట నాగేశ్వరరావు(30) సోదరుడిని రక్షించబోయి వారు కూడా ట్యాంకులో పడిపోయారు. ఇలా ఒకరి తరువాత ఒకరు పడిపోవడంతో స్థానికులు తాళ్ల సహాయంతో వారిని బయటకు తీశారు. అప్పటికే వారు అచేతన స్థితిలో పడిఉన్నారు. కాండ్రకోట సత్తిబాబును హుటాహుటిన నక్కపల్లి 30 పడకల ఆస్పత్రికి తరలించగా వైద్యం అందించడంతో అతను మృత్యుంజయుడుగా బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్.ఐ పైల సింహాచలం సంఘటనా స్థలానికి చేరుకొని అచేతన పరిస్థితిలో ఉన్న వారికి సీపీపీ(గుండెలపై గుద్ది) వారిని రక్షించే ప్రయత్నం చేశారు. అప్పటికి వారు స్పృహలోకి రాకపోవడంతో తన జీపులో కొంతమందిని, అంబులెన్సులో కొంతమందిని ఆస్పత్రికి తరలించారు. విషయ తెలుసుకున్న డాక్టర్లు వారిని పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు.

శోక సముద్రంలో దళిత వాడ

ఇంటి పెద్దలు తమ కళ్లముందు మరణించడంతో మృతుల కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు పలువురిని కంట తడిపెట్టించింది. మృతుడు కాండ్రకోట అప్పారావు అతని కొడుకు రాజశేఖర్ రోజు తాపీ పనికి వెళ్లి తమ కుటుబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం జరిగిన సంఘటన వారి కుటుంబాలను రోడ్డు పడేసింది. రాజశేఖర్‌కు వివాహమై ఒక బాబు ఉన్నాడు. ఇంటి పెద్ద మృతి చెందడంతో అతని భార్యను ఓదార్చడం ఎవ్వరి వల్లా కాలేదు. మృతి చెందిన కాండ్రేగుల నాగేశ్వరరావుకు ఏడు సంవత్సరాల బాబు ఉన్నాడు . తన భర్త కనిపించని లోకాలకు వెళ్ళిపోయి తమను అనాధను చేశాడని అతని భార్య విలపిస్తున్న తీరు పలువురిని కంట తడిపెట్టించిది. అతని సోదరుడు కాండ్రేగుల కృష్ణకు ఇంకా వివాహం కాలేదు. ఇంటి పెద్దలు మృతి చెందడంతో మా కుటుంబానికి దిక్కు ఎవ్వరు అంటూ ఆమె తల్లి విలపిస్తోంది.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే, జేసీ పరామర్శ

ఎమ్మెల్యే వంగలపూడి అనిత, జాయింట్ కలెక్టర్ సృజన స్థానిక 30 పడకల ఆస్పత్రికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. అధైర్యపడవద్దని, అండగా ఉంటామని వారికి ధైర్యం చెప్పారు. తక్షణమే మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ఉపాధి, గృహ నిర్మాణం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ముందుగా ఆర్డీవో కోరాడ సూర్యారావు ఆస్పత్రికి చేరుకొని మృతుల వివరాలను తహశీల్దార్ రాణి అమ్మాజీని అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులను ఎంపీడీవో పిడుగు ఉమా మహేశ్వరరావు, ఈవోఆర్డీ పి.ఎస్.కుమార్, టీడీపీ మండల పార్టీ నాయకుడు కురందాసు నూకరాజు, జెడ్పీటీసీ రాగిణి వెంకటరమణ, జిల్లా కోఆప్షన్ సభ్యుడు కొప్పిశెట్టి కొండబాబు, బుజ్జి, ఎంపీటీసీ హరి, కళ్లేపల్లి బాబ్జీరాజు, దేవవరపు శివ, వైసీపీ నాయకులు వీసం రామకృష్ణ తదితరులు మృతుల కుటుంబాలను పరామర్శించారు.

విహార యాత్రలో విషాదం

- ఇద్దరు విద్యార్థులు గల్లంతు
- ఒకరి మృతదేహం లభ్యం
- రెండవ దాని కోసం గాలింపు



విశాలాంధ్ర-బాపట్ల : గుంటూరు జిల్లా బాపట్ల మండలంలోని సూర్యలంక సముద్ర తీరంలో ఇద్దరు విద్యార్థులు గల్లంతైన సంఘటనతో తీరంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రూరల్ ఎస్.ఐ గళ్ళా రవికృష్ణ తెలిపిన కథనం ప్రకారం గుంటూరు జిల్లా నర్సరావుపేట మండలంలోని జొన్నగడ్డ వద్ద గల తిరుమల ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు శనివారం విహార యాత్రలో భాగంగా సూర్యలంక సముద్ర తీరానికి చేరుకొన్నారు. 30 మంది విద్యార్థులతో వచ్చిన బృందం తీరంలో స్నానాలు చేస్తున్న సమయంలో రాకాసి అలలకు ఇరువురు విద్యార్థులు గల్లంతు అయినట్లు ఎస్.ఐ తెలిపారు. అలల ఉధృతికి కొట్టుకొనిపోయే వారిని రక్షించేందుకు పోలీసులు, స్నేహితులు, మత్స్యకారులు ప్రయత్నించినా ఇద్దరు విద్యార్థులు వల్లూరి బాబు, నన్నూరి అశోక్‌కుమార్ గల్లంతు కావడంతో విహారయాత్రకు వచ్చిన వారిలో విషాదం నిండుకొన్నది. ఈ విద్యార్థులు వల్లూరి పోలయ్య, నన్నూరి శ్రీనివాసరావుల కుమారులుగా గుర్తించారు. విద్యార్థులు తమ మిత్రుల కోసం గాలిస్తూ కన్నీరుమున్నీరుగా విలపించారు. గల్లంతైన వారిలో అశోక్‌కుమార్ మృతదేహం 6.30 గంటల సమయంలో పొగరు ప్రాంతానికి కొట్టుకొని రాగా వల్లూరి బాబు జాడ మాత్రం కనిపించ లేదని ఎస్.ఐ తెలియజేశారు. సముద్రం పోటు మీద ఉన్నందున రెండవ విద్యార్థి కూడా త్వరగానే ఒడ్డుకు చేరుకొంటాడని ఆశాభావం వ్యక్తం చేశారు. మృతి చెందిన అశోక్‌కుమార్ మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించి ప్రమాదవశాత్తు కింద కేసు నమోదు చేసి విచారణను చేపడతున్నామని ఎస్.ఐ రవికృష్ణ తెలియజేశారు.

గుంటూరు కమిషనర్‌పై బదిలీవేటు

- అతిసార వ్యాధి విజృంభించడంతో చర్యలు
- నూతన కమిషనర్‌గా విజయనగరం జేసీ

విశాలాంధ్రబ్యూరో-గుంటూరు : గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా అనురాధపై బదిలీవేటు పడింది. ఈమెను బదిలీ చేస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. గుంటూరు నగరంలో అతిసారవ్యాధి ప్రబలి 17 మంది మృతిచెందారు. 2000 మంది వ్యాధిబారిన పడి ఆసుపత్రిలలో చికిత్స పొందారు. ఇప్పటికీ అతిసార వ్యాధి ఉధృతి తగ్గలేదు. దీంతో కమిషనర్ అనురాధను బదిలీ చేశారు. ఈమెకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఈ విషయంలో 9 మంది నగరపాలకసంస్థ ఉద్యోగులను కూడా సస్పెండ్ చేశారు. విజయనగరం జిల్లా జాయింట్‌కలెక్టర్ శ్రీకేస్ బాలాజీ లఠాఖర్‌ను గుంటూరు నగరపాలకసంస్థ నూతన కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించే అవకాశాలున్నాయి.

17కు పెరిగిన అతిసార మృతులు

గుంటూరు నగరపాలకసంస్థ పరిధిలో కలుషితనీరు తాగి మృతిచెందుతున్నవారి సంఖ్య రోజురరోజుకు పెరుగుతోంది. శనివారం గుంటూరు జీజీహెచ్‌లో మరో 43మంది రోగులు చేరారు. దీంతో ప్రభుత్వం నగరపాలక సంస్థ అధికారులపై కన్నెర్ర చేసి బదిలీ వేటు వేసింది.

అతిసారవ్యాధిగా నిర్ధారించని మరో నలుగురు మృతి

గుంటూరులో మరో నలుగురు మృతి చెందినప్పటికీ అతిసారవ్యాధిగా వైద్యులు ధ్రువీకరించ లేదు. ఇతర వ్యాధులతో మృతిచెందారని డాక్టర్లు చెబుతున్నారు. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో మృతులపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

కొత్తవలసలో రూ.510 కోట్లతో వికాట్ సిమెంట్

విశాలాంధ్ర-అమరావతి : ఫ్రాన్స్‌కు చెందిన వికాట్ సిమెంట్ కంపెనీ సీఈఓ గైసిడాన్ శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఆయనతో పాటు గైసిడాన్ ఫ్రాన్స్ కాన్సులేట్ జనరల్ ఫ్రాంక్వోయిస్ గౌటీయర్ కూడా ఉన్నారు. విజయనగరం జిల్లా కొత్తవలసలో వికాట్ సిమెంట్ కంపెనీ నెలకొల్పడంపై మార్చి 10న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకుంది. కాల్బర్గీ ఓవర్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నెలకొల్పనున్న ఈ సిమెంట్ కంపెనీని రూ. 510 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారు. ఇందుకోసం సిమెంట్ కంపెనీకి 200 ఎకరాలు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఏడాదికి 1.75 మిలియన్ టన్నుల సిమెంట్ ఉత్పత్తిని చేయాలని నిర్దేశించారు. ఫలితంగా 275 మందికి ప్రత్యక్ష్యంగా ఉద్యోగాలు లభించనున్నాయి. ఈ సమావేశంలో ఏపీ ఈడీబీ సీఈఓ జాస్తి కృష్ణకిషోర్, అదనపు డైరెక్టర్ డాక్టర్ ఏ.ఎం. శిరీష్‌లు పాల్గొన్నారు.

ప్రతి లోగిలిలో సంతోషం వెల్లివిరియాలి : సీఎం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : విళంబి నామ సంవత్సరం తెలుగువారి జీవితాల్లో నవ్య కాంతులు నింపాలని, ప్రతి లోగిలిలో సంతోషం వెల్లవిరియాలని, కుటుంబంలో ప్రతి ఒక్కరూ ఆనందంగా గడపాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు, దేశవిదేశాల్లోని తెలుగువారికి ఆయన విళంబి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. 'విళంబి' అంటే సుభిక్షం అని అర్థమని శాస్త్రాలు చెబుతున్నాయని, వచ్చే ఏడాది రాష్ట్రం మరింత సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. తనను విశ్వసించి రాజధాని అమరావతి నిర్మాణానికి 34 వేల ఎకరాల భూములిచ్చారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుని, ఆంధ్రులు గర్వించే రీతిలో రాజధాని అమరావతిని నిర్మిస్తామని చంద్రబాబు ఈసందర్భంగా పేర్కొన్నారు. అమరావతిలో రూ.20 వేల కోట్ల విలువైన మౌలిక సదుపాయాల కల్పన పనులు చురుగ్గా సాగుతున్నాయని చెప్పారు.



గ్రామీణ పశువైద్యశాలలను అప్‌గ్రేడ్ చేయాలి

రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు కె.వి.వి.ప్రసాద్

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) :పశువైద్య విద్యార్థులు, రైతుల శ్రేయస్సు కోసం వారి న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం తక్షణం అమలు చేయాలని రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు కె.వి.వి.ప్రసాద్ డిమాండు చేశారు. ఆంధ్రప్రదేశ్ వెటర్నరీ స్టూడెంట్స్ అండ్ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ (ఏపీవీఎస్‌జీఏ) అధ్వర్యంలో పశువైద్య విద్యా విద్యార్థులు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 17వ రోజు శనివారం గాంధీనగర్‌లోని అలంకార్ ధర్నా చౌక్ వద్ద నిరసన ధర్నా చేపట్టారు.దీనికి ముఖ్యవక్తగా విచ్చేసిన రైతు సంఘం అధ్యక్షులు కె.వి.వి.ప్రసాద్ వారికి సంఘీభావం తెలిపారు. పశువైద్య విద్యార్థుల సమస్యలు న్యాయమైనవని,గతేడాది అందోళనలు చేసినప్పుడు ప్రభుత్వం గ్రామీణ పశువైద్య కేంద్రాలను అప్‌గ్రేడెడ్ చేసి పశు వైద్యశాలలుగా చేస్తామని హామీ ఇచ్చి, దానికి అనుగుణంగా 250 కేంద్రాలను అప్‌గ్రేడెడ్ చేయుగా, 1210 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వెటర్నటీ ఆసుపత్రుల్లోని 500 ఖాళీలు భర్తీ చేయాలని డిమాండు చేశారు. ప్రభుత్వానికి ఈ శాఖ ద్వారా ఏడాదికి రూ.60వేల కోట్ల ఆదాయం వస్తుందన్నారు. ఈ నిరసనలో రైతు సంఘం కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి మలినీడి యలమందరావు, విఎఎస్ అసోసియేషన్ అధ్యక్షులు వసంతరాములు,వెటర్నరి స్టూడెంట్స్ అండ్ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ అధ్యక్షులు మహేంద్రబాబు,వైస్ ప్రెసిడెంట్ యశ్వంత్ నాయుడు, నాగార్జున, సల్మాన్, భార్గవకుమార్, రమ్య, స్వాతీ, కీర్తన, మహేస్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీ పేరుతో లూటీ

- విశాఖలో మరో భూ పందేరం
- సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి జేవీఎస్ఎన్ మూర్తి విమర్శ



విశాలాంధ్ర-విశాఖపట్నం : ముఖ్యమంత్రి తనయుడు నారా లోకేష్ నిర్వహిస్తున్న ఐటీ శాఖలో మరో లూటీ జరుగుతోందని ఉద్యోగాల పేరిట వందలకోట్ల విలువైన భూమిని కారుచౌకగా కట్టబెడుతున్నారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి విమర్శించారు. శని వారం స్థానిక అల్లీపురంలోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ. 400 కోట్ల విలువైన భూమిని కేవలం రూ. 13 కోట్లకే కేటాయించారని దీని వెనుక కోట్లాది రూపాయలు చేతులు మారాయని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండు చేశారు. మదురవాడ సర్వే నెం. 309లో 40 ఎకరాల భూమిని కారుచౌకగా ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ ఇన్వెస్ట్‌మెంట్స్, ఇన్నోవేషన్ సొల్యూషన్స్‌కి ఈనెల 29న సీఎం చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేస్తున్నారని, దీన్ని వెంటనే ఆపాలని డిమాండు చేశారు. ఎకరంలో 1లక్షా30వేల చదరపు అడుగుల్లో కనీసం వెయ్యి మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చని ఇలా మూడు షిఫ్టులలో 1లక్షా 20వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సి ఉండగా ఈ సంస్థ 40 ఎకరాలు కారు చౌకగా తీసుకొని కేవలం 2 వేల మందికే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పడం ఆ సంస్థకు చంద్రబాబు ప్రభుత్వం శంకుస్థాపన చేయడం వెనక వందల కోట్లు చేతులు మారినట్లు తెలుస్తున్న దన్నారు.

విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఇవ్వడానికి ఒడిశా అభ్యంతరం వ్యక్తం చేస్తోందని, ఇన్నాళ్లు సాకు చూపి ప్రజలను పక్కదారి పట్టించిందని, ఇటీవల ఒడిశా సీఎం, ఒడిశా ఎంపీలు రైల్వేజోన్‌పై ఎటువంటి వ్యతిరేకత లేదని స్పష్టంచేశారని చెప్పారు. ఇకనైనా బీజేపి రాజకీయనిర్ణయంతో రైల్వేజోన్ ప్రకటిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏజె స్టాలిన్, జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సహాయకార్యదర్శి జేవీ ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు ఎ విమల, నగర కార్యదర్శి ఎం పైడిరాజు పాల్గొన్నారు.

సిరివెన్నెల, రాఘవాచారిలకు ఉగాది పురస్కారాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఉగాది పండుగను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న 45 మందికి 2018 ఉగాది పురస్కారాలను ప్రకటించింది. ఆదివారం విజయవాడలో జరిగే ఉగాది పురస్కారాల కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ అవార్డులను వారికి ప్రదానం చేయనున్నారు. ప్రముఖంగా పురస్కార గ్రహీతల్లో సాహిత్యరంగం నుండి సినీగేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి, పాత్రికేయ రంగం నుండి ప్రముఖ జర్నలిస్ట్ విశాలాంధ్ర పూర్వ సంపాదకులు సి.రాఘవాచారి వున్నారు. ఇంకా సాహిత్యరంగం నుండి సిరివెన్నెలతోపాటు వేటూరి ఆనందమూర్తి, అన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఎస్‌కే హుస్సేన్ సత్యాగ్ని, ఎంపీ జానుకవి, వి.ప్రభావతి, డాక్టర్ కేవీ కృష్ణకుమారి, డాక్టర్.ఎం.నాగభూషణ శర్మ, ఎ.అప్పలనాయుడు, డాక్టర్ జీవీ పూర్ణచంద్, నాటక రంగం నుండి జయప్రకాష్ రెడ్డి, ఆర్.వేణుగోపాలరావు, డాక్టర్ రావి కృష్ణ, సంగీత రంగం నుండి వి.సత్యనారాయణ, పెమ్మరాజు సూర్యారావు, జె.నాగరాజు, బి.వెంకటేశ్వర్లు, ఎం.ఎం.శ్రీలేఖ, నృత్య రంగంనుండి భాగవతుల వెంకటరామ శర్మ, కళారంగం నుండి డి.దేవికారాణి వుడయార్, దొడ్డి సతీష్, డి.అప్పారావు, పెయింటింగ్‌లో కేఎస్ వ్యాస్, సీహెచ్ కోటేశ్వరరావు, జానపదం నుండి డి.మురళీబాబు, యు.నాగన్న, కె.దాలయ్య, సామాజికసేవా రంగం నుండి ఇందిరాదత్, కె.ధర్మారెడ్డి, గుమ్మడి రాధాకృష్ణమూర్తి, డాక్టర్ పరిణాయుడు, వైద్యరంగం నుండి డాక్టర్ శ్రీధర్ రెడ్డి, డాక్టర్ శశిధర్, ఇమ్మాని శివనాగిరెడ్డి, టెలివిజన్‌లో మంజులనాయుడు, హరికథలో సింహాచల శాస్త్రి, సంగీతంలో ఎస్.మోహనరావు, వాస్తు రంగం నుండి వంగర సత్యనారాయణ, సంగీతం నుండి మోదుమూడి సుధాకర్, సాహిత్యం నుండి ఆర్.ఏకాంబరాచార్యులు, జి.దత్తాత్రేయ శర్మ, ఫొటోగ్రఫీ రంగం నుండి కె.అహోబిలరావులు ఎంపికయ్యారు.

విశ్వరహస్యాన్ని ఛేదించిన స్టీఫెన్ హాకింగ్



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : విశ్వ రహస్యాన్ని ఛేదించిన మానవీయ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ సదాస్మరణీయుడని లయోలా కళాశాల భౌతికశాస్త్ర ఆచార్యుడు డాక్టర్ తుమ్మల శ్రీకుమార్ కొనియాడారు. నాస్తిక సమాజం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం ప్రజాశక్తినగర్‌లోని చంద్ర రాజేశ్వరరావు గ్రంథాలయంలో స్టీఫెన్ హాకింగ్ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భౌతికవాదం ద్వారా సమసమాజానికి కృషి చేసిన స్టీఫెన్ మహనీయుడన్నారు. గెలీలియో-ఐన్‌స్టీన్ సిద్ధాంతం, క్వాంటమ్ సిద్ధాంతం రెంటినీ కలిపి ఒక నూతన సిద్ధాంతాన్ని స్టీఫెన్ ప్రతిపాదించారన్నారు. గగనతలంలో నక్షత్రాలేవీ కూడా శాశ్వతం కావని, కొంతకాలానికి అంతరించి బ్లాక్‌హోల్‌గా మారతాయన్నారు. ఈ బ్లాక్‌హోల్స్‌లో ఏమీ ఉండవన్న సత్యాన్ని స్టీఫెన్ నిరూపించారని తెలిపారు. ఐన్‌స్టీన్‌కు నోబెల్ బహుమతి రాలేదు కానీ తర్వాత శాస్త్రవేత్తలకు మాత్రం వచ్చాయన్నారు. ఏదీ శాశ్వతం కాదు.. చూసే దృక్పథం, స్థానంలో మార్పు, మరణానంతరం జీవితం కూడా లేదని హేతుబద్ధంగా నిరూపించారని తెలిపారు. నాస్తిక సమాజం రాష్ట్ర కార్యదర్శి మోతుకూరి అరుణకుమార్, జనసాహితి కార్యదర్శి దివికుమార్ మాట్లాడుతూ స్టీఫెన్ పరిశోధనలు మన శాస్త్రవేత్తలు, విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ప్రజాహిత నేత కొత్తపల్లి రవిబాబు, ఐఎఫ్‌టీయూ నేత కె పోలారి, విరసం నేత అరసవిల్లి కృష్ణ, నాస్తిక సమాజం నేతలు బి.సుధాకర్, ఎస్‌కే లతీఫ్, జె సత్యనారాయణ పాల్గొన్నారు.

రూ. 30 లక్షల ఎర్రచందనం స్వాధీనం

విశాలాంధ్ర - మైదుకూరు టౌన్ : జిల్లా ఎస్పీ బాబూజీ అట్టాడా అదేశాల మేరకు జిల్లా ఏఎస్పీ (ఆపరేషన్స్) నయీమ్ అస్మీ ఏడుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి వారి నుంచి రూ. 30 లక్షల విలువ చేసే ఎర్రచందనం దుంగలతో పాటు, 4 వాహనాలు, 30 వేల నగదుతో పాటు 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఏఎస్పీ నయీం అస్మీ విలేకరులకు తెలిపిన వివరాల మేరకు.. తమ వద్ద ఉన్న పక్కా సమాచారం మేరకు శనివారం ఓ ప్రణాళికతో పోలీసు అధికారులు దాడులు చేపట్టి, మైదుకూరు - బద్వేలి రహదారిలో కారులో అక్రమ రవాణా చేస్తుండగా వీరి నుంచి మారుతి కారు, ఒక మోటర్ సైకిల్, 6 ఎర్రచందనం దుంగలు, రూ. 20 వేల నగదు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. శనివారం తెల్లవారుజామున ఖాజీపేట కన్నెలవాగు చెరువు సమీపాన కొత్తపేట గ్రామంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా మహారాష్ట్ర నాగ్‌పూర్‌కు చెందిన దలేర్‌సింగ్, జగన్నాథన్ పొన్నయ్య, నల్లు విశయ్యలు వాహనంలో ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డారన్నారు. వీరి వద్ద రూ. 30 వేల నగదు, 10 ఎర్రచందనం దుంగలు, రూ. 10 వేల నగదు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మూడవ కేసు దువ్వూర మండలం కృష్ణంపల్లె గ్రామ సమీపంలో దువ్వూరు పోలీసు స్టేషన్ ఎస్.ఐ, సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా సంగటి రాజు, పాశం వెంకట రమణ ఒక ట్రాక్టర్‌లో తరలిస్తున్న 10 ఎర్రచందనం దుంగలు, ట్రాక్టర్, 2 సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కేంద్ర సర్వీసులకు సీనియర్ ఐపీఎస్‌ల 'క్యూ'



విశాలాంధ్రబ్యూరో - అమరావతి :

రాష్ట్ర క్యాడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారులు కేంద్ర సర్వీసుల బాట పడుతున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఐపీఎస్ అధికారుల కొరత ఉండగా, మంచి పేరున్న అధికారులు కేంద్ర సర్వీసులకు వెళ్లిపోతుండటం గమనార్హం. విభజన సమయంలో రాష్ట్రానికి 145 మంది ఐపీఎస్ అధికారులను కేంద్రం కేటాయించింది. గత జనవరి నాటికి రాష్ట్రంలో మొత్తం 120 మంది ఐపీఎస్ అధికారులు మాత్రమే ఉన్నారు. వారిలోనే 10 మంది కేంద్ర సర్వీసుల్లో ఉండగా, మరో నలుగురు అధికారులు కేంద్ర సర్వీసులకు వెళ్లిపోయారు. ఇటీవల రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ) పోస్టు కోసం విఫలయత్నం చేసిన అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) డీజీపీ ఆర్‌పీ ఠాకూర్‌సైతం కేంద్ర సర్వీసులకు వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. తాజాగా వారం రోజుల క్రితం ఇద్దరు సీనియర్ ఐపీఎస్ అధికారులు కేంద్ర సర్వీసులకు వెళ్లిపోయారు. పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్, 1990 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అతుల్‌సింగ్ సెంట్రల్ విజిలెన్స్ సెల్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లగా, పోలీసు సంక్షేమం అదనపు డీజీపీ అంజనా సిన్హా సీఐఎస్ఎఫ్ ఐజీగా వెళ్లిపోయారు. డిప్యుటేషన్‌పై వెళ్లిన అధికారులంతా కనీసం ఐదేళ్లపాటు ఆయా విభాగాల్లో పని చేయాల్సి ఉంది. కొందరు పదవీకాలం పూర్తయినప్పటికీ, రాష్ట్రానికి వచ్చేందుకు ఇష్టపడటంలేదని సమాచారం. ఈ ఏడాది ఆరంభంలోనే ఐజీ ఎస్ మధుసూదన్‌రెడ్డి నేషనల్ పోలీసు అకాడమీకి డిప్యుటేషన్‌పై వెళ్లిపోయారు. ఇప్పటికే సీనియర్ ఐపీఎస్ అధికారులు వీఎస్‌కే కౌముది, సంతోష్ మెహ్రా, పీఎస్‌ఆర్ ఆంజనేయులు కేంద్ర సర్వీసుల్లో ఉన్నారు. కేంద్ర సర్వీసులకు వెళ్లిన వారి పోస్టులలో ఇన్‌చార్జిలను మాత్రమే నియమించారు. ఇటీవల అదనపు డీజీపీలుగా ముగ్గురికి పదోన్నతులు లభించగా, మరో ఇద్దరికి డీజీపీలుగా పదోన్నతి లభించాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఐపీఎస్ అధికారుల బదిలీలు చేపట్టాల్సి ఉంది.

తగిన గుర్తింపు లభించకే...!

రాష్ట్రంలో ఐపీఎస్ అధికారులకు పదోన్నతులు, పోస్టింగ్స్ విషయంలో తగిన న్యాయం జరగటంలేదనే కేంద్ర సర్వీసులకు వెళ్లాలని నిర్ణయించుకోవటం గమనార్హం. దీంతో రాష్ట్రంలో కీలక విభాగాలు ఖాళీ అవుతున్నాయి. ప్రభుత్వం కొత్త పోలీసు చట్టాన్ని తీసుకు వచ్చి ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ ఎం మాలకొండయ్యను డీజీపీగా నియమించారు. అయితే ఆర్టీసీ వీసీ అండ్ ఎండీగా ఆయనకే అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆర్టీసీ వీసీ అండ్ ఎండీగా పని చేసిన వారే డీజీపీ కావటం రాష్ట్రంలో ఆనవాయితీగా వస్తోంది. డీజీపీ పోస్టు కోసం ఎదురు చూసిన ఏసీబీ డీజీజీ ఆర్‌పీ ఠాకూర్ రాష్ట్రంలో ఉండేకన్నా కేంద్ర సర్వీసులకు వెళ్లిపోవటం మంచిదనే యోచనలో ఉన్నట్లు సమాచారం. తాజాగా ఇద్దరు అధికారులకు కేంద్ర సర్వీసులు రావటంతో, ఇతర అధికారులు కూడా ఆ వైపు చూస్తున్నట్లు సమాచారం. కేంద్ర సర్వీసుల్లో సుమారు 50 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డీఐజీస్థాయి నుంచి అదనపు డీజీపీ, డీజీపీస్థాయి అధికారులను ఆయా సర్వీసులకు డిప్యుటేషన్‌పై తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సీనియర్ ఐపీఎస్ అధికారులకు తగిన గుర్తింపు ఇవ్వటంతోపాటు బదిలీలు నిర్వహిస్తే తప్ప కేంద్ర సర్వీసులకు వలసలు ఆగే సూచనలు కనిపించటంలేదు.

సంపాదకీయం

ప్రకృతే మన ప్రాణరక్ష!

ప్రకృతి వరప్రసాదమే సకల చరాచర సృష్టి. ఈ జీవరాశుల్లో మనిషీ ఒక భాగమే. ప్రకృతి అంతా తన కోసమేనన్న మనిషి భావన ఓ భ్రమ, భ్రాంతే. ప్రకృతి దృష్టిలో ఏ జీవీ ఒంటరి కాదు. అన్నీ సమానమే. నేలకూ మొక్కలకు, మొక్కలకూమొక్కలకు, మొక్కలకూజంతువులకు మధ్య మనం చూడలేని అనుబంధం, ఓ జీవన వలయం ఉంది. ప్రకృతి ఓ వల. ఓ చిన్నప్రాణి నుంచి మనిషి దాకా ప్రతిజీవి దాని తీగలే. ఓ చిన్న అల్లికపోగును ధ్వంసంచేసినా... మిగతావీ దెబ్బతింటాయి. జీవవలయం కాస్తా విలయంగా మారుతుంది. మూర్ఖత్వంతో, నిలువెల్లా నిండిన స్వార్థంతో మనిషిలో ఈ స్పృహ లోపిస్తున్నది. తన సుఖం, సౌఖ్యం, సౌకర్యాలకోసం ఆరాటపడు తున్నాడు.. తెగబడుతున్నాడు. తాను సౌఖ్యవంతమైన అత్యాధునిక జీవనాన్ని అనుభవిస్తున్నానని ఆనందిస్తున్నాడే తప్ప, తనెక్కిన కొమ్మను తానే నరుక్కుంటున్నానన్న వాస్తవాన్ని గుర్తించలేకపోతున్నాడు. ఆ ప్రమాదం ముంచుకొస్తుందని తెలిసినా దానికి గురయ్యేది తాను కాదుగా, భవిష్యత్తు తరాలుగా అన్న భావనతో చెలరేగిపోతున్నాడు. ప్రకృతిని విధ్వంసం చేస్తూ స్వవినాశనాన్ని కొనితెచ్చుకొంటున్నాడు. 'ఆఖరి చెట్టును కూడా కొట్టేసిన తర్వాత.. తుట్టతుది నదిని కూడా విషతుల్యం చేసిన తర్వాత.. చిట్టచివరి చేపను కూడా పట్టేశాక... అప్పుడు గుర్తిస్తావు నువ్వు మనం డబ్బును తినలేమని!'.. ఇది ఆదిమ రెడ్ ఇండియన్ల సామెత. ఇప్పుడు మనం దాదాపు ఈ దిశగానే శరవేగంగా పరుగులు పెడుతున్నాం. ప్రకృతిలో పచ్చదనానికి ప్రథమ ప్రాధాన్యం ఉంది. గడ్డిపరకనుంచి మహావటవృక్షం దాకా మొక్కలోని ప్రత్యంగమూ మానవజాతికి చేస్తున్న ఉపకారాలను ఏకరువు పెడుతూ పోతే ఎన్ని ఉద్గ్రంథాలైనా చాలవు. భారతరామాయణాలు, బైబిల్, ఖొరాన్ కన్నా ప్రకృతి పాఠమే గొప్పదనేది ప్రతి ఒక్కరూ అంగీకరించాలి. పంట పొలాలన్నీ లక్ష్మీనివాసాలని ప్రాచీనుల భావన. అన్ని మతాలలో వృక్షాలకు విశేషమైన ప్రాముఖ్యం ఉంది. బౌద్ధ హీనయాన సంప్రదాయ శిల్పకళా ఖండాల్లో తథాగతుడికి సంకేతం బోధివృక్షమే. యూదుల ఆధ్యాత్మిక సంప్రదాయాల్లో సృష్టి అంటే జీవవృక్షం. యూరోపియన్లు ఇగ్డ్రాసిత్ మహావృక్షంగా అభివర్ణించేది ఈ జీవవృక్షాన్నే. అణు యుద్ధంలో అంతా సర్వనాశనమైపోయినా బీజరూపంలో భూగర్భంలో దాగి అదును చూసుకొని తిరిగి మొలకెత్తే బతుకు చేవ... సృష్టి మొత్తంలో ఒక్క మొక్కకే ఉందంటారు నోబెల్ గ్రహీత జగదీశ్ చంద్రబోస్. జంతువులూ మనిషి మనుగడకు ఎంతో మేలు చేస్తున్నాయి. మనిషి ఆహారచక్రంలో ఈ రెండింటి పాత్ర అత్యంత కీలకమైంది. ఈ భూమ్మీద, సముద్రంలో ఇప్పటివరకు మనిషి గుర్తించ గలిగిన జీవజాతుల రకాలు పదికోట్లకుపైనే అని అంచనా. ఇంకా గుర్తించాల్సినవెన్నో ఉన్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వీటిలో ఏటా దాదాపు పదివేల రకాల మొక్కలు లేదా జంతువులు విలుప్తమవు తున్నాయని వరల్డ్ వైడ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) లెక్కగట్టింది. అంటే ఈ జీవజాతులు అంతరిస్తున్నాయంటే అంతిమంగా మనిషికే నష్టమనే వాస్తవాన్ని మనిషి గుర్తించలేకపోతున్నాడు.

మన తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే 33 శాతం ఉండాల్సిన అడవులు ఇప్పుడు 22 శాతానికి తగ్గిపోయాయి. వీటిలో దట్టమైన అడవి కేవలం 11 శాతమే. ఏటేటా ఈ శాతం తగ్గిపోతోంది. నగరీకరణ పేరిట అడవుల విధ్వంసానికి పాలకులే అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. దీనివల్ల జీవవైవిధ్యం సన్నగిల్లుతోంది. అనేక జీవజాతులు అంతరించిపోతున్నాయి. 1952 తర్వాత రాష్ట్రంలో చీతా జాడే కానరావడంలేదు. ఒకప్పుడు ఎక్కువగా కనిపించిన పింక్ హెడెడ్ డక్ ఇప్పుడు మచ్చుకు కూడా లేదు. పులులు, కాకులు, పిచ్చుకలు, పాలపిట్టలు.. ఇలా ఎన్నో రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. ఒంగోలు గిత్త పేరుచెబితే తెలుగువారి ఛాతీ ఓ అంగుళం పెరుగుతుంది. ఇంతటి గర్వకారణమైన ఆ జాతి పశువులు నేడు వందల్లోనే ఉన్నాయంటే మనం ఏ పరిస్థితిలో ఉన్నామో తెలుస్తోంది. ప్రకృతికి ఆరోగ్య సూచికగా భావించే బట్టమేకపిట్టల సంఖ్య నేడు 20కు మించిలేదు. ఒకనాడు లంకమలై అటవీ ప్రాంతంలో వేల సంఖ్యలో కలివికోడి పక్షులు ఉండేవి. నేడు దాదాపు అంతర్ధానమయ్యాయి. 1985లో ఒక కలివికోడి కన్పించడంతో ఈ ప్రాంతాన్ని ఆ పక్షుల రక్షిత అడవిగా ప్రకటించారు. పొట్టిగా ఉండి, అత్యధిక వెన్న శాతం కలిగిన పుంగనూరు ఆవులను వేళ్లమీద లెక్కించాల్సిన దుస్థితి నెలకొంది. కిచకిచల ధ్వని తగ్గిపోయింది. బెకబెకలూ ఆ కోవలోకి వచ్చే ప్రమాదం ఉందని చెబుతున్నారు. రాబందుల రెక్కల చప్పుడు ఎప్పుడో ఆగిపోయింది. పిల్లల్ని పరుగులెత్తించే తూనీగలు, సీతాకోకచిలుకలు అరుదైపోతున్నాయి. పితురుడిగా భావించే కాకులు, కదలని పనికి సామ్యంగా చూపే నత్తగుల్లలు, తాబేళ్ల వంటి జీవరాసులతోబాటు అనేక జంతు వృక్షజాతులు కనుమరు గవుతున్నాయి. అంతెందుకు మనిషి గూడు కట్టుకోవడం నేర్చుకొన్న దగ్గర్నుంచీ అతనితో కలిసి జీవిస్తూ, మనకు కీడుచేసే కీటకాలను హరించే సాధుజీవి బల్లి నేడు అదృశ్యమైపోయే ప్రమాదంలో పడింది. బల్లులు పాకేందుకు వీలుగా లేని గోడలు కడుతూ వాటిని మనిషే అంతం చేస్తున్నాడు. అడవుల క్షీణత, హైబ్రీడ్ వంగడాల సాగు, ఇష్టానుసారంగా క్రిమిసంహారకాల వినియోగమే ఈ జీవవైవిధ్యం క్షీణించడానికి ప్రధాన కారణం. అంతేకాదు, క్రిమిసంహారకాల అవశేషాలున్న ఆహారాన్ని భుజిస్తూ తను తవ్విన గోతిలో తానే పడుతున్నాడు. పరిస్థితి ఎంతగా విషమించిందంటే నేడు తల్లిపాలలో కూడా క్రిమిసంహారకాల అవశేషాలు కనిపిస్తున్నాయంటే మనం ఎంతటి పతనావస్థలో చిక్కుకుపోతున్నామో అర్థంచేసుకోవచ్చు.

మనిషి చేస్తున్న ఈ విధ్వంసంపై నిరసన వెల్లువెత్తుతూనే ఉంది. ఫలితంగానే పర్యావరణ స్పృహ కనీసం కొందరిలోనైనా అంకురించింది. సాహిత్యమూ జీవవైవిధ్యాన్ని పరిరక్షించాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తూ అక్షరాస్త్రాలు సంధిస్తోంది. ఇందుకు ఆద్యురాలు అమెరికాకు చెందిన రేచల్ కార్సన్. రసాయనిక పరిశ్రమల కారణంగా పర్యావరణం ఎంతగా దెబ్బతింటుందో, జీవజాతుల మనుగడకు ఎంత ముప్పుగా మారుతుందో వివరిస్తూ ఆమె ఓ ఉద్యమమే చేశారు. ఏకంగా ఆమె ఈ ముప్పు గురించి వివరిస్తూ సైలెంట్ స్ప్రింగ్ అనే పుస్తకం వెలువరించారు. బహుళజాతి కంపెనీలు ఆమెపై కమ్యూనిస్టు అంటూ ముద్రవేశాయి. నేటి పర్యావరణ ఉద్యమాలు, ఒప్పందాల పునాదికి ఆమె కృషే నాందీవాచకమైంది. సృష్టిలోని ఏ ఒక్క అల్పప్రాణిని అంతంచేసినా, దాని ఫలితంగా ఇంత పెద్ద భూగోళం ఏదో ఒకనాడు కకావికలం కాక తప్పదంటూ సీతాకోకచిలుక నేపథ్యంగా రే దగ్లస్ రాసిన 'ఏ సౌండ్ ఆఫ్ థండర్' కథ హెచ్చరించింది. విజ్ఞానశాస్త్రానికి, తాత్విక చింతనకు మధ్య ఓ బిందువు దగ్గర ఎప్పటికీ దేదీప్యమానంగా వెలిగే ప్రాపంచిక సత్యాన్ని ఈ కథ అందించింది. మొరటు మనిషి తన గుడిసెలో కాపురం పెట్టిన పిచ్చుకలను చూసి తాను ఎలా క్షాళనం చేసుకున్నాడో ఖ్వాజా అహమ్మద్ అబ్బాస్ ఉర్దూలో రాసిన అబాబీల్ (స్పారోస్)లో అద్భుతంగా వివరించాడు. పక్షులు, జంతువులు మనిషి జీవితానికి మార్గదర్శకంగా నిలిచేతీరుకు ఈ కథ అక్షరరూపం ఇచ్చింది. పక్షులను మనిషి చిన్నచూపు చూడడాన్ని నిరసిస్తూ జాషువా 'గబ్బిలం' ఖండకావ్యం వెలువరించారు. 'ఆకులో ఆకునై పూవులో పువ్వునై కొమ్మలో కొమ్మనై నునులేత రెమ్మనై ఈ యడవి దాగిపోనా ఎటులైన నిచటనే యాగిపోనా' అంటూ కృష్ణశాస్త్రి పలవరించినట్లు వన సౌందర్యానికి ముగ్ధులయ్యే రోజులు ముందుముందు ఉంటాయా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఆ ఆకు, పువ్వు, కొమ్మ, రెమ్మలేని రోజు మనిషి మనుగడ కూడా ప్రశ్నార్థకమవుతుందనడంలో సందేహంలేదు. నిజానికి అవి లేని రోజున మనిషి కూడా ఈ భూమ్మీద ఉండే అవకాశం లేదు. అందుకే ప్రకృతిని పరిరక్షించుకోవడానికి ప్రతిఒక్కరూ ఉద్యమించాల్సిన అవసరం, ఆవశ్యకత మన మెడపై కత్తిలా వేలాడుతోంది. మళ్లీ పుట్ట, గుట్ట, చెట్టును మూఢత్వంతో పూజించడం కాకుండా చైతన్యంతో ప్రేమించే లక్షణం అలవర్చుకోవాలి. మహాత్మాగాంధీ 1920వ దశకంలోనే చెప్పినట్లు, 'ఈనేల ఈగాలి ఈభూమి మనకు పెద్దల నుంచి వారసత్వంగా సంక్రమించిన ఆస్తులు కావు. ఆ సహజ వనరులను మనం ఏ రూపంలో అందుకున్నామో, అదే రూపంలో మన పిల్లలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉంది.' అలా చేస్తే ప్రకృతిని, పర్యావరణాన్ని అది ప్రసాదించిన జీవవైవిధ్యాన్ని మనం పరిరక్షించినవాళ్లమవుతాం. మనం బతకడమే కాదు, మన భవిష్యత్తు తరాల వారిని కూడా బతకనిచ్చిన వాళ్లమవుతాం. వాస్తవానికి ఉగాది వేడుకలో అంతరార్థం అదే. ప్రకృతికి సంబంధించిన పండగే ఉగాది. మనిషి జీవితంలోకి నవవసంతాన్ని తీసుకువచ్చే వేడుక ఇది. ప్రకృతితో, ప్రకృతిలోనే మనిషి మనుగడ అని మనలకు గుర్తుచేసే ఉత్సవం ఇది. కాబట్టి ఈ ఆనందోత్సవ వేళనైనా ప్రకృతిని వికృతిగా మార్చకుండా, దాన్ని పరిరక్షించుకునేందుకు మనిషి ప్రతినబూనాలి.. లేదంటే మనిషినే మరుగుపర్చేందుకు ఈ ప్రకృతి సిద్ధమవుతుందని హెచ్చరించక తప్పదు.

భవిష్యత్తు సౌరశక్తిదే
భాగం 7

విజ్ఞాన

సౌర ఉష్ణ విద్యుత్ శక్తి


మర్ల విజయ కుమార్

సూర్యుని కాంతిలో అధిక శాతం వేడిమి రూపంలో ఉంటుందని మనం ఇంతకుముందు చర్చించుకున్నాము. మన బాల్యంలో, భూతద్దం సహాయంతో, సూర్య కాంతి ఒక బిందువువద్ద కేంద్రీకృతమయ్యేటట్లుగా చేసి, కాగితం మండేటట్లు చేసిన అనుభవం మనందరికీ ఉండే ఉంటుంది. సరిగా అదేసూత్రాన్ని ఉపయోగించి, సూర్యకాంతి ఒక బిందువువద్ద కేంద్రీకృతమయ్యేటట్లుగా చేయగలిగితే, మనం అధిక ఉష్ణోగ్రతలవద్ద వేడిమిని పొందగలుగుతాము. ఇందు కోసం అనేక పద్ధతులు వాడుకలో ఉన్నాయి. మొదటగా, పరావలయ ఆకారంలో (పరాబొలా) ఉన్న అద్దాలను ఎండలో సూర్యకాంతి తిన్నగా పడేటట్లుగా చేయగలిగితే, అద్దం కేంద్రబిందువువద్ద, అధిక ఉష్ణోగ్రతలను పొందగలుగుతాము. పరావలయ వైశల్యాన్ని బట్టి మనకు లభించేశక్తి ఆధారపడి ఉంటుంది. ఈవిధంగా వేల సంఖ్యలో పరావలయ అద్దాలను అమర్చి, వాటి కేంద్ర బిందువు వద్ద నీటి గొట్టాలను కాని అమర్చితే, మనకు 300 డిగ్రీలవరకూ ఉష్ణోగ్రత కలిగిన నీటిఆవిరి లభించవచ్చును. అయితే, ఆ ఉష్ణోగ్రతవద్ద తయారయ్యే ఆవిరి టర్బైన్లలో ఉపయోగించాలంటే, సాంప్రదాయ పద్ధతుల్లో బాయిలర్లలో ఆనీటిని బొగ్గు లేదా ఆయిల్ ను మండించటంద్వారా 500 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద, అధిక ఒత్తిడి కలిగిన ఆవిరిని పొందవచ్చును. ఈ ఆవిరిని టర్బైన్లలో వాడితే, మనకు విద్యుత్తు ఉత్పత్తి జరుగుతుంది. అయితే, సోలార్ ప్లాంటు పెట్టి, తిరిగి బొగ్గును, ఆయిల్ ను కాల్చటం కాకుండా, ఆ అద్దాల డిజైన్లో మార్పులు చేసి, 450 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలను ఇంజనీర్లు నేడు సాధించగలిగారు. అట్లాగే, తక్కువ వేడిమి వద్ద, తక్కువ వత్తిడివద్ద పనిచేయగల స్టీమ్ టర్బైన్లను కూడా అభివృద్ధి చేయటం జరిగింది. ఆకాశం మేఘావృతమైతే, సోలార్ ప్లాంటు ఉత్పత్తి పడిపోతుంది. ఈకారణంచేత, వర్షాభావ ప్రాంతాల్లో, ముఖ్యంగా ఎడారి ప్రాంతాలలో ఈ సోలార్ ఉష్ణ విద్యుత్ ప్లాంటులు నెలకొల్పటానికి అనువైనవి.

అయితే, ఎడారి ప్రాంతాలలో నీరు లభించదు కనుక, దూరప్రాంతాలనుండి, పైపులైన్లలో నీటిని సరఫరా చేయవలసి ఉన్నది. ప్రతి మెగావాట్ సామర్థ్యానికి, గంటకూ 4000 లీటర్ల చొప్పున మంచినీరు అవసరమవుతుంది. మన అనంతపురం జిల్లాలో స్థాపించబోయే ఇటువంటి 4000 మెగావాట్ల కెపాసిటీ కలిగిన సోలార్ ప్లాంటుకు, రోజుకు 8 గంటలపాటు, ఏడాదికి 300 రోజులు సూర్యకాంతి లభిస్తుందనుకుంటే, ఏడాదికి 0.135 టి.ఎమ్.సిల నీరు అవసరమవుతుంది. మరి ఇటువంటి సోలార్ ప్లాంటులు డజన్లకొద్దీ నెలకొల్పటానికి ప్రైవేటు సంస్థలతో అగ్రిమెంటులు చేసుకున్నది మన రాష్ట్ర ప్రభుత్వం. ఉదాహరణకు 40 వేలమెగావాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంటులు గాని నెలకొల్పితే, వాటికి అవసరమయ్యే 1.35 టి.ఎమ్.సి లనీటిని ఎక్కడనుండి సరఫరా చేస్తారు. ఈస్థాయిలో మనం బోర్ వెల్స్ నుండి నీటిని పొందటం అసాధ్యం. మన భూగర్భ నీరు ఎప్పుడో అడుగంటిపోయింది. ఆనీటిలోని కాలుష్య పదార్థాలను, జీవపదార్థాలను, లవణాలను పూర్తిగా వడకట్టి, శుద్ధిచేసిన తరువాతనే, సోలార్ పైపులలో ఆవిరిగా మార్చటానికి ఉపయోగించగలము. ఇది అత్యంత ఖర్చుతోకూడుకున్న పని. పైగా, వేయి మెగావాట్ల సామర్థ్యం నెలకొల్పితే, మనకు ఆ సామర్థ్యంలో ఇంతాజేసి 10వ వంతుకూడా విద్యుత్తుగా అందుబాటులోకి రాదు. పైగా ప్రకృతిపై, ఎడారి, వర్షాభావ ప్రాంతాల్లో నివసించే వృక్ష, జంతుజాతుల నివాస స్థానాన్ని మనం ఆక్రమించుకుంటే, వాటి ఉనికికే ప్రమాదం ఏర్పడవచ్చును. ఆకారణం చేతనే, ఈవిధమైన సోలార్ ప్లాంటులను నెలకొల్పేటప్పుడు, నీటి సమస్య, పర్యావరణంపై గల ప్రభావాన్ని క్షుణ్ణంగా పరిశీలించనిదే అనుమతులు ఇచ్చుకుంటూపోతే, ఆదిలోనే హంసపాదు అన్నట్లుగా, నీటికొరతతో ఆ ప్లాంటులు తమ సామర్థ్యం కన్నా తక్కువస్థాయిలోనే విద్యుత్తు ఉత్పత్తి చేయగలుగుతాయి. తత్ఫలితంగా ఆదాయం తగ్గిపోయి, నష్టాలు వస్తే, ఆ ప్రైవేటు కంపెనీలకు అప్పులు మంజూరు చేసిన బ్యాంకులు మునిగిపోతాయి. ఈవిధంగా ప్రజాధనం ఎండపాలు అవుతుంది. పైగా, క్రిష్ణా, తుంగభద్ర జలాలు, మనకు బొటాబొటీగా లభిస్తున్న ఈదశలో, ఇటివంటి ప్రాజెక్టులకు అయాచితంగా అనుమతులు మంజూరుచేయటం బాధ్యతా రహితం.


పరావలయ సోలార్ ఉష్ణ విద్యుత్ పవర్ ప్లాంటు


సోలార్ టవర్ పవర్ ప్లాంటు


భవనాల పైకప్పుపై నెలకొల్పే చిన్నకెపాసిటీ డిస్

సోలార్ టవర్ పవర్ ప్లాంటు

సోలార్ పవర్ ప్లాంటులలో నీటిని వాడకుండా విద్యుత్తు ఉత్పత్తి చేయటానికి, లేదా తగ్గించటానికి అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఉదాహరణకు వందల ఎకరాల ఎడారి స్థలంలో అద్దాలను అమర్చి, వాటిపై పడే సూర్యకాంతి ఒకే కేంద్రబిందువువద్ద కేంద్రీకృతమయ్యేటట్లుగా ఒక టవర్ ను గాని నిర్మిస్తే, మనకు వెయ్యి డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు లభిస్తాయి. ఆ అధిక ఉష్ణోగ్రత కలిగిన బిందువువద్ద మనం నీటిని ఉంచితే, అధిక ఉష్ణోగ్రత కలిగిన ఆవిరితయారవుతుందికాని, దాని నుండి విద్యుత్తు ఉత్పత్తి చేయాలంటే, స్టీమ్ టర్బైన్లలో ఉపయోగించటానికి అధిక వత్తిడి గలిగిన ఆవిరిగా మార్చవలసి ఉంటుంది. దీనికోసం హైప్రెషర్, హై టెంపరేచర్ కంప్రెస్సర్లు ఉపయోగించాలి. అంత అధిక ఉష్ణోగ్రతలవద్ద పనిచేయగలిగిన కంప్రెస్సర్లను తయారుచేయటానికి అత్యంత సంక్లిష్టమైన సాంకేతిక సమస్యలు ఎదురవుతాయి. ఆ కంప్రెస్సర్ లో వాడే రోటార్ భాగాలు పాడుకాకుండా నిర్మించగలిగిన టెక్నాలజీ సంక్లిష్టమైనది, అత్యంత ఖర్చుతో కూడుకున్నది. మరొక పద్ధతిలో, నీటికి బదులుగా గాలిని గాని వేడిచేసి, ఆ గాలిని గ్యాస్ టర్బైన్లలో వాడి, విద్యుత్తు ఉత్పత్తి చేయవచ్చును. అయితే, ఇక్కడకూడా, హై ప్రెషర్, హై టెంపరేచర్ గ్యాస్ కంప్రెస్సర్లు మనం నిర్మించవలసి ఉన్నది. ఇది మరింత క్లిష్టమైన సాంకేతిక సమస్య. మరొక ఆలోచన ప్రకారం నీరుగాని, గాలిగాని, చల్లగా ఉన్నప్పుడే అధిక ఒత్తిడికి కంప్రెస్ చేసి, అప్పుడు ఆ సోలార్ టవర్ లో వేడి చేయటం. ఇక్కడ కూడా అనేక సాంకేతిక సమస్యలను అధిగమించవసి ఉన్నది. అయినా, గాలిని వేడిచేసే పద్ధతిలో ఎడారి ప్రాంతాలలో నెలకొల్పే సోలార్ ఉష్ణ విద్యుత్తు ప్లాంటులకు నీటి సమస్య ఉండబోదు. బహుశా భవిష్యత్తులో, ఈ టెక్నాలజీకి ప్రాధాన్యత లభించవచ్చును. అయితే ఇక్కడ కూడా పర్యావరణానికి, ఎడారిలోన జీవజాలానికి నష్టం జరుగక తప్పదు. ఈ అద్దాలు పగలంతా సూర్యుని అనుసరించి, కేంద్ర బిందువువద్ద సూర్య కాంతి ఫోకస్ అయ్యేటట్లు చేయటానికి ప్రతి అద్దానికి మోటార్లు అమర్చవలసి ఉన్నది. దీనికోసం కొంత విద్యుత్తు అవసరమవుతుంది. పైగా ఈ కంప్రెస్సర్ లు నడపటానికి, పవర్ ప్లాంటు ఇతర అవసరాలకు మనం విద్యుత్తును వాడవలసి ఉన్నది. దీని కోసం గ్రిడ్ నుండి విద్యుత్తును దిగుమతి చేసుకుని, ప్లాంటు అవసరాలు తీర్చుకుని, ఉత్పత్తి అయిన విద్యుత్తును గ్రిడ్ కు తిరిగి ఇవ్వటం అవసరమవుతుంది. అయితే, మామూలు సోలార్ ప్యానెళ్ళపై, చదరపు మీటరుకు ఒక కిలోవాట్ శక్తి మాత్రమే అందుబాటులోకి వస్తే, సోలార్ టవర్ పద్ధతిలో మనం వెయ్యి మెగావాట్ల శక్తిని ఒకేచోట కేంద్రీకరించగలుగుతాము. సోలార్ పి.వి ప్యానెళ్ళ ధరలు ఈ మధ్య కాలంలో గణనీయంగా పడిపోయి, పి.వి. పవర్ తక్కువ ధరకు ఉత్పత్తిచేసే అవకాశం లభించింది. కాని, సోలార్ ఉష్ణ విద్యుత్తు కేంద్రాలలో వాడే స్టీలు ప్లేట్లు, స్టీలు ఫ్రేములు ధరలు అంతగా తగ్గకపోవటంతో, సోలార్ ఉష్ణ విద్యుత్తు ఉత్పత్తి ధరలో గణనీయమైన తగ్గుదల కనిపించలేదు.

రోజులో 8, 9 గంటలు మాత్రమే సూర్యకాంతి అందుబాటులో ఉండేకారణాన, రోజులో 8 గంటలు మాత్రమే ఈ సోలార్ ఉష్ణ విద్యుత్తు ప్లాంటు పనిచేసి, మిగతా 16 గంటలు మూతపడి ఉంటుంది. పైగా, ఒక స్టీమ్ టర్బైన్ ప్లాంటును నిశ్చల స్థితినుండి పూర్తిస్థాయి ఉత్పత్తికి తీసుకురావటానికి కనీస పక్షాన 7, 8 గంటలు పడుతుంది. ఈ సమస్యను అధిగమించటానికి, వేడి నీటినిగాని, ఆవిరిని గాని మనం ఆ అధిక ఉష్ణోగ్రతలు పడిపోకుండా నిల్వచేయవలసి ఉన్నది. ఉదాహరణకు 4000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ఉష్ణ విద్యుత్తు కేంద్రాన్ని నెలకొల్పి, 8 గంటలపాటు లభించిన ఉష్ణ శక్తినిగాని నిల్వ ఉంచగలిగితే, మనకు 24 గంటలపాటు కనీసం 1300 మెగావాట్ల ఉత్పత్తిని నిలకడగా పొందవచ్చును. ఇందుకోసం సోడియమ్ నైట్రేట్, పొటాషియమ్ నైట్రేట్, కాల్షియమ్ నైట్రేట్ లవణాల మిశ్రమాన్ని పెద్ద పెద్ద టాంకులలో నిలవ ఉంచుతారు. ఈ టాంకులు మన ఇండియన్ ఆయిల్ వారి డీజల్ టాంకుల కంటే చాలా పెద్దవిగా ఉంటాయి. ట్యాంకులోని లవణ మిశ్రమం 180-200 డిగ్రీలవద్ద ద్రవంగా మారుతుంది. పరావలయ సోలార్ అద్దాలనుండి గాని, సోలార్ టవర్ నుండిగాని లభించిన వేడినీటిని ఈ ట్యాంకులలోని గొట్టాలలోకి పంపుతారు. అక్కడ ఆ వేడినీటిలోని వేడిమిని ఈ లవణాలు గ్రహించి, నిల్వ ఉంచుతాయి. నీటికంటే అనేక రెట్లు అధిక స్థాయిలో వేడిమిని ఈ లవణాలు గ్రహించి, ఎక్కువకాలం నిల్వ ఉంచగలవు. సూర్యకాంతిలేని సమయంలో లవణాలలోని వేడిమిని గ్రహించిన నీరు 300 డిగ్రీల స్థాయిలో మనకు లభిస్తుంది. ఈవిధంగా రోజులో 24 గంటలూ మనం విద్యుత్తు ఉత్పాదన చేయగలుగుతాము. పవర్ ప్లాంటు కెపాసిటీని బట్టి, అందులో మూడవ వంతు విద్యుత్తు శక్తిని మనం రోజంతా పొందగలుగుతాము. పరావలయ అద్దాలతో గ్రహించిన వేడిమిని నిలవ ఉంచటానికి ఈ లవణ మిశ్రమం పనిచేస్తుంది గాని, సోలార్ టవర్ నుండి మనకు వెయ్యి డిగ్రీల ఆవిరి లభించగలదు కనుక, అంత అత్యంత ఉష్ణోగ్రతల వద్ద సమర్థవంతంగా వేడిమిని నిల్వ ఉంచగలిగినది సిలికాన్ మాత్రమే. ఈ ట్యాంకులలో సిలికాన్ ను నింపి, మనం ఉపయోగకరమైన విధంగా 550 డిగ్రీలవద్ద ఆవిరిని పొందవచ్చును. ఆవిరి పైపులలోనే ఉంటుందికనుక, ఆ లవణాలతోగాని, సిలికాన్ తో గాని ఆవిరి కలుషితం కాదు. తత్కారణంగా టర్బైన్ పై లవణాల పొర ఏర్పడకుండా కాపాడవచ్చును. అయితే, ఈ లవణ మిశ్రమ, సిలికాన్ స్టోరేజి ట్యాంకుల నిర్మాణానికి అధిక ఖర్చు చేయవలసి ఉన్నది. దీనితో, ఈ సోలార్ ఉష్ణ విద్యుత్తు ఉత్పత్తి ధర అమాంతంగా పెరిగిపోయి, సంప్రదాయ బొగ్గు ఆధారిత పవర్ కంటే ప్రస్తుత్రం అనేక రెట్లు ఎక్కువగా ఉన్నది. ఇంతకంటే చవకైన, నాణ్యమైన నిల్వ పద్ధతి అమలులోకి వస్తేనే, ఆ సోలార్ ఉష్ణ విద్యుత్తును విస్తృత వాడకంలోకి తేగలుగుతాము. అయితే, మేఘావృతమైన రోజులు, మెయిన్ టెనెన్స్ కోసం 65 రోజులు పోయినా, సంవత్సరానికి మిగతా 300 రోజులలో మనం నిలకడగా ఉత్పత్తిచేయగలిగినది 1000 మెగావాట్లకు మించదు. పవర్ ప్లాంటు నడపటానికి, కొన్ని యంత్రాలకు అవసరమయే విద్యుత్తును, విద్యుత్తు రవాణాలో నష్టాలను కూడా లెక్కవేస్తే మనకు అటువంటి 4000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంటునుండి 7, 8 వందల మెగావాట్లకు మించి ఉత్పత్తి అందు బాటులోకి రాదు.

భవనాల పైకప్పుపై నెలకొల్పే చిన్నకెపాసిటీ డిష్

ఇప్పటివరకూ మనం పెద్ద స్థాయిలో వందల మెగావాట్లకు పైగా ఉత్పత్తిచేసే పవర్ ప్లాంటుల గురించే చర్చించుకున్నాము. అయితే, చిన్న స్థాయిలో, ఒక చిన్నతరహా పరిశ్రమకు గాని, గృహ సముదాయానికి కాని అవసరమయ్యే విద్యుత్తును సోలార్ ఉష్ణ శక్తిని ఉపయోగించి తయారుచేసు కునేందుకు ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. ఉదాహరణకు, భవనం పైకప్పు మీద ఇటువంటి పరావలయ అద్దాలను గాని అమర్చి, ఒకే కేంద్రబిందువువద్ద వందల డిగ్రీల ఉష్ణోగ్రత కలిగిన నీటి ఆవిరిని ఉత్పత్తి చేయవచ్చును. తయారయిన ఆవిరిని కంప్రెస్ చేసి, చిన్న స్టీమ్ టర్బయిన్ లోగాని, ఆవిరి యంత్రంలోగాని ఉపయోగించి, విద్యుత్తును తయారుచేసు కోవచ్చును. ఆవిధంగా, 100 కిలోవాట్ల వరకూ సామర్థ్యాన్ని భవనాల పైకప్పులపై అమర్చవచ్చును. ఆ విధంగా తయారయిన విద్యుత్తు అ భవన శీతలీకరణకు, విద్యుత్తు దీపాలకు, ఫ్యానులకు, లిఫ్టులకు, తదితర అవసరాలకు వాడవచ్చును. సుదూర ప్రాంతాలలో, విద్యుత్తు లైన్లకు దూరంగా నిర్మించే ఫారెస్ట్ లాడ్జీలు, హై వే హొటళ్ళు, లేబొరేటరీలు, దీవులపై నిర్మించే భవనాలకు, తదితర నిర్మాణాలకు ఈ విధమైన విద్యుత్తు ఉత్పత్తి సహాయకారిగా ఉంటుంది. అయితే, లభించే ఉష్ణ శక్తిలో 10 శాతం మాత్రమే మనకు ఈ టెక్నాలజీ ద్వారా లభ్యం అవుతుంది. దానికంటే మెరుగైన, ఎక్కువ సామర్థ్యం కలిగిన విధానం సోలార్ ఉష్ణ శక్తిని విద్యుత్తుగా మార్చకుండా, మన శక్తి అవసరాలకు నేరుగా వినియోగించుకుంటే, మనకు లభించే సూర్య శక్తిలో అధిక భాగాన్ని ఉపయోగంలోకి తేగలుగుతాము. సూర్యకాంతి భూతలమంతటా, కొద్ది హెచ్చు తగ్గులతో ప్రసరిస్తుంది కావున, ఒకే చోట భారీస్థాయి పవర్ ప్లాంటులు నిర్మించటం వెనుక నయాఉదార వాద ప్రభుత్వాలకు, ప్రైవేటు కంపెనీలకు లాభం చేకూర్చటమే ప్రధాన ఉద్దేశ్యం. ఈ విధంగా సూర్య శక్తిని ప్రైవేటుపరంచేసి, కొద్ది మంది బడా పెట్టుబడిదారులకు అడ్డంగా లాభాలు సమకూర్చటమే పాలకుల దురుద్దేశ్యం కాని, గ్రామీణ ప్రాంతాలలో, సౌరశక్తి వినియోగంలోకి తేవటంద్వారా గ్రామీణ ప్రజల శక్తి అవసరాలు చవుకలో తీర్చి, వారి ఆర్థికాభివృద్ధికి, వికాసానికి తోడ్పడాలనే ఆలోచనే పాలకుల బుర్రకెక్కదు. ఎప్పుడూ సోలార్ కుక్కర్ల గురించి, లేదా సోలార్ లాంతర్ల గురించి ప్రచారం చేసుకుంటారుగాని, చిన్నతరహా, గ్రామీణ కుటీర పరిశ్రమలకు సౌర శక్తిని ఏవిధంగా వినియోగం లోకి తేవాలో అలోచన చేస్తే, ప్రజల వికాసానికి ఎక్కువ సహాయకారి అవుతుంది.

(8వ భాగం వచ్చేఆదివారం)

- వ్యాస రచయిత : అఖిల భారత అభ్యుదయ వేదిక జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు. సెల్ : 09848933545

విళంబీకి స్వాగతం

ఉగాదులు మారినా,యుగాంతమొచ్చినా,
హస్తిన మత్త కోయిలది అదే పాట
సరికొత్త ట్యూన్ లో పాత పాట.
అరిచి గీపెట్టినా ఆంధ్రులు తెలుగు నాట,
మరిచిపోవల్సిందేనట ప్రత్యేక హోదా మాట.
మన్మథ ఉగాది లగాయితు మురిపించు హోదా
నేటికీ మిగిలె.. ఊరించు మరీచికగా.
తెలుగుతల్లి తల్లడిల్ల,
చూసి చలించదే కొత్త ఢిల్లీ.
విభజన హక్కులెల్ల,హుళక్కి కాగా,
తెలుగోళ్ల వృద్ధి వెనక్కి పోగా.

హేవళంబిని నెట్టి, ముందుకొచ్చినట్టి,
ఓ విళంబీ, నీకు స్వాగతంబు, సుస్వాగతంబు
తెలుగు జాతి స్వావలంబు సాధింప
నీవైనా పూనుకొమ్ము. ఆశీస్సులిమ్ము.
-డా. డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ.



నిత్య శోభితం!!

హేవిళంబిని సాగనంపి..
యేతెంచినది విళంబి..
నవయుగానికి నాంది పలికి
కొత్త ఊహలకు ఊపిరి నిలిపి
జలకళతో చెరువులు నిండి
బీడు భూముల కడుపు పండి
పంటలు సిగిడి రంగుల నిండి
పచ్చదనపు చిగుళ్ళు ఆహ్వానం పలుకంగ
మోడుబారిన శిశిరాన్ని సాగనంపి
ప్రకృతి మది పులకించంగ
సబ్బండ వర్ణాలు సంతసించంగ
కొత్త ఆశల తియ్యని మకరందాలతో
అసాంతం తోడుండాలి ఈ నవ వసంతం
విళంబి నామం కావాలి నిత్య శోభితం!!
(విళంబి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలతో)

-పాల్వంచ హరికిషన్,
కవి, రచయిత.

కాంతులు విరిసే ఆమని

చిగురే కొమ్మె కూసేనమ్మా
ఈ విళంబి మనకై పూసేనమ్మా
కొత్త కొత్త రాగాలెన్నో గుండె గుండె మొదలై
తొంగి తొంగి చూసేనమ్మా
తేలి తేలి మురిసేనమ్మా
పల్లె పల్లెల పరువాలన్నీ
పందిరి వేసి ఆడేనంట
మొగ్గలు వేసే సిగ్గులు అన్నీ
ముగ్గులు వేసి మెరిసేనంట
గగన కుసుమాల పందిళ్లలో
వెన్నెల సోనలు కురిసేనంట
వెచ్చని ఆమని పొత్తిళ్ళలో
అనంద కాంతులు విరిసేనంట
వన్నె చిన్నెల వాకిళ్ళలో
ఎన్నో ఎన్నో సంబరాలు
ఊయలలూగే ఊసులతో
చిందే చిందే సంతసాలు



గల గలలాడే సెలయేరుల్లా
కిలకిలనవ్వే సిరిమువ్వల్లా
తళ తళ లాడే మేలిమి ముత్యమై
కళ కళలాడే కన్నుల కవితై...

ఎస్.కె.డి. ప్రసాదరావు
9866218299

ఆందోళనాంధ్ర ప్రదేశ్ పంచాంగం

ఆదాయం : అప్పు దొరికిన మేరకు
వ్యయం : అంతకు మించి,ఎన్నో రెట్లు
రాజపూజ్యం : బొత్తిగా పూజ్యం
అవమానం : కొలమానం లేదు,అనుమానం లేదు. ఘనం

ఈ విళంబి నామ సంవత్సరాన్ని కంగాళీ నామ సంవత్సరం అనుకున్నా పరవాలేదు ఆంధ్రప్రదేశ్ వరకూ,అంత ఆందోళనకరం. 'చంద్ర' నిప్పులు, వేడి' పవనాలు',వైకో' పాలు, ఒకటేమిటి ఒకటే వేడి పెరిగి రాష్ట్రం రాజకీయ నిప్పుల కొలిమిలా మారుతుంది.అప్పుల కొలిమికి ఇదో అదనం.ఎన్నికల వేళా విశేషం.గ్రహాలన్నీ ఉత్సవ విగ్రహాల్లా మారి ఏమాత్రమూ అనుకూలించవు.ఏ గ్రహాలూ అనుకూలించని తీరు చూసి,నిగ్రహం కోల్పోయిన ప్రజలు ఆగ్రహమే అన్నిటికీ మందు అని భావిస్తారు.మన్మథ నామ సంవత్సరాన మొదలైన హోదా అంశం విళంబిలోనూ హామీగానే ఉండి చర్చనీయాంశమైంది. చట్టంలోని 19 హామీలపై 19 కమిటీలను వేసి అన్నీ అనవసరమే అని కేంద్రం తేల్చి పారేస్తుంది.మేమైతే అవన్నీ తీర్చి పారేస్తామని మరో జాతీయ కోయిల కొత్త పాట అందుకొంటుంది.వెరసి రాజకీయాలు తప్ప వేరే రోజువారీ అవసరాల చర్చలుండవు.అన్ని రాసుల వారూ చెవుల్లో క్యాబేజీలు ధరించాలి. రోజూ పెరిగే పెట్రోల్ ధరలకు అలవాటు పడ్డట్టు,కొత్త కొత్త హామీల్ని అలవాటు పడాల్సి ఉంటుంది.మొత్తంగా చూస్తే ఈ సంవత్సరం రాష్ట్రానికి ఇతమిద్ధంగా జరిగే మేలేమీ ఉండకపోవచ్చు.ఎన్నికల సీజన్ దాటే వరకూ ప్రజలంతా అన్ని బాధల్ని మరిపించే 'గజనీ'మంత్రం జపిస్తే చాలు.(అఫ్ కోర్స్, తరువాత నేతలు అదే మంత్రం జపిస్తారనుకోండి)

శుభం భూయాత్.

-డా. డి.వి.జి.ఎస్ఆర్

విశాలాంధ్ర
బతుకు
The Life
ఆదివారం
18 మార్చి 2018





కొత్తకు శ్రీకారం

దక్షిణాదిన మరీ ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రజలు అత్యంత ప్రాముఖ్యతనిచ్చే పండగ ఉగాది. ఈ రెండు రాష్ట్రాలతో పాటు కన్నడిగులు ఈ పండగను గొప్పగా జరుపుకుంటారు. ఉగాది అంటే తెలుగు సంవత్సరాది. తెలుగు వాళ్ళకు కొత్త ఏడాది ప్రారంభ దినం ఇది. కాలంతో పాటే జీవితంలోనూ ఎన్నో విషయాల్లో మార్పు ఉంటుంది. ఇది ఒప్పుకుని తీరాల్సిన వాస్తవం. ఈ క్రమంలోనే చాలా పండగలు జరుపుకునే విధానంలో చాలా తేడా కనపడుతోంది. ఉగాది పండగను మాత్రం సంప్రదాయం ప్రకారం మామిడి తోరణాలు, ఉగాది పచ్చడితోనే జరుపుకోవడం విశేషం.



తెలుగులో తొలి నెల చైత్రమాసం. ఈ మాసం తొలి రోజున జరుపుకునే పండగే ఉగాది. మహారాష్ట్రలో దీనిని గుడి పడ్వా పేరుతో జరుపుకుంటారు. గుడి పడ్వా, ఉగాది పేర్లు మాత్రమే తేడా గానీ పండగ ఒకటే. ఈ రెండింటినీ ఒకేరోజు జరుపుకోవడం ఇక్కడ విశేషం.

ఈ పండగను ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పేరుతో పిలుస్తారు, ఒక్కోరకంగా జరుపుకుంటారు. ఈ తేడా మనకు దక్షిణాది రాష్ట్రాల్లోనే స్పష్టంగా కనిపిస్తుంది. రాష్ట్రాల్లోనే కాదు ఒక్కో రాష్ట్రంలోని ప్రాంతాల్లోనూ, వర్గాల్లోనూ ఈ తేడా కొట్టొచ్చినట్టు తెలుస్తుంది. ఉగాది పండగ సంబరాల్లో భాగంగా ఆచరించే ఆచారసంప్రదాయల వెనక ఉన్న ఉద్దేశం ఏమిటో క్లుప్తంగా తెలుసుకుందాం.

1. జీవితాల్లో తాజాదనం!

కొత్త ఏడాది అంటే సహజంగానే కొత్త ఆలోచనలు పుట్టుకొస్తాయి. జీవితం మీద కొత్త ఆశలు పట్టుకొస్తాయి. ఈ మార్పు కోసం ఎంత మేరకు ప్రయత్నిస్తారు అనేది వేరే విషయం. అసలు జీవితంలో ఒక మంచి మార్పు కోసం, సరికొత్త తాజాదనం కోసం ఆలోచనల బీజం పడుతుందనేది వాస్తవం. పిల్లల నుంచి పెద్దవాళ్ళ వరకూ దాదాపుగా అందరిలోనూ ఇది గోచరిస్తుంది. పండగ పేరు చెప్పి ముందు శుభ్రత మీద దృష్టి పెడతారు. రెండు వారాల ముందునుంచే ఈ పనులు ప్రారంభమవుతాయి. ఇల్లు దులపడం నుంచి కడగడం, అన్నీ సర్దడం వరకూ చాలా పనులు అవుతాయి. గుమ్మాలకు వేసే కర్టెన్లు మార్చడం మొదలుకుని రంగులు వేయడం వరకూ ఎన్నెన్నో మార్పులు చేస్తారు. మొత్తంగా ఇంట్లోనే ఒక కొత్త వాతావరణాన్ని సృష్టిస్తారు. ఈ క్రమంలో ఇంట్లో అనవసరంగా ఉన్న, వృధాగా పడి ఉన్న వస్తువులను తీసేస్తారు. ఇదంతా వ్యక్తుల్లో లేదా కుటుంబాల్లో ఉండే ప్రతికూల భావాలు లేదా వ్యతిరేక భావాలను తీసేయడం లాంటిదే. ఇందులో చెప్పుకోవలసిన విషయం ఇంకొకటి ఉంది. ఈ ఇల్లు శుభ్రత, మార్పు పనులు ఒక్కరే చేయలేరు కదా....ఇంటిల్లిపాదీ పాలుపంచుకుంటారు. ఈ పేరుతో కనీసం నాలుగు రోజులైనా ఇంట్లో ఉన్న సభ్యులంతా ఒక్కచోట ఉంటారు. ఈ రకంగా వారిమధ్య అనుబంధం మరింత పెరుగుతుంది. కలిసి పనిచేసుకోవడంలో ఉన్న ఆనందం ఏమిటో తెలుస్తుంది. పండగ పరమార్థం నెరవేరుతుంది.

2. మేను...జరభద్రం!

ఉగాది పండగను మనం మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో జరుపుకుంటాం. ఈ కాలం చర్మం, శిరోజాలపై ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టాల్సిన కాలం. ఎండలు పెరిగే సమయం కావడమే ఇందుకు కారణం. సూర్యరశ్మి ధాటికి చర్మం కమిలిపోకుండా, జుట్టు వడలిపోకుండా శ్రద్ధ తీసుకునేందుకు అవసరమైన చర్యలు ఈ పండగ నాడే ప్రారంభమవుతాయి. తరచి చూస్తే గానీ ఈ విషయం అర్థం కాదు. ఎండ పెరగక ముందే ఉదయాన్నే స్నానం చేస్తే ఎంత హాయిగా ఉంటుంది, అలాగే సాయంత్రం వేళ ఎండంతా పోయిన తర్వాత స్నానం చేయాలి. ఎండ సమయంలో స్నానం చేస్తే ఒళ్ళు శుభ్రం కాకపోగా మరింత చిరాగ్గా ఉంటుంది. అది కూడా ఎండ ఎక్కువగా ఉంది కదా అని చన్నీటితో కాకుండా గోరువెచ్చని నీటితో



స్నానం పూర్తి చేయాలి. పండగ నాడు పొద్దునే అభ్యంగన స్నానం పూర్తి చేయాలని చెప్పడంలోని ఆంతర్యం ఇదే. స్నానం పూర్తయిన తర్వాత చర్మానికి, జుట్టుకి కూడా నూనె పెట్టుకోవాలి. ఇది మేను, శిరోజాలని ఎండ బారి నుంచి కాపాడుతుంది.

3. జీర్ణ హిత ఆహారం

మనదేశంలో ఏ పండగ రోజైనా దాదాపుగా విందు భోజనం ఉంటుంది. ఇందులో తప్పనిసరిగా అన్నింటికంటే ముందే ఒక పచ్చడీ ఉంటుంది. ఉగాది నాడు మాత్రం ఉదయాన్నే పచ్చడి తింటాం. అది కూడా ఒకటే రుచితో కూడినది కాదు అన్ని రకాల రుచులతో కూడిన షడ్రుచుల పచ్చడి. ఈ విషయం అందరికీ ఎరుకే. వేసవి ప్రారంభంలో వచ్చే ఈ పండగలో పులుపుతో కూడిన రుచులు మనకు చాలానే దర్శనమిస్తాయి. ప్రధానంగా పచ్చి మామిడి, చింతపండు...రెండూ ఉగాది పచ్చడిలో ఉంటాయి. ఇది సీజన్‌కు తగిన ఆహారం అనడంలో ఎలాంటి సందేహం లేదు. అలాగే ఉగాది పచ్చడిలో ఉపయోగించే పదార్థాలన్నీ ఈ వేసవి సీజన్‌లో జీర్ణహితమైనవే. అలాగే జీవితంలో నిత్యం అనుభవంలోకి వచ్చే కోపం, ఆశ్చర్యం, భయం, కఠినత్వం లాంటి భావోద్వేగాలన్నీ ఇందులో కనిపిస్తాయి.

చదువులు, ఉద్యోగాలు, ఇతరత్రా కారణాలతో వేర్వేరుగా ఎక్కడెక్కడో ఉండే ఇంటి సభ్యులంతా ఈ పండగ పేరు చెప్పి ఒక్కచోటికి వస్తారు. అలాగే ఒక ఇంటి మనుషులే కాదు ఒక ప్రాంతం, ఒక రాష్ట్రం అంతా కలిసి చేసుకునే పండగలో ఒక ఐక్యత, సమైక్యత కనిపిస్తాయి. అలాగే అందరి జీవితాల్లో ఒక సరికొత్త ఆశావాద దృక్పథం కనిపిస్తుంది.

విళంబి ఉగాది !

ఋతువుల్లో తొలి రుతువు వసంత ఋతువు. మాసంలో తొలిమాసం చైత్రమాసం. తిథుల్లో తొలి తిథి పాడ్యమి. పక్షంలో తొలిపక్షం శుక్ల పక్షం. ఇవన్నీ కలిసి వచ్చేదే మన ఉగాది. దీనినే యుగాది అంటారు. మన తెలుగు సంవత్సరాలు 60. ప్రభవ, విభవ, ప్రమోదూత అనే పేర్లతో మొదలై అక్షయతో ముగుస్తుంది. మన తెలుగు సంవత్సరాల్లో విళంబి సంవత్సరం 32వది. 1958లో వచ్చిన విళంబి 60 సంవత్సరాల తరువాత మళ్ళీ ఏడాది (2018) వచ్చింది.

వివిధ ప్రాంతాలలో ఉగాది

ఈ ఉగాది పండుగను వివిధ ప్రాంతాలలో విభిన్న రూపాలలో చేసుకుంటారు. తమిళనాడులో ప్రతి ఏటా ఏప్రిల్ 14వ తేదీన పుత్తాండు అనే పేరుతో, కేరళలో ఓల్లవర్షం, మహారాష్ట్రలో గుడి పడవ, అస్సాంలో బిహు అనే పేర్లతో ఈ పండగను జరుపుకుంటారు. ఉగాది అంటే తిథి, వార, నక్షత్ర, కరణ, యోగాలను వివరించేది. దీనినే పంచాంగం అంటారు.

ఉగాది పచ్చడి విశిష్టత

తెలుగునాట ఉగాది నాడు షడ్రుచులతో పచ్చడి చేయడం తరతరాలుగా వస్తున్న ఆనవాయితీ. అంటే తొలి వసంత ఋతువులో తొలిసారిగా వచ్చిన మామిడి పిందెలు, వేపపూత, కొత్త చింతపండు, కొత్త బెల్లం, ఉప్పు, చెరుకు ముక్కలు, పచ్చి



అస్సాంలో బిహు



మహారాష్ట్రలో గుడి పడవ,



కేరళలో ఓల్లవర్షం

మిరపకాయ ముక్కలు లేదా మిరియాలు వేసి పచ్చడి చేస్తారు. దీనినే షడ్రుచుల పచ్చడి అంటారు. తీయగా, పుల్లగా, కారంగా, చేదుగా, వగరుగా ఉంటుంది. ఇది మన జీవితంలోని కష్ట సుఖాలకు నిదర్శనమని అంటారు. జీవితంలో కష్టసుఖాలు ఒకదాని వెన్నంటి ఒకటి ఉంటాయని చెప్పడమే ఈ పండగ, ఈ పచ్చడి ఉద్దేశం, పరమార్థం. కష్టసుఖాలు, కోపతాపాలు, సంతోషదు:ఖాల సంకేతమే ఈ ఆరు రుచులు అని మన పెద్దలు ఏనాడో చెప్పారు. ఈ పచ్చడి తినడం వలన ఆరోగ్య పరంగా చాలా మేలు జరుగుతుంది. వేపపూత కడుపులోని నులిపురుగులను చంపి మరలా రాకుండా చేస్తుంది. కొత్తబెల్లం ఆకలిని కలిగిస్తుంది. చింతపండు శ్లేషాన్ని తగ్గిస్తుంది. మిరియాలు కఫాన్ని పోగొడతాయి. ఈ విధంగా ఈ షడ్రుచుల పచ్చడిలో అనేక ఆరోగ్య గుణాలు ఇమిడి ఉన్నాయి. మొత్తంగా ఈ సీజన్‌లో వచ్చే అనారోగ్యాల బారిన పడకుండా ఈ పచ్చడి కాపాడుతుంది.

- కొంపల్లి, ఒంగోలు

ఓ విళంబి ఉగాదీ నీకిదే వందనం!

సమయపాలన చేసే ఓ విళంబి ఉగాది నీకిదే వందనం
కోకిలమ్మ నీకోసం గొంతు సవరించుకునే ఉంది
నెమలి నాట్య భంగిమలను మెరుగుపర్చుకునే ఉంది
చిలుక తన పలుకులకు పదును పెట్టుకునే ఉంది
ప్రకృతి పరిమళిద్దామని సర్వసన్నద్ధం అయ్యింది

కానీ
మనిషే ప్రకృతిని మించిపోవాలని కలలు కన్నాడు
ఆ కలల సాకారం కోసం
పచ్చని పచ్చిక బయళ్ళను, ఎడారులను అన్నింటినీ
రాతి మేడలతో నింపేశాడు.

పచ్చపచ్చ తివాచీలను తీసివేసి
ఎర్రఎర్రని గొంగళ్ళను పరిచాడు.
రహదారులన్నీ వాహనాలతో నిండిపోతున్నాయి
బహుళ అంతస్థుల మేడలు సూర్యచంద్రులను
ఆకట్టుకుంటున్నాయి.
ఇవన్నీ చూసి
పుడమి తల్లి పసిడిని ఎక్కడ పొదగాలో తెలియక
తికమకపడుతోంది
ఊర పిచ్చుకలు, పాలపిట్టలు, అన్నీ సైరన్ కూతలకు హారన్
మోతలకు
భయపడి
పుడమి ఒళ్ళో తలదాచుకుంటూ అమ్మా అని ఆక్రందనం
చేస్తుంటే
పుడమి పంటికింద బాధను నొక్కి పెడుతోంది.

అదిగో అప్పుడే నువ్వు నీకు కొత్తందనాలను పులుముకుంటూ
వచ్చేశావు
కవులంతా కలాలను సిరాలను నింపుకుంటున్నారు
వద్దన్నా వినకుండా కోయిలమ్మ కూహూరాగాలను
చిలుకమ్మ చిన్నిచిన్ని పదాలను
కేకి తన కేళీ విలాసాలను
ప్రదర్శించడానికి పరుగులు పెడుతున్నాయి

అదిగో అప్పుడే చూశాను అపార్ట్‌మెంట్లల్లోనూ
ప్రకృతికి ఆహ్వానం!
చిన్న చిన్న కుండీల్లో పచ్చ పచ్చని పైరు పంటలు
మర్రి, రావి, జువ్వి, అన్నీ మానులే కానీ
మరుగుజ్జులై
తమ అందాలను కొత్తదనంతో చూపుతూ
టమాటాలు, వంగ, మిరప, చిక్కుడు ఇవన్నీన్నూ
చిన్నిచిన్న పందిళ్ళ కింద విరగబడి నవ్వుతున్నాయి

అదిగో మామిడి, వేప కూడా చిన్న కుండీల్లోనే
వేపపూవు కమ్మదనాన్ని రాతి మేడలల్లో గుబాళిస్తూంది
మామిడి చిరుపిందెలు పుల్లందనాలకు
రాళ్ళతో కొట్టే కుర్రకారు మెల్లగా
టుపుక్కున వచ్చి పుట్టుక్కున తెంచి
నోట్లో వేసి అబ్బా ఏమి రుచీ...అంటూ లొట్టలు వేస్తున్నారు.

అందుకేనేమో
రాతిమేడలే అయినా
రహదారుల వెంట చెట్టుచేమ కరువయినా
కోకిలమ్మ తన గొంతుకు కొత్త రాగాలను చేర్చింది
ఓ విళంబి ఉగాది విలంబం లేకుండా వచ్చేయి
ఓ విళంబి ఉగాది ఇదిగో నీకు స్వాగత తోరణం
బంతిచేమంతులతోపాటు పొద్దు తిరుగుడు పూవుతో
నీకు స్వాగత సన్నాహాలు చేసాం
ఓ విళంబి ఏ విలంబాలు లేకుండా
ఈ కొత్త వత్సరం
కొంగొత్త రాగాలను పలికింప చేయి
ఓ విళంబి నీకిదే వందనం.

- జంగం శ్రీనివాసులు, హైదరాబాద్





డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

ఎందుకేనా మంచిది - సుభనే అడుగుదునా? 'ఇలా కాగితం వచ్చింది. చాలా రహస్యం. ఆ ప్రశ్నావళికి ఏమని జవాబు రాయమన్నారు? మీ సలహా తీసుకుని ఆ ప్రకారం రాస్తాను' అని అడుగుతాను. నయం ఇంకా! నా బుద్ధి గడ్డి తింటుందా ఏమిటి? లేకపోతే ఆమెని ఇరుకులో పెట్టడమేమిటి? నా వ్యవహారం, నాబాధ్యత ఆమె నెత్తిమీద పెట్టడమేమిటి? నాకేమిటీ మాయదారి బుద్ధులు? "బ్రిటీషువాడు మనకిన్నాళ్ళుండి ఏం వలకపోశాడు - జపానువాడూ, జర్మనీవాడూ వచ్చి మనకేం వలకపొయ్యాలి గనక? ప్రపంచం నుంచి సామ్రాజ్యవాదులనీ, ఫాసిస్టులనీ అవసరం అయితే కత్తికఠార్లతో యుద్ధంచేస్తూ ప్రజాస్వామ్యాన్ని, సామ్యవాద సమాజాన్ని, అందుతోపాటు భారత స్వాతంత్ర్యాన్ని కూడా స్థాపించాలి" అని అంది ఒకసారి. ఇది కమ్యూనిజం కింద లెక్కా? మార్క్సు లెనిను, స్టాలిను అని మాత్రం రెండు మూడుమాట్లు ఈ మధ్యే అంటూ వచ్చినట్లు నాకు జ్ఞాపకం.

(నిన్నటి సంచిక తరువాయి)

అవును- కిందటి నెల మేం సినిమాలో కలుసుకున్నప్పుడు యుద్ధం బొమ్మలు చూపిస్తుంటే - "అయ్యో, సోవియట్ ప్రజలు ఎన్ని కష్టాల పాలవుతున్నారో కదా- సోవియట్ ప్రజల్లో సాంకేతిక శిక్షణా, శాస్త్రపరిశోధనా చాలా అభ్యుదయకరమైన పద్ధతుల్లో జరుగుతున్నాయట కదా!" అంది. సోవియట్ దేశాన్ని మెచ్చుకుంటే మరి కమ్యూనిస్టన్న మాటే - అయితే అవునుగాక -నేనీ మాటలన్నీ మోసుకెళ్ళి గవర్నమెంటుతో చెబుతానా? ఎంత నామర్దా పని!

ఏమైనా సరే - కాగితం వాపసు చేసేస్తూ వుత్తరం రాసేస్తాను. ఉద్యోగం తీసేస్తే తీసేస్తారు. అంతేకద - బుర్ర తీసేరు కదా. ఉద్యోగం వూడితే వూడుతుందంటున్నాను తేలిగ్గా. ఉద్యోగం ఊడితే నాకు భుక్తి ఎలా? ఉద్యోగం సద్యోగం లేనప్పుడు నన్ను సుభ పెళ్ళి చేసుకుంటుందా? గొప్ప అవస్థలో పడ్డానే. గిరీశం అన్నట్టు అయామ్ డ్రెడ్ఫుల్లీ ఇన్ లవ్ విత్ హర్. అంచేత హాజ్‌సాయిబు తురకల్లో కలిశాడన్నట్టు తొందరపడి యే పనీ చెయ్యకూడదు. ఏమిటి? నాకు గిరీశమా గురువు! ఎంత వరకు దిగజారిపోయాను? ఏమైతేనేం నేను మొదట అనుకున్నట్టే రాసిపారేస్తాను. అయ్యో! నన్ను వీళ్ళు బర్తరఫ్ చేస్తే ఆరంబాకం దగ్గిర ఈ కొత్త ఇనుపదారి - యీ రెండు వారధులు - ఇవన్నీ ఎవరు కట్టిస్తారు? జపానువాడు మీదొచ్చి పడిపోతున్నాడు. 'వార్ డిపార్టుమెంటు' వాళ్ళని ఎలాగేనా ఒప్పించి 'వెల్డింగ్' పద్ధతులమీద వారధులని రెండు నెలల్లో కట్టివేసి దేశాన్ని రక్షించుకుందాం అనుకున్నానే? ఇది నా జీవితంలో మూల సూత్రం. అందుచేత మంచిచెడ్డలు బేరీజు వేసి నిర్ణయించవలసిన విషయం కాదు. కాని యేం చేయగలను? దీంతో - సుభమీద నాకుండే ప్రేమకి - ప్రీస్ట్రెస్డ్ కాంక్రీటుతో కీర్తి సంపాదించే కలలకీ- నా దేశభక్తికీ, అన్నింటికీ స్వస్తి చెప్పేస్తున్నాను.

17 ఆమె

రాజగోపాలచారిగారు గాలి దుమారంలా దేశం అంతటా గొప్ప ప్రచారాన్ని లేవదీశారు. జిన్నాతో రాజీపడి దేశాన్ని రక్షించుకోవాలి అని ఆయన అంటున్నాడు. నాన్నకి యీ ధోరణి బాగా నచ్చింది. ఎందుకంటే, ఈ పద్ధతి అవలంబిస్తే గవర్నమెంటు వారు పిలిచి వైస్‌రాయి ఎగ్జిక్యూటివ్ కౌన్సిలులో మెంబరు పదవి ఇప్పిస్తారని ఆశ. కాని కాంగ్రెసు వదులుకుంటే నలుగురు నోట్లో పడిపోతానేమో అని ఒక భయం ఆయన్ని పీకుతూంది. అంచేత ఎటువైపు పడితే అటే తిరగడానికి వీలుగా వుండేందుకు రాజగోపాలచారిగారి సభలన్నింటికీ వెళుతున్నారు. అమ్మ మొన్న నిలవేసి అడిగింది నాన్నని - యేమిటి నీ ఉద్దేశం అని. "సభలకు హాజరు అయినంత మాత్రాన తప్పేమిటి? ఎప్పటికేనా ఆయనని మళ్ళీ కాంగ్రెసులోకి తీసుకు రావడానికనే. ఆయన చెప్పే వాదనని జాగ్రత్తగా విని పూర్వపక్షం చెయ్యాలి. అందుకే నేను ఆ సభలకి హాజరవుతూంట. నేను కాంగ్రెసుని వదలనని ఇదివరకే చెప్పానుగా" అని బూకరించేశారు! బొంబాయి సభలకి అమ్మానాన్నా ప్రయాణం అవుతున్నారు. ఇంకా పదిరోజులుంది ప్రయాణం. పత్రికల్లో మాత్రం నాన్న గాంధీజీ పక్షాన జోరుగా రాస్తున్నారు - హడావుడిగా కారులో తిరుగుతున్నారు.

ఈవేళ సాయంత్రం నాన్న తలంటురోజు. అంచేత



యింట్లోనే వుండిపోయాను. నాన్న తలంటు అయిపోగానే శ్రీరామ పెట్టేసి, రాష్ట్ర కాంగ్రెసు వర్కింగు కమిటీ సభ అని అమ్మ వెళ్ళిపోయింది. మధ్యాహ్నం సావిడిలో కూచున్నాం. ఇంతట్లోకి కారు ఎవరిదో వస్తున్నట్టు చప్పుడైంది. "మిలిటరీ జీపులాగుంది. చూడు సుబ్బుదూ, ఎవరో అది" అని నాన్నన్నారు. మిలిటరీ జీపులని చూసినప్పుడల్లా వైస్రాయి దగ్గిరనుంచి తనకేదో ఫర్మానా వస్తుందనే నాన్న ఆశ. ఆశ బాహాటంగా నలుగురికీ తెలిస్తే కాంగ్రెసు వాళ్ళేమంటారోనని భయం. అప్పటికీ అమ్మ రోజూ జలకడిగేస్తూనే వుంటుంది. నేను కారుదగ్గిరికెళ్ళేను. పెద్దజీపు. అందరూ మిలిటరీ వాళ్ళే. కారులోనుంచి దిగి వొకాయన చురుగ్గా వస్తున్నాడు. "హల్లో సుభా! నన్ను అంత ఆశ్చర్యంగా చూస్తున్నావేమిటి!" అన్నాడు అతను. "నువ్వటోయ్ - మదనం! ఎప్పుడొచ్చావు? మనవాళ్ళంతా క్షేమమేకదా?" అని అడిగేను. "మన వాళ్ళంటే జపాను వాళ్ళనేగా నువ్వు నన్ను దెప్పడం? జీపులో వాళ్ళు వినగలరు- గట్టిగా అనకు" అన్నాడు. "పుచ్చకాయల దొంగలా బుజాలు తడుముకుంటావెందుకు? మా నేస్తం, పిల్లదూ ఖులాసానేనా? మీ నాన్నగారూ అమ్మగారూ క్షేమమేనా? అని అడిగేనోయ్!" అన్నా. "ఈ నిమిషానికి అందరం క్షేమం" అన్నాడు. నాన్న మదనాన్ని చూసి కుర్చీలోంచి లేచొచ్చి పదడుగులు ఎదురువెళ్ళి "ఓహో కలక్టరుగారా? ఎప్పుడు రావడం? కాంగ్రెసువాళ్ళం అనా మమ్మల్ని ఎడంగా చూస్తున్నారు?" అంటూ నాన్న కరచాలనం చేశారు.

"చిన్నయ్యా! కలక్టరుగారికి పెద్ద పడక్కుర్చీ తీసుకురారా! ఓరే కాళియా! కలక్టరుగారూ అంటూ మీరనడం నాకేం బాగులేదండీ! మీ కళ్ళముందర పెరిగినవాడిని. నేను ఇంటరు, బి.ఏ. చదువుకున్నప్పుడు మీరు ఎంత ఆప్యాయంగా 'అల్లుడూ అల్లుడూ' అని పిలిచేవారు. కాంగ్రెసు వారయాక మర్చిపోయారేమో మరి" అన్నాడు మదనం. "ఎంత కాంగ్రెసు వాళ్ళం అయినా మీరు హోదాలో వున్నప్పుడు గౌరవించాల్సిందే! అందులోకి ఐ.సి.యస్. వాళ్ళు - ప్రభుత్వం వారు" అన్నారు నాన్న. "అదేమిటి మామగారూ! మునుపటిలాగే నన్ను ఏమోయ్ అల్లూడూ అని పిలుస్తేనే నాకు సంతోషం!" అన్నాడు మదనం. "నాకు మన పాత వరుసలే నచ్చుతాయోయ్. నువ్వేమనుకుంటావో అని భయపడ్డాను" అన్నారు నాన్న. "మీరిద్దరూ మామా అల్లూడూ వరసలు పెట్టి పిలుచుకుంటూంటే నన్నేమని పిలవమన్నావ్ మదనం?" అన్నాను నేను. "నువ్వు నన్ను మదనం అని పిలువు. నేను నిన్ను దవనం అని పిలుస్తాను!" అన్నాడు నవ్వుతూను. "దవనాన్ని తల్లో పెట్టుకోవాలి సుమా!" అన్నాను. తల్లో యేమిటి? తలమీద పెట్టుకుని పూజిస్తానంటే నమ్ము" అన్నాడు. నాన్న సంతోషించారు. "నెత్తిమీద దేవతలాగు అందూ" అన్నాను. "చూశారా మామగారూ! మీ అమ్మాయి యెలా వేళాకోళం చేస్తూందో? అత్తగారి తర్ఫీదు మరి! అన్నట్టు అత్తయ్యేదీ, అడగడం మర్చిపోయాను" అన్నాడు. "అమ్మ యేదో సభకి వెళ్ళింది - చీకటి పడ్డాకగాని రాను అని చెప్పింది-" అన్నాను. "సుబ్బదూ, హాస్యాలూ చెయ్యడమేనా లేకపోతే అల్లుడికి ఇంత ఫలహారం చేసిపెట్టడం యేమేనా వుందా? చూడు - బట్లరుని పిలిచి ఆమ్లెట్టు చేయించు. కాఫీ తయారు చేయమను. ప్లేట్లు, కప్పులూ, కత్తీ, ఫోర్కు పట్టుకు రమ్మను. అయ్యరుతో చెప్పి కొత్తావకాయవూట వెండి పళ్ళెంలో తీసుకు రమ్మను" అని నాన్న పురమాయించారు. నేను లోపలికెళ్ళి నాన్న చెప్పినట్టు అన్ని యేర్పాటులూ చేయించి వచ్చాను.

నాన్నా, మదనం మాట్లాడుకుంటున్నారు. మదనం అంటున్నాడు: "ఏం చెప్పమంటారు మామగారు! గవర్నమెంటు రహస్యాలు బైట పెట్టకూడదుగాని మీరు అడుగుతున్నారు కనుక చెప్తుతున్నాననుకోండి. గవర్నమెంటు బెంబేలెత్తి పోతున్నదంటే నమ్మండి. ఈ నిమిషం ఒక తాఖీదిస్తే మరో నిమిషానికి అది రద్దు చెయ్యకుండానే అందుకు వ్యతిరేకంగా మరో తాఖీదు. కోస్తా కోస్తా అంతా కాపలా కాయమన్నారు - జపానువాళ్ళు సబ్మెరైనుమీద ఎక్కడ దిగుతారో అని. కొండ ఘాటీలమీద మాటు వెయ్యమన్నారు. విమానం మీదనుంచి ఎక్కడ వాల్తాడో అని" అన్నాడు. "కాంగ్రెసువాళ్ళ గురించి, కమ్యూనిస్టుల గురించి మీ గవర్నమెంటు వాళ్ళేమనుకుంటున్నారు మదనం?" అని అడిగాను. "నువ్వు కమ్యూనిస్టువి కాదుకదా - కొంపతీసి?" అన్నాడు మదనం. "ఏం, వాళ్ళు మీ స్నేహితులేగా?" అన్నాను. "ఓ దవనవా! నేను చెబుతాను విను. ఇప్పుడు బ్రిటిషువారు కమ్యూనిస్టులని దువ్వుతున్నా ఇంతవరకూ వాళ్ళమీద ఆంక్ష తీసెయ్యలేదు. ఎప్పుడైనా రష్యా అన్నా, కమ్యూనిస్టన్నా బ్రిటిషు వాడికి పక్క బెదురే అనుకో. కాంగ్రెసువాడంటే బ్రిటిషువాడికంత భయంలేదు. ఇక్కడ గాంధీగారు, అక్కడ జిన్నా వున్నంతకాలం ఇంగ్లీషువాడేమీ భయపడడు. ఇందులో యే వుజ్జీ గెలిచినా ఇద్దరూ ఇంగ్లీషు బడిలో చదువుకున్నవాళ్ళే. గాంధీగారి బేరాలు ఇంగ్లీషువాళ్ళకేం కొత్తగాదు. జవహర్లాలు వాళ్ళు యేం అన్నా గాంధీజీ చల్లగా వున్నంతకాలం సత్యాగ్రహం అంటూ మళ్ళీ వచ్చినా దౌర్జన్యరాహిత్యంగానే జరిగిపోతుంది. జైళ్ళలోకి వెళుతుంటారు. జైళ్ళలోంచి వస్తుంటారు. అది వీళ్ళకీ తెలుసు, వాళ్ళకీ తెలుసు. అంచేత ఫుట్‌బాల్ క్రికెట్ ఆటలాగ పద్ధతుల ప్రకారమే జరుగుతూంటాయి. కమ్యూనిస్టుల సంగతి వేరనుకో. అమెరికావాడికీ బ్రిటిషువాడికి, జర్మనీవాడికీ, జపానువాడికీ, మనకీ కూడా రష్యా కమ్యూనిజం గర్భశత్రువు. అంచేత ఈ యుద్ధంలో యీ నిమిషానికి జయాపజయాలెలాగున్నా - పంచమాంకంలో వీళ్ళందరూ కలిసి రష్యాని ధ్వంసం చేసి కమ్యూనిజాన్ని నిర్మూలం చేసేస్తారు. అది తప్పదనుకో. మాకు వచ్చే తాఖీదుల్లో కూడా కాంగ్రెసువాడిని ఒక కంటితోనూ హిందుమహాసభని ఒక కంటితోనూ చూడమన్నారు. కమ్యూనిస్టుని మాత్రం మూడో కంటితో చూస్తూండమన్నారు - ఎప్పటికేనా వాడినుంచే ముప్పొస్తుందని" అన్నాడు మదనం. "అల్లుడూ! ఐతే జపానువాడి ముందర ఇంగ్లీషువాడు నిలబడతాడంటావా? పారిపోతాడంటావా?" అన్నారు నాన్న. "ఇంగ్లీషువాడు యుద్ధం చేస్తాడండోయ్! చెయ్యకపోయినా అమెరికావాడు చేయించితీరుతాడనుకోండి.

- ఇంకా వుంది.

'మహా పాదయాత్ర' విజయవంతం



ఎండలో పాదయాత్ర చేసుకుంటూ ముంబాయి చేరిన మహారాష్ట్ర రైతులు ఈనెల 12వ తేదీన తమ ఆందోళన విరమించారు. ప్రతిపక్షాలతోపాటు శివసేన ఒత్తిడి కారణంగా వీరి డిమాండ్లకు రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం అంగీకారం తెలిపింది. దీంతో నిరసనలను విరమిస్తున్నట్లు రైతులు ప్రకటించారు. తమ డిమాండ్లను నెరవేర్చుకునేందుకు 50 వేల మందికి పైగా రైతులు సీపీఎం అనుబంధ అఖిలభారత కిసాన్ సభ (ఎఐకేఎస్) ఆధ్వర్యంలో ఎర్ర జెండాలతో ప్రదర్శనగా నాసిక్ నుంచి ముంబయికి (180 కిలోమీటర్లు) తరలివచ్చారు. దక్షిణ ముంబయిలోని ఆజాద్ మైదానంలో వీరిని ఉద్దేశించి రాష్ట్ర రెవెన్యూ మంత్రి చంద్రకాంత్ పాటిల్ ప్రసంగించారు. దాదాపు అన్ని డిమాండ్లూ తమకు సమ్మతమేనని తెలిపారు. రైతులను ముంబయి వాసులు రైతులను సాదరంగా ఆహ్వానించి, మంచినీళ్లు, బిస్కెట్లు పంచిపెట్టారు. డబ్బావాలాలు భోజన సదుపాయం ఏర్పాటు చేశారు.

విశాలాంధ్ర ప్రజ్ఞ

కొత్త పార్టీని ప్రారంభించిన దినకరన్

శశికళ మేనల్లుడు, ఇండిపెండెంట్ ఎమ్మెల్యే టీటీవీ దినకరన్ ఈనెల 15న 'అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం' (ఏఎంఎంకే) పార్టీని మధురైలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జయలలిత చిత్రంతో కూడిన పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.

విఖ్యాత భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ కన్నుమూత



సుప్రసిద్ధ భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ తన 76వ ఏట కన్నుమూశారు. కృష్ణబిలాలు, విశ్వం పుట్టుక, విస్తరణ, అంతంపై మన్నికైన సూత్రాలతో సైద్ధాంతిక భౌతికశాస్త్రంలో ఆయన వెలుగులు నింపారు. బ్రిటన్‌లోని కేంబ్రిడ్జిలో ఉన్న తన గృహంలో ఈనెల 14న ఆయన తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఆయన కుమార్తె, కుమారులు లూసీ, రాబర్ట్, టిమ్ ఒక ప్రకటనలో తెలిపారు. భౌతిక శాస్త్ర చరిత్రలో స్రష్టలుగా నిలిచిన న్యూటన్, అల్‌బర్ట్ ఐన్‌స్టీన్ తరువాత ఆ స్థాయి ప్రతిభావంతుడిగా హాకింగ్ గుర్తింపు పొందారు. 1988లో హాకింగ్ ప్రచురించిన 'ఎ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్' పుస్తకం కోటి ప్రతులకు పైగా అమ్ముడుపోయి, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది. ఈ పుస్తకం తెలుగు సహా 40 భాషల్లో అనువాదమైంది. నోబెల్ బహుమతి మినహా ఎన్నో పురస్కారాలను ఆయన అందుకున్నారు.

అంతర్జాతీయ వార్తలు వీక్లీ రౌండప్

చైనా అధ్యక్షుడిగా జిన్‌పింగ్ కొనసాగింపునకు ఆమోదం

చైనాలోని ఏకపార్టీ వ్యవస్థలో కీలకమార్పు చోటుచేసుకుంది. దేశాధ్యక్షుడి రెండు విడతల పదవీకాలంపై ఉన్న పరిమితిని ఎత్తివేసే చరిత్రాత్మక రాజ్యాంగ సవరణకు దేశ పార్లమెంట్ ఈనెల 11న ఆమోదం తెలిపింది. దీంతో ప్రస్తుత అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ (64) జీవితకాలం పదవిలో కొనసాగడానికి మార్గం సుగమమైంది. రెండోదఫా అధ్యక్షుడిగా కొనసాగుతున్న జిన్‌పింగ్.. ప్రస్తుతం అధికార చైనా కమ్యూనిస్టు పార్టీ (సీసీపీ)కి, శక్తివంతమైన సైనిక కమిషన్‌కు నాయకత్వం వహిస్తున్నారు. పార్టీ వ్యవస్థాపక చైర్మన్ మావో జెడాంగ్ తరువాత జీవితకాలంపాటు అధికారంలో కొనసాగనున్న రెండో నేతగా ఆయన గుర్తింపు పొందనున్నారు.

నేపాల్‌లో ఘోర విమానప్రమాదం.. 50 మందికి పైగా దుర్మరణం

నేపాల్‌లో ఈనెల 12న ఘోర విమానప్రమాదం జరిగింది. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన 'యూఎస్-బంగ్లా ఎయిర్‌లైన్స్ విమానం ఒకటి ఖాట్మండూ లోని త్రిభువన్ విమానాశ్రయంలో దిగబోతూ అదుపుతప్పి భూమిని ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో 50 మందికి పైగా దుర్మరణం పాలయ్యారు. దాదాపు 20 మంది గాయపడ్డారు. వీరిలో చాలామంది పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాద సమయంలో విమానంలో 67 మంది ప్రయాణికులు సహా మొత్తం 71 మంది ఉన్నారు.

భారత్- ఫ్రాన్స్ మధ్య భారీ ఒప్పందాలు

భారత్‌లో పర్యటించిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మా న్యుయెల్ మెక్రాన్, మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ మధ్య ఈనెల 10వ తేదీన విస్తృతంగా చర్చలు జరిగాయి. అనంతరం రక్షణ, భద్రత అణు ఇంధనం తదితర రంగాలకు సంబంధించి 14 ఒప్పందాలు కుదిరాయి. వీటి విలువ 16 బిలియన్ డాలర్లు (సుమారు రూ. లక్ష కోట్లు). వీటిలో విమాన ఇంజిన్ల సరఫరాకు కుదిరిన ఒప్పందం విలువే 12.5 బిలియన్ డాలర్లు (సుమారు రూ.81వేల కోట్లు).

జాతీయ వార్తలు

ఎన్‌డీఏ నుంచి వైదొలగిన టీడీపీ

కేంద్రంలో ఎన్డీయే కూటమి నుంచి తెలుగుదేశం పార్టీ ఈనెల 16న లాంఛనంగా వైదొలగింది. ఆంధ్రప్రదేశ్‌కు చేస్తున్న అన్యాయాని కి నిరసనగా కేంద్రంపై టీడీపీ అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టింది. దీనికి కాంగ్రెస్, వామపక్షాలతో సహా వివిధ పార్టీలు మద్దతు పలికాయి. టీడీపీతో పాటు వైసీపీ ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలు ఈనెల 16న లోక్‌సభలో చర్చకు రాలేదు. దీంతో అవిశ్వాస తీర్మానం పెట్టడానికి రెండు పార్టీలు 19వ తేదీకి మరోసారి నోటీసులిచ్చాయి. ఎన్డీయే నుంచి వైదొల గుతున్నట్లు టీడీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాకు పంపిన లేఖలో తెలియజేశారు.

ఢిల్లీలో 'అంతర్జాతీయ సౌర కూటమి' సదస్సు

అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఏ) తొలి సదస్సు ఈనెల 11న ఢిల్లీలో ప్రారంభమైంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, భారత ప్రధాని నరేంద్రమోడీ సహా 23 దేశాల అధినేతలు, అనేకమంది సదస్సులో పాల్గొన్నారు. చౌకగా లభ్యం కావడంతోపాటు కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు ఉపకరించే సౌర విద్యుత్‌కు చేయూతనివ్వడానికి రాయితీతో కూడిన రుణాలను మోడీ పిలుపునిచ్చారు.

ఆధార్ అనుసంధానతకు గడువు పెంపు



బ్యాంకింగ్ సహా వివిధ రకాల సేవలను, సంక్షేమ పథకాలను పొందడానికి మార్చి 31వ తేదీలోగా ఆధార్‌ను అందరూ తప్పనిసరిగా అనుసంధానించుకోవాలన్న గడువును సుప్రీంకోర్టు నిరవధికంగా పెంచింది. ఆధార్ చట్టాన్ని, బయోమెట్రిక్ విధానాన్ని సవాలు చేస్తూ దాఖలైన వివిధ పిటిషన్లపై విచారణ పూర్తిచేసి, తుది తీర్పును తాము వెల్లడించేవరకు ఈ గడువును పొడిగిస్తున్నట్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ప్రకటించింది.

విశాఖ రైల్వేజోన్ సాధ్యం కాదు : రైల్వేశాఖ

విశాఖపట్నం కేంద్రంగా కొత్త రైల్వేజోన్ ఏర్పాటు సాధ్యం కాదని రైల్వే అధికారులు స్పష్టం చేశారు. విభజన చట్టంలోని 13వ షెడ్యూల్‌లో ఉన్న సంస్థల ఏర్పాటుపై హోంశాఖ కార్యదర్శి రాజీవ్‌గాబా, అదనపు కార్యదర్శి టీఎస్ఎన్‌వీ ప్రసాద్... వివిధ కేంద్రప్రభుత్వ శాఖల అధికారులు, ఏపీ, తెలంగాణ అధికారులతో ఈనెల 12న నిర్వహించిన సమీక్షలో రైల్వే అధికారులు ఈ విషయాన్ని విస్పష్టంగా చెప్పారు.

రాష్ట్ర వార్తలు


టెట్ అభ్యర్థులకు 16 మార్కులు


ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో పేపర్-1, పేపర్-2 గణితం, సాంఘిక శాస్త్రాల అభ్యర్థులకు 16 మార్కులు కలపనున్నారు. ప్రశ్నలు, ఐచ్ఛికంగా ఇచ్చిన నాలుగు జవాబుల్లో తప్పులు దొర్లడంతో మార్కులు ఇవ్వాలని నిర్ణయించారు.

17కు చేరిన అతిసార మృతులు


గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో కలుషిత నీరు తాగి మృతిచెందినవారి సంఖ్య ఈనెల 16వ తేదీ నాటికి 17కు చేరింది. నగరంలోని జీజీహెచ్‌లో మరో 70 మందికి పైగా చికిత్స పొందుతున్నారు. రోగుల సంఖ్య తగ్గినప్పటికీ మృతుల సంఖ్య పెరుగుతుండటం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది.

యూపీ, బీహార్ ఉప ఎన్నికల్లో బీజేపీకి ఎదురుదెబ్బ





ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో మూడు లోక్‌సభ నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీకి పరాభవం ఎదురైంది. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, ఫుల్‌పూర్ స్థానాల్లో సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థులు ప్రవీణ్‌కుమార్ నిషద్, నాగేంద్రప్రతాప్ సింగ్ పటేల్ విజయం సాధించారు. బీహార్‌లోని అరారియా లోక్‌సభ స్థానాన్ని ఆర్‌జేడీ నిలబెట్టుకుంది. ఆ పార్టీ అభ్యర్థి సర్ఫరాజ్ అలం ఇక్కడ గెలుపొందారు. బీహార్‌లోని జహానాబాద్ అసెంబ్లీ స్థానంలో ఆర్‌జేడీ, భబువా అసెంబ్లీ స్థానంలో బీజేపీ అభ్యర్థులు గెలుపొందారు.



కార్చిచ్చుకు 11మంది విద్యార్థులు బలి

పర్వతారోహణకు వెళ్లిన విద్యార్థుల్లో 11మంది కార్చిచ్చుకు బలైన సంఘటన ఈనెల 11న తమిళనాడులో చోటుచేసుకుంది. వీరిలో ఏడుగురు మహిళలు, ఇద్దరు పురుషులు, ఒక బాలిక ఉన్నారు. మొత్తం 36 మంది విద్యార్థులు మున్నార్ ప్రాంతంలోని సూర్యనెల్లి నుంచి తమిళనాడులోని తేని జిల్లాలోని కురంగణి ప్రాంతానికి పర్వతారోహణ శిక్షణ కోసం వచ్చారు. వారు కొండ ఎక్కే సమయంలో అకస్మాత్తుగా కార్చిచ్చు రేగింది. మంటల్లో చిక్కుకుని పదిమంది మరణించారు. గాయపడినవారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. వీరిలో ఒకరు ఈనెల 13న చికిత్స పొందుతూ మరణించడంతో మృతుల సంఖ్య 11కు పెరిగింది.

ముక్కోణపు సిరీస్‌లో ఫైనల్‌కు చేరిన భారత్

ముక్కోణపు సిరీస్‌లో భాగంగా ఈనెల 12న ఆతిథ్య శ్రీలంక జట్టుతో జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట శ్రీలంక జట్టు తొమ్మిది వికెట్లకు 159 పరుగులు చేసింది. భారత్ నాలుగు వికెట్ల నష్టానికి తొమ్మిది బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. కొలంబోలో ఈనెల 14న బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ జట్టు 17 పరుగుల తేడాతో గెలుపొందింది. భారత్ 20 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది.

అనంతరం బంగ్లాదేశ్ జట్టు నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్లకు 159 పరుగులే చేయగలిగింది. ఈ మ్యాచ్‌లో విజయంతో భారత జట్టు ఫైనల్స్‌కు చేరుకుంది. భారత్, బంగ్లాదేశ్ జట్ల మధ్య ఫైనల్స్ ఈనెల 18న జరుగుతుంది.

క్రీడా వార్తలు

సెమీ ఫైనల్‌లో పీవీ సింధు

బర్మింగ్‌హామ్‌లో ఈనెల 14న ప్రారంభమైన ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌సిప్ తొలిరోజు భారత్‌కు మిశ్రమ ఫలితాలు లభించాయి. భారత స్టార్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్, సాయిప్రణీత్ తొలి మ్యాచ్‌లోనే పరాజయం చెందారు. అగ్రశ్రేణి షట్లర్లు కిడాంబి శ్రీకాంత్, పి.వి.సింధు అతి కష్టంమీద విజయం సాధించి ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నారు. 15న జరిగిన మరో మ్యాచ్‌లో సింధు విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. పురుషుల సింగిల్స్‌లో హెచ్.ఎస్.ప్రణయ్ కూడా విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. ఈనెల 16న జరిగిన క్వార్టర్స్‌లో సింధు విజయం సాధించి సెమీస్‌కు చేరుకుంది. శ్రీకాంత్ మాత్రం 16న జరిగిన ప్రీ క్వార్టర్స్‌లో ఓడిపోయాడు.

మావోయిస్టుల దాడి.. 9 మంది సైనికుల మృతి

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లాలో కేంద్ర రిజర్వు పోలీసు దళం (సీఆర్‌పీఎఫ్) సిబ్బంది ప్రయాణిస్తున్న వాహనాన్ని ఈనెల 13న మావోయిస్టులు పేల్చివేశారు. ఈ ఘటనలో తొమ్మిదిమంది జవాన్లు మరణించగా, ఇద్దరు గాయపడ్డారు. 212వ బెటాలియన్‌కు చెందిన జవాన్లు కిష్టారం నుంచి పడిలోకి వెళుతుండగా ఈ దాడి జరిగింది. 50 కిలోలకు పైగా మెరుగుపరిచిన పేలుడు పదార్థాల(ఐఈడీ)ను నిర్మాణంలో ఉన్న రహదారిపై పాతిపెట్టి పేల్చడంతో సీఆర్‌పీఎఫ్ వాహనం గాలిలోకి ఎగిరిపడింది. అందులోనివారిలో తొమ్మిదిమంది అక్కడికక్కడే మరణించారు.

తెలంగాణ అసెంబ్లీలో ఉద్రిక్తత

బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఈనెల 12వ తేదీన రాష్ట్ర అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యుల నినాదాల మధ్య ఉద్రిక్తత నెలకొంది. గవర్నర్ ప్రసంగిస్తుండగా, కాంగ్రెస్ సభ్యులు గొడవకు దిగి, పోడియం వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించారు. గవర్నర్ ప్రసంగ ప్రతులను ముక్కలుగా చించి పలుమార్లు పోడియం వైపు విసిరే యగా, మార్షల్స్ అడ్డుకున్నారు. ఈ దశలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన హెడ్ ఫోన్‌ను గాలిలో గవర్నర్ వైపు బలంగా విసిరారు. అది గవర్నర్ భుజంపైనుంచి వెళ్లి పక్కనే ఉన్న స్పీకర్ స్వామిగౌడ్ కంటికి తగిలి కింద పడింది. దీంతో ఆయన కంటికి ఆస్పత్రిలో చికిత్స చేశారు. ఈ ఘటనలకు సంబంధించి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటి రెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్‌ల సభ్యత్వాలను శాసనసభ రద్దుచేసింది. కాంగ్రెస్ శాసనసభా పక్షం నాయకుడు సహా 11 మందిని, శాసనమండలిలో విపక్ష నేత సహా ఆరుగురు సభ్యులను బడ్జెట్ సమా వేశాల వరకు సస్పెండ్ చేస్తూ ఉభయ సభల్లో నిర్ణయం తీసుకున్నారు.

తెలంగాణ వార్తలు

బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మంత్రి 'ఈటెల'

2018-19 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ బడ్జెట్‌ను ఆర్థికమంత్రి ఈటెల రాజేందర్ ఈనెల 15న అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. మొత్తం బడ్జెట్ రూ.1,74,453.84 కోట్లు. ఇందులో నిర్వహణ పద్దు రూ.69,695.94 కోట్లు. ప్రగతి పద్దు రూ.1,04,757.90 కోట్లు.



యువతలో సౌందర్య కాంక్ష

●చర్మరంగుపై మోజు ●వాణిజ్య ప్రకటనల హోరు ●పురుషులదే పైచేయి

భారతీయులు సహజ సౌందర్య వంతులే...సౌందర్య పిపాసులు కూడా...కాదనలేం..కానీ చర్మ రంగుపై వారికున్న కాంక్ష మరెవ్వరికీ లేదన్నది మాత్రం సత్యం. సగటు భారతీయులు తెల్లగా ఉంటేనే అందం అనుకునే భావన ఈ మధ్య కాలంలో మరింత ఎక్కువ కావడంతో కాస్మొటిక్ కంపెనీలు దీన్ని క్యాష్ చేసుకునేందుకు క్యూ కడుతున్నాయి. టీవీలో వచ్చే వాణిజ్యప్రకటనల్లో సగభాగం కాస్మొటిక్స్‌కు సంబంధించినవే... చర్మం మెరుపుగా ఉంటే ఆకర్షణగా ఉంటుందికానీ, రంగునుబట్టి కాదనేది వైద్య నిపుణులు చెబుతున్నారు. కేవలం తల వెంట్రుకల సంరక్షణకు ఏటా ఏకంగా రూ.19,000 కోట్లు ఖర్చుపెడుతున్నారు. ఇందులో పురుషులే అగ్రస్థానంలో ఉన్నారు. సౌందర్యపోషణలో హెయిర్ కేర్ వాటా అధికంగా ఉందని మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. ఫార్మా రంగంతోపాటు ఆయుర్వేద ఉత్పత్తుల తయారీ సంస్థలు ఈ రంగంలో పోటీ పడుతున్నాయి. మొత్తంమీద మనవారు అందానికిచ్చే ప్రాముఖ్యతతో అయా ఉత్పత్తుల అమ్మకాలు ఊపందుకున్నాయి. ఆడా, మగ తేడాలేకుండా సెలూన్లలో ఎక్కువ సమయాన్ని, ధనాన్ని ఖర్చు పెడుతున్నారు. మనదేశంలో కాస్మొటిక్ మార్కెట్ సంవత్సరానికి 15నుంచి 20శాతం వరకు పెరుగుతోంది. 'రిటైల్ బ్యూటీ అండ్ కాస్మొటిక్ మార్కెట్' ప్రస్తుత అంచనాల అధారంగా బ్యూటీ, పర్సనల్ కేర్ మార్కెట్ 2021 నాటికి 10 బిలియన్ డాలర్లకు చేరవచ్చునని తెలుస్తోంది. యువతలో అందంగా కనపడాలనే కాంక్ష 2005 నుంచి వేగం పుంజుకుంది. అందంతో తమ ఆత్మస్థైర్యం పెరుగుతుందని 68 శాతం మంది యువత అభిప్రాయ పడుతున్నారు. 45శాతం మంది తమకు అందుబాటులో ఉన్న ఎటువంటి ఉత్పత్తులనైనా కొనేందుకు మొగ్గుచూపుతున్నారు. మనదేశంలో హెయిర్‌కేర్‌కు 100కుపైగా ప్రముఖ కంపెనీలు పోటీపడుతున్నాయి. ఒత్తిడి, లైఫ్‌స్టయిల్, హార్మోన్ల ప్రభావం, వాతావరణ కాలుష్యాలు తమపై ప్రభావం చూపకుండా అందాన్ని ఇనుమడింప చేసుకునేందుకు యువత ఇష్టపడుతున్నారు. చాలా అంశాల్లో అందం ఇమిడి ఉంటుందనేది వీరిక తెలియని మరో నగ్న సత్యం. పెరుగుతున్న ఫ్యాషన్ పెరేడ్‌లు, కార్పొరేట్ మార్కెటింగ్, సినిమాల ప్రభావం, యధార్థ జీవితాన్ని మరుగున పరచే ఆశలు యువత జీవితాలపై పెనుప్రభావం చూపుతోంది. గ్రామీణ ప్రాంతాల్లోనూ బ్యూటీ సెలూన్ల అదరణ అంతకుంతకూ పెరుగుతోంది. వినియోగదారుల వ్యయాలు, ప్రాముఖ్యతలు గణనీయంగా మారుతున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఏడాదికి 12శాతం వృద్ధి కాస్మొటిక్ రంగంలో నమోదవుతోంది. భారతీయ పురుషుల్లో అందానికి విలువ పెరుగుతుండగా, ఈ ఐదేళ్లలో గ్రూమింగ్ మార్కెట్ 42శాతం పెరిగింది. 18-25ఏళ్లలోపు పురుషులు మహిళల కన్నా పర్సనల్‌కేర్‌పై ఎక్కువ శ్రద్ధ చూపుతున్నట్లు అసోచమ్ అధ్యయనం వెల్లడించింది. సగానికి సగంమంది భారతీయులు హెయిర్, స్కిన్‌కోసం 'నేచురల్, ఆర్గానిక్' ఉత్పత్తుల వినియోగానికే ప్రాముఖ్యత ఇస్తున్నారు. 71శాతం వినియోగదారులు ఫేస్‌క్రీమ్‌గానీ, లోషన్లుగానీ 'నేచురల్' అయితేనే వినియోగిస్తామని చెబుతుండగా, 38 శాతంమంది హెయిర్‌ఆయిల్, షాంపులూ 'బొటానికల్'కే ప్రాధాన్యత ఇస్తామన్నారు. సంప్రదాయక ఉత్పత్తులకు 17 శాతం మంది ఇష్టపడుతున్నారు. వివిధరకాల సెలూన్లు, కాస్మొటిక్ ట్రీట్‌మెంట్ సెంటర్లు, కాస్మొటిక్ ఉత్పత్తుల పరిశ్రమలు దూకుడు ప్రదర్శిస్తున్నాయి. బ్యూటీ సెలూన్లకు వచ్చే ఆదాయంలో 85శాతం మహిళల నుండి వస్తోంది. జుత్తు అందానికి పురుషులు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తున్నట్లు తాజా సమాచారం. అందం కోసం పలు లేపనాలు, క్రీముల కొనుగోళ్లు మరింత ఎక్కువైనట్లు బ్యూటీషియన్లు వెల్లడించారు. కాస్మొటిక్ ఉత్పత్తుల కోనుగోళ్లు 60శాతం కాగా, సెలూన్ల సంఖ్య 35శాతం పెరిగినట్లు ఇండియన్ కాస్మొటిక్ సెక్టార్ ఫోర్‌కేస్ట్ 2017-2022 నిర్వహించిన తాజా అధ్యయనం వెల్లడించింది. భారత్‌లో యువ జనాభా ఎక్కువగా ఉండటం, విదేశీ సంస్కృతి ప్రభావం, జీవన విధానం, బ్యూటీ సెలూన్ల సంఖ్య పెరగడంతో భారతీయ కాస్మొటిక్ మార్కెట్ పెరగడానికి కారణమవుతోందని తెలుస్తోంది. దీనితోపాటు ఆదాయ వనరులు పెరగడంతో వ్యక్తిగత అందానికి ఎక్కువ ప్రాధాన్యత లభిస్తోంది. రానున్న ఐదేళ్లకాలంలో అందాన్ని ఇనుమడింపచేసే కృత్రిమ ఉత్పత్తులకు, ట్రీట్‌మెంట్లకు మరింత గిరాకీ ఏర్పడవచ్చునని తెలుస్తోంది. 'నేచురల్' 'హెర్బల్' ఉత్పత్తులపై మహిళలు మరింత ఉత్సాహం చూపడంతో అంతర్జాతీయ మార్కెట్లు మన దేశ మార్కెటింగ్ రంగంవైపు దృష్టి సారించాయి. మన భారతీయ ఉత్పత్తులకు విదేశాల్లో సైతం గిట్టుబాటు అధికంగా ఉంది. చైనా తరువాత హెర్బల్ కాస్మొటిక్స్‌కు పేరొందిన దేశంగా భారత్‌కు గుర్తింపు ఉందని కెమెక్సెల్ వెల్లడించింది. కలర్ కాస్మొటిక్స్‌కి ప్రాధాన్యత ఎక్కువ ఉన్నట్లు వెల్లడైంది. లిప్‌స్టిక్స్, లిప్ గ్లాస్, నెయిల్ వార్నిష్ వంటివాటివి ప్రకృతి సహజమైన పువ్వులు, వేళ్లు, నూనెల నుండి తయారుచేయడంతో విదేశాల్లో సైతం వీటి వినియోగం ఎక్కువగా ఉంది. భారతీయ సౌందర్య ఉత్పత్తులు 2015-16 కాలంలో 1007.20 మిలియన్ దాలర్లు ఎగుమతులు కాగా ఇదే కాలంలో దిగుమతులు 703.58 మిలియన్ దాలర్లు నమోదైంది.

స్మో 'క్వీన్స్'

◆ దురలవాటుకు దూరమౌతున్న యువకులు
◆ యువతుల్లో పెరుగుతున్న సిగరెట్ వ్యసనం
◆ ఒత్తిడికి ఉపశమనం, ఆధునికతకు చిహ్నమనే భావన
◆ మాతృత్వానికి దూరం చేస్తున్న పాడు అలవాటు
◆ అసోచమ్ అధ్యయనంలో వెల్లడైన చేదు నిజాలు

సిగరెట్ తాగడం మహా ప్రమాదకరమైన అలవాటు. దాని వలన జరిగే అనర్థాలు అన్నీ ఇన్నీ కాదు. ఇవన్నీ తెలిసియువకులు దీనికి దూరంగా జరుగుతుంటే... భారతదేశంలోని యువతుల్లో మాత్రం సిగరెట్ తాగేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతు న్నదట. ఈ అలవాటును ఒత్తిడికి ఉపశమనంగా, ఆధునికతకు చిహ్నంగా వారు భావిస్తున్నారట.



విశాలాంధ్ర-జనరల్ డెస్క్ : సరదా.. సరదా సిగరెట్టు.. ఇది దొరల్తాగు సిగరెట్టు.. ఓ సినీ మహాకవి రచించిన ఈ గీతంలో సిగరెట్టు తాగడం వలన ఎన్ని అనర్థాలు ఉన్నాయో... అన్నీ గమ్మత్తుగా వివరించాడు. అయినా.. జనం మారలేదు. బ్రిటిష్ వలస పాలన నుంచి సంక్రమించిన ఈ దురలవాటు భారతీయుల జీవన ప్రమాణాలను సైతం హరించే స్థాయికి ఎదిగింది. ఒక్క భారతదేశంలోనే కాదు... ప్రపంచ వ్యాప్తంగా పొగరాయుళ్లు కోట్లకు కోట్లు పెరిగిపోయారు. తరువాత.. తరువాత వివిధ స్వచ్ఛంద సంస్థలు, ప్రపంచ ఆరోగ్య సంస్థలు దీనిపై కల్పించిన అవగాహన పొగరాయుళ్ల బుర్రకు ఎక్కి క్రమేణా ఆ అలవాటుకు దూరం అవుతున్నారు. 2020 నాటికి ప్రపంచాన్ని పొగరహితంగా తీర్చిదిద్దాలన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ లక్ష్యం కొద్ది కొద్దిగా నెరవేరే సూచనలు కనిపిస్తున్నాయి. పొగ తాగడం వలన జరిగే హానిని గ్రహించిన మగరాయుళ్లు క్రమంగా దానికి దూరంగా జరుగుతున్నారు. కానీ భారతదేశంలో పరిస్థితి వేరేగా ఉంది. మన సమాజంలో ఉన్నత ఉద్యోగాలు చేసుకుంటూ లక్షలకు లక్షలు జీతాలు సంపా దిస్తున్న మహిళల్లో ఈ అలవాటు పెరుగుతున్నదన్న అధ్యయనాలు, విశ్లేషణలు చూస్తుంటే బుర్ర పాడౌతున్నది. పల్లెలు కాదు గానీ...పట్టణాలలో ఉద్యోగాలు లేదా వ్యాపారాలు చేస్తున్న మహిళల్లో పొగతాగే అలవాటు బాగా పెరిగిందని భారత వాణిజ్య పరిశ్రమల సమాఖ్య(అసోచం)కు చెందిన సామాజిక పరిణా మాల విభాగం నిర్వహించిన సర్వే వెల్లడించింది. ఈ నిజాలు అందరినీ నివ్వెర పరిచేవిగా ఉన్నాయి. ఈ సంస్థ నాలుగు వారాల కాలంలో హైదరాబాద్, అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, జైపూర్, కోల్‌కతా, లక్నో, ముంబై, పూనె వంటి మెట్రో నగరాల్లో మహిళల్లో పొగతాగే అలవాటుపై సర్వే నిర్వహించింది. ఈ సర్వేకు 22 నుంచి 30 ఏళ్ల వయస్సు గల 2000 మంది యువతులను ఇంటర్వ్యూ చేశారు. సిగరెట్ ఎందుకు తాగుతున్నారని వీరిని అడిగితే... ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం అని చెప్పడం ఆశ్చర్యం కలిగిం చింది. ఈ 2000 మంది లక్షల సంపాదన ఆదాయం ఉన్న వారు కాకుండా పనితో క్షణం తీరికలేకుండా గడుపుతున్న వారు ఉన్నారు. తాము రోజుకు పెట్టె లేదాపెట్టెకు మించి సిగరెట్లు తాగుతున్నామని. దానివల్ల వృత్తి సంబంధమైన ఒత్తిడి నుంచి దూరమౌతున్నామని, ఎన్ని సిగరెట్లు ఎక్కువ తాగితే అంత ఉపశమనం లభిస్తుందని, పొగతాగడాన్ని ఆధునికతకు చిహ్నంగా, ఓ ఆకర్షణ శక్తిగా భావిస్తున్నామని ఆ యువతులు చెప్పడం ఆశ్చర్యం కలిగి స్తోంది. సంస్థ ఇంటర్వ్యూ చేసిన 2000 మంది యువతుల్లో 40 శాతం మంది తాము రోజు లేదా అప్పుడప్పుడు మాత్రమే 2 లేదా 3 సిగరెట్లు కాలుస్తామని చెప్పగా, 12 శాతం మంది తాము రోజు 2, 3 సిగరెట్లు తప్పక కాలుస్తామన్నారు. ఇదిలా ఉంటే ఫ్యాషన్ గానో లేదా ఒత్తిడి నుంచి ఉపశమనంగా మారిన ఈ దురలవాటు శారీరక నిర్మాణాలలో తేడాల వల్ల పురుషుల్లో ఒక విధమైన, మహిళల్లో ఒక విధ మైన దుష్ఫలితాలు సంభవిస్తున్నాయి. పొగతా గడం వలన ఊపిరితిత్తులకు హాని, క్యాన్సర్ ముప్పు, గుండెపోటు వంటివి ఇద్దరిలోను ఒకటైనప్పటికీ మహిళల్లో సంతాన సాఫల్య తకు అవరోధంగా మారడమే గాకుండా రక్తం గడ్డ కట్టే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని అసోచం తన నివేదికలో పేర్కొంది. సంతాన సాఫల్యతకు ప్రమాదం కారణంగానే తాము సిగరెట్లు తాగడం మానేశామని సర్వేలో పాల్గొన్న 46 శాతం మంది యువతులు చెప్పారు. సిగరెట్టు తాగ డం వలన ఉపశమనం లభించడం కాదు గానీ... దానివలన కలిగే అనర్థాలు గుర్తించాలని ఈ సర్వే వివరాలు వెల్లడిస్తూ అసోచమ్ సెక్రటరీ జనరల్ డీఎస్ రావత్ యువ తులకు విజ్ఞప్తి చేశారు. వృత్తిపరమైన ఒత్తిడిలో ఉన్న యువతులు తమ సహచరులతో కలిసి సిగరెట్టు తాగడం హూందాగా భావిస్తున్నారేమో గానీ అటు వంటి సంప్రదాయం ఏమాత్రం మంచిది కాదని ఆయన అభిప్రాయ పడ్డారు. చైన్ స్మోకర్లుగా ఉన్న వారు సిగరెట్లు మానేసినా పెద్దగా ప్రయోజనం ఉండబోదని, దాని ప్రభావాలు జీవితాంతం వెంటాడు తాయని, చైన్ స్మోకింగ్ చేసిన వారి ఊపిరితిత్తులకు, నరాలకు జరిగే హాని తొలగిపోవడానికి కనీసం 15 ఏళ్లు పడుతుందన్నది వైద్య నిపుణుల అంచనా. రోజుకు రెండు, మూడే అన్నది ప్రధానం కాదని, సంఖ్య ఎంత అయినా ఆరోగ్యానికి జరిగే నష్టం మాత్రం ఒకేరకంగా ఉంటుందని వైద్యులు అంటున్నారు. సిగరెట్టు తాగితే బరువు తగ్గుతామని, అందుకే ఈ అలవాటు చేసుకున్నామని కొందరు యువతులు చెప్పడం కొసమెరుపు.

Sunday Special

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)		
కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
ఎం&ఎం	741.55	0.88
విప్రో	295.75	0.85
ఎస్-బ్యాంక్	312.90	0.16
హెచ్‌యుఎల్	1,310.90	0.13

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)		
కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
టాటా మోటార్స్	340.10	-3.67
టాటా మోటార్స్ (డి)	190.00	-3.21
ఏషియన్ పెయింట్స్	1,125.45	-3.06
అదానీపోర్ట్స్	382.00	-2.89
హీరో మోటార్‌కార్ప్	3,652.80	-2.67

విదేశీమారకం విలువ (ఫారెక్స్)		
కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	64.93	64.93
యూరో	80.15	80.02
పౌండ్	90.50	90.72
ఆస్ట్రేలియా డాలర్	50.92	50.42
సింగపూర్ డాలర్	49.53	49.39

బులియన్		
బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	28,920	30,930
చెన్నై	28,950	30,962
బెంగళూరు	28,400	30,374
ముంబై	29,710	31,775
విజయవాడ	28,850	31,300
విశాఖపట్నం	29,000	31,020
ప్రొద్దుటూరు	29,920	30,370
ముడి చమురు		65.12

ప్రేమించినవారికన్నా ఫోనే ప్రాణం

● డిజిటల్ ప్రపంచంలో 33శాతం యువత ● 53శాతం.. స్మార్ట్‌ఫోన్‌లపైనే మక్కువ ● 64 శాతం..ఫోన్లలోనే సంబంధాలు



ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే 47శాతం మంది భారతీయులు తమ ప్రియమైన వారికంటే స్మార్ట్ ఫోన్లకే ఎక్కువ మొగ్గుచూపుతున్నట్లు వెల్లడైంది. మరో గమ్మత్తైన విషయం... ఫోన్ల వినియోగంతో మనుషులతో నేరుగా సంబంధం లేకుండా కేవలం ఫోన్లలోనే కాంటాక్టుల్లో ఉండేవారి సంఖ్య 64శాతంతో భారత్ మరింత ముందంజలో ఉంది. అంటే ప్రస్తుత జీవన విధానం పూర్తిగా సాంకేతికతతోనే ముడిపడి ఉంది. 2017లో చైనా నుండి దిగుమతిచేసుకున్న మొబైల్‌ఫోన్లు 12శాతానికి తగ్గాయి. అక్టోబరు-డిసెంబరు మధ్య కాలంలో 87.9 మిలియన్ మొబైల్ ఫోన్లు భారతదేశం దిగుమతి చేసుకున్నట్లు తెలుస్తోంది. భారత దేశంలో 33శాతం మంది యువత నిద్ర లేచినది మొదలు డిజిటల్ ప్రపంచంలోనే జీవిస్తున్నారనేది సత్యం. 'మైండ్-బ్రెయిన్ బిహేవియర్ అండ్ ది సైన్స్ ఆఫ్ హేపినెస్'లో హార్వర్డ్ యూనివర్సిటీ అధ్యయనవేత్త నాన్సిఎట్కాఫ్ మాట్లాడుతూ ఈ తరం యువత ఫోన్ వినియోగంతో తమ జీవితాల మీద తామే నియంత్రణ కోల్పోతున్నట్లు పేర్కొన్నారు. స్మార్ట్ ఫోన్లు తమ ఆత్మీయులు, స్నేహితులకన్నా ఎక్కువన్నది సగానికి పైగా...అంటే 53 శాతం మంది అభిప్రాయం. ఈ అభిప్రాయంతో ఏకీభవించే వారిలో 65శాతంతో భారతీయులు ముందంజలో ఉన్నారని ఇండిపెండెంట్ రీసెర్చి కంపెనీ ఇప్సోస్ తన అధ్యయనంలో పేర్కొంది. ఫోన్-లైఫ్ బ్యాలెన్స్ జీవితంలో కీలకం కాకుండా సాంకే తికతను పెంపొందించుకునే దిశగా యువత అడుగులు వేయవలసి ఉంది. తోటి మనుషులతో సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపే స్మార్ట్ ఫోన్లు భవిష్యత్తులో తమకు మరింత ముప్పు కలిగించకుండా ఉండాలని నిపుణులు అభిప్రాయపడుతు న్నారు. 50 శాతం మంది ప్రజలు తమ ఫోన్లను తరచూ చెక్ చేసుకుంటుంటే, 44 శాతం మంది తప్పనిసరిగా చెక్ చేసుకుంటున్నారు. ఈ కేటగిరీలో భారతీయులు 65 శాతం, 57శాతంతో ముందంజలో ఉన్నట్లు మోటరోలా తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఎక్కువ సమయం ఫోన్ల వినియోగానికే సరిపోతోందని 35శాతం మంది అంగీ కరిం చారు. తమ ప్రేయసిలకంటే ఎక్కువ సేపు తాము సెల్‌ఫోన్లతో కాలం గడుతు న్నట్లు 1990-2000 మధ్య కాలంలో పుట్టిన 44శాతం మంది యువత తెలిపారు. ఈ కేటగిరీ లోనూ భారతీయ యువత 48 శాతం, 55శాతంతో ముందంజలో ఉంది. స్మార్ట్ ఫోన్లతో తక్కువసేపు గడిపితేనే అనందంగా ఉంటామన్న అభిప్రాయాన్ని 53 శాతం మంది భారతీయులు వెలిబుచ్చగా... ఫోన్లు చేతిలో లేకపోతే తీవ్ర భయాందో ళనలకు గురవుతున్నట్లు 65శాతం మంది తెలిపారు. ఫోన్ వినియోగంలో భావో ద్వేగ భరితులవుతున్న భారతీయలలో 77 శాతం మంది...ఫోన్‌ను పోగొట్టు కుంటే దిక్కుతో చనిస్థితికి గురవుతున్నట్లు తెలుస్తోంది. స్మార్ట్‌ఫోన్లు వినియోగించకపోయినా కుదిరితే మంచి ఫోన్‌ను వినియోగించాలనే భావనలో 46శాతం మంది భారతీయులు ఉన్నట్లు వెల్లడైంది.

విజ్ఞానం

బెల్లంతో ఆరోగ్యం



బెల్లం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. మహిళలను వేధించే నెలసరి నొప్పులను బెల్లం మాయం చేస్తుంది. నెలసరి సమయాల్లో వచ్చే కడుపు నొప్పికి చెక్ పెట్టాలంటే.. రెండు పూటలా వేడిపాలలో చిన్న బెల్లం ముక్క వేసుకుని తాగితే మంచి ఫలితం వుంటుంది. నెలసరి వచ్చే రెండు మూడు రోజుల నుంచి క్రమం తప్పకుండా బెల్లం కలిపిన పాలు తీసుకోవడం చేయాలని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు. అలాగే ఆందోళన, గుండెదడతో బాధపడేవారు.. ఆహారం తీసుకున్న వెంటనే కొత్తిమీర, బెల్లంపొడి, సోంపు పొడిని సమపాళ్లలో తీసుకుని నీటిలో కలిపి సేవిస్తే మంచి ఫలితం వుంటుంది. ఇక గొంతు గరగరమంటే తులసీ రసంలో కాసింత బెల్లం కలుపుకుని తీసుకోవాలి. అజీర్తి సమస్యలతో బాధపడేవారు భోజనం తరువాత చిన్న బెల్లం ముక్క తినడం తీసుకోవడం ద్వారా ఉపశమనం లభిస్తుంది. ఇకపోతే.. పిండివంటల్లో పంచదారకు ప్రత్యామ్నాయంగా బెల్లాన్ని ఎంచుకుంటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుంది. ఎందుకంటే బెల్లంలో విటమిన్లు, ఖనిజాలు, పొటాషియం, ఇనుము, క్యాల్షియం పుష్కలంగా వున్నాయని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు.

సోనీ సరికొత్త కెమెరా..!



విజయవాడ : వెడ్డింగ్ ఫొటోగ్రఫీ ప్రొఫెషనల్స్, వైవిధ్య సృజ నాత్మక ఔత్సాహికుల కెమెరా అవసరాలను తీర్చేందుకు సోనీ ఇండియా అసాధరణ, విప్లవాత్మక శక్తిని జోడించి ఏ 7-3 (మోడల్ ఐఎల్‌సీఈ -7ఎం3ని పరిచయం చేసింది. ఈ కెమెరా మార్చి 26 నుంచి మార్కెట్‌లో అందుబాటులోకి రానుంది. ఇది ఫుల్‌ఫ్రేమ్ మిర్రర్ లెస్ లైనప్‌లో ఒక మోడల్. ఇన్వాల్డ్ ఇమేజింగ్ ప్రాసెన్‌తో అభివృద్ధి చేసిన ఫుల్‌ఫ్రేమ్ 24.2 మెగా పిక్సెల్ బ్యాక్ ఇల్యూమినేటెడ్ ఎక్స్‌మార్ అర్ సీమాస్ ఇమేజీ సెన్సార్ దీని ప్రత్యేకత. దీనిలో ప్రపంచ శ్రేణి ఏఎఫ్ సిస్టమ్ ఉంది. 693 ఫేజ్ డిటెక్షన్ ఏఎఫ్ పాయింట్లు 93 శాతం ఇమేజీ ఏరియాను కవర్ చేస్తాయి. 5.0 స్టెప్ షట్టర్ స్పీడ్ అడ్వాంటేజీతో 5- యాక్సిస్ ఆప్టికల్ ఇన్ బాడీ ఇమేజీ స్టెబిలైజేషన్ సదుపాయం ఉంది. మెకానికల్ షట్టర్ లేదంటే సైలెంట్ షూటింగ్ చేసుకోవచ్చు. ఫుల్ ఆటో ఫోకస్, ఆటో ఎక్స్‌పోజర్ ట్రాకింగ్‌తో 10 ఎఫ్‌పీఎస్ వరకూ నిరంతరం షూటింగ్ చేయవచ్చు. అతి తక్కువ సెన్సిటివిటీ దగ్గర 15 స్టాప్ డైనమిక్, విస్తారమైన 100-51200 ఐఎస్‌వో శ్రేణి దీని ప్రత్యేకత. 710 షాట్స్ వద్ద ఏ మిర్రర్‌లెస్ కెమెరాలో లేని విధంగా సుదీర్ఘ బ్యాటరీ జీవితకాలం మరో ప్రత్యేకత. ఈ కెమెరా ధర రూ.1,79,990లు. ఇదే ధరకు బండెల్ కిట్, 28-70 లెన్స్‌ను ఇస్తారు.

బ్యాంకులదే అసలు కుట్ర..!

మాల్యా కేసులో లండన్ జడ్జీ



లండన్ : లిక్కర్ కింగ్ మాల్యాకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులే నిబంధనలను తుంగలోకి తొక్కినట్టు తెలుస్తోందని లండన్ లోని వెస్ట్‌మిన్‌స్టర్ మెజిస్ట్రేట్ అనుమానం వ్యక్తం చేశారు. విజయ్ మాల్యా అప్పగింత కేసుపై శుక్రవారం లండన్ లోని వెస్ట్‌మిన్‌స్టర్ మెజిస్ట్రేట్ కోర్టులో విచారణ జరిగింది. మాల్యా ఎగవేత కేసును పరిశీలిస్తున్న ఆ కోర్టు న్యాయమూర్తి కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భారతీయ బ్యాంకులు సొంత నిబంధనలను ఉల్లంఘించాయన్న విషయం తనకు ఇప్పుడే తెలుస్తోందని జడ్జి ఎమ్మా ఆర్బుత్నాట్ అన్నారు. భారతీయ బ్యాంకులు దీని పట్ల వివరణ ఇవ్వాల్సి ఉంటుందని ఆమె అన్నారు. ముక్కలు ముక్కలుగా ఉన్న కేసు ఇప్పుడిప్పుడు ఒక దగ్గరకు వస్తున్నదని, ఇప్పుడిప్పుడే తనకు ఆ కేసు అర్థమవుతోందన్నారు. మాల్యాపై కుట్ర జరుగుతుందన్న కోణం అందులో ఉన్నట్లు ఆమె వెల్లడించారు. భారతీయ బ్యాంకులకు సుమారు 9 వేల కోట్లు ఎగవేసిన మాల్యా ప్రస్తుతం లండన్‌లో తలదాచుకుంటున్నారు. మాల్యాను అప్పగించాలని బ్రిటన్‌ను భారత్ అభ్యర్థించింది. ఆ కేసులో భాగంగా ఈ విచారణ సాగింది. మాల్యా కూడా కేసు విచారణ సందర్భంగా శుక్రవారం కోర్టుకు హాజరయ్యారు.

-509.45 ▼	-165.00 ▼	-300 ▼	బంగారం (విశాఖపట్నం)	-200 ▼	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	29,000	వెండి (విజయవాడ)	41,400	64.93
33,176.00	10,195.15	29,850	ప్రొద్దుటూరు 29,920	39,300	ప్రొద్దుటూరు 41,723	
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

గృహ రుణ భారం తగ్గాలంటే..

కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి




క్రెడిట్ స్కోరును చూసుకోండి...

మీరు ఇప్పటికే తీసుకున్న అప్పులను ఎలా చెల్లించారో తెలిపేది క్రెడిట్ స్కోరు. ఈ స్కోరు 700కన్నా అధికంగా ఉన్నప్పుడు గృహరుణానికి ఏ ఇబ్బందీ ఉండదు. మంచి క్రెడిట్ స్కోరు ఉన్నప్పుడు సులభంగానే మీ రుణ మంజూరు ప్రక్రియ వేగంగానే సాగుతుంది. క్రెడిట్ స్కోరు రుణం మంజూరీలో కీలకమే కాకుండా.. ఏ బ్యాంకు/ ఆర్థిక సంస్థ మీకు రుణం ఇచ్చేందుకు ముందుకు వస్తుందని నిర్ణయించడంలోనూ ప్రధాన పాత్ర పోషిస్తుంది. మంచి క్రెడిట్ స్కోరు ఉంటే.. బ్యాంకులు/ ఆర్థిక సంస్థలు ఆకర్షణీయమైన వడ్డీ రేటుకు రుణాన్నిస్తాయి. అదే సమయంలో మీ ఆస్తి విలువలో 80-90 శాతం వరకూ రుణం పొందేందుకు అవకాశం కల్పిస్తాయి. అందుకే, ముందుగా మీ క్రెడిట్ స్కోరును పరిశీలించుకోండి. ఏదైనా తప్పులు ఉంటే దిద్దుకోండి. తక్కువ క్రెడిట్ స్కోరు ఉన్నవారికి కాస్త అధిక వడ్డీకి రుణం అందుతుంది.

బేరమాడండి..

చాలామందికి తమ క్రెడిట్ నివేదికను చూపించి వడ్డీ రేట్ల విషయంలో బేరమాడవచ్చనే సంగతి తెలియదు. మంచి క్రెడిట్ స్కోరు ఉన్నప్పుడు బ్యాంకు అధికారులతో మీకు అందిస్తున్న వడ్డీ రేటు విషయంలో బేరమాడేందుకు అవకాశం ఉంటుంది. వడ్డీ రేటును తగ్గించడమో.. లేదా పరిశీలనా రుసుములు రద్దు చేయడమో చేయాల్సిందిగా కోరవచ్చు. దీనివల్ల మీపై అదనపు భారం లేకుండా ఉంటుంది.



తక్కువ వడ్డీకి ఎక్కడ..

ఇప్పటికే మీ పొదుపు ఖాతా ఉన్న బ్యాంకు నుంచే ఇంటి రుణం తీసుకోవాలని అనుకోవద్దు. దీనికన్నా.. ఇతర బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తక్కువ వడ్డీ రేటుకు రుణాలు అందిస్తున్నాయా చూసుకోవాలి. ముందుగా వడ్డీ రేట్లు ఎలా ఉన్నాయి? మీకు అవసరమైన మొత్తం రుణం లభిస్తుందా లేదా అనే విషయాల కోసం కొంత ముందస్తు సన్నద్ధత తప్పనిసరిగా అవసరం. మీకు ఇప్పటికే ఇంటి రుణం తీసుకొని ఉంటే.. ఏదైనా బ్యాంకు దీనికన్నా తక్కువ వడ్డీకే రుణం ఇస్తుందా పరిశీలించండి. వీలైనంత వరకూ ఎక్కడ తక్కువ వడ్డీకి రుణం దొరుకుతుందో చూసుకోండి. దీనివల్ల మీకు కొంత భారం తగ్గినా.. ఉపయోగమే కదా.. ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. ముందస్తు చెల్లింపులు చేస్తే.. ఎలాంటి అదనపు రుసుములు వసూలు చేయవు బ్యాంకులు.

అధికంగా చెల్లించండి

రుణం తీసుకున్న తొలినాళ్లలో వీలైనంత వరకూ ఎక్కువ ఈఎంఐని చెల్లించేందుకు సిద్ధంగా ఉండండి. ఎందుకంటే.. రుణం తీసుకున్న తర్వాత వాయిదాలు చెల్లిస్తున్నప్పుడు తొలినాళ్లలో వాయిదాలోని అధిక మొత్తం వడ్డీకిందకే వెళ్తుంది. దీనివల్ల మీకు అదనపు భారమే.. దీన్ని నివారించాలంటే.. మొదటి నెలల్లో కాస్త అధిక మొత్తంలో వాయిదాలు చెల్లించాలి. ఇక్కడ మరో విషయం.. ఎప్పుడైనా సరే.. బ్యాంకులు రుణ మొత్తంలో రుణగ్రహీతలు 15-20 శాతం వరకూ ముందస్తు చెల్లింపు చేయాల్సిందిగా కోరుతుంటాయి. వీలైనంత మొత్తాన్ని మీరు చెల్లించి, మిగతాదే రుణం తీసుకోండి. మీరు ఎక్కువ డౌన్ పేమెంట్ చెల్లిస్తుంటే.. బ్యాంకులు కూడా మీకు రుణం ఇవ్వడానికి ఎంతో ఆసక్తి చూపిస్తాయి. కొన్నిసార్లు తక్కువ వడ్డీకి రుణం ఇచ్చేందుకు కూడా సిద్ధం కావచ్చు.

వీలైనంత ఎక్కువగా..

రుణ వ్యవధి కొనసాగుతున్నప్పుడు వీలైనప్పుడు కొంత మొత్తాన్ని అసలులో చెల్లించాలి. దీనివల్ల రుణం తొందరగా తీరేందుకు అవకాశం ఉంటుంది. ఏడాదికోసారి వచ్చే బోనస్‌లాంటివి ఇందుకు ఉపయోగించుకోవచ్చు. దీనివల్ల వడ్డీ భారం గణనీయంగా తగ్గుతుంది. పైగా అసలు మొత్తం తగ్గడంతో రుణం తొందరగా తీరేందుకు అవకాశం ఉంటుంది. మీరు ఎంత మొత్తం ఎక్కువగా కడితే.. అంత భారం తొందరగా తగ్గించుకోవచ్చు. గృహరుణ భారం తగ్గించుకోవాలంటే.. ముందుగా మన రుణ నిర్వహణ, పెట్టుబడుల ప్రణాళిక కచ్చితంగా ఉండాలి. అనుకోకుండా వచ్చిన డబ్బును రుణ చెల్లింపులకు వాడటం వల్ల వడ్డీ భారం తగ్గుతుంది.

ఫండ్ల రాబడిపై పన్ను విధింపు ఇలా..



మార్కెట్లో మంచి రాబడికి అవకాశం కన్పిస్తుండటంతో.. ఇప్పుడు మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేస్తున్నవారి సంఖ్య పెరిగింది. సంప్రదాయ పొదుపు పథకాలతో పోలిస్తే.. ఇందులో కొన్ని అదనపు ప్రయోజనాలున్నాయి. ముఖ్యంగా పన్ను భారం లేకపోవడం ఇక్కడ కలిసొస్తుంది. అయితే, ఏయే సందర్భాల్లో పన్ను వర్తిస్తుంది.. ఎప్పుడు ఉండదు అని తెలుసుకోవడం అవసరం.

మ్యూచువల్ ఫండ్ పథకంలో రూ.10వేలు మదుపు చేశారనుకుందాం. కొద్దికాలం తర్వాత ఈ మొత్తం రూ.15వేలు అయ్యింది. అంటే, రూ.5వేలు వృద్ధి చెందింది. పన్ను పరిభాషలో చెప్పాలంటే.. ఈ రూ.5వేలు మూలధన లాభం. మరి, ఇలాంటప్పుడు దీనిపై ఆదాయపు పన్ను ఎలా లెక్కించాలో చూద్దాం.

- ఇక్కడ ముందుగా తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే.. ఈ రూ.10వేలను ఈక్విటీ ఫండ్లలో మదుపు చేశారా? డెట్ ఫండ్లలోనా?
- ఎంతకాలం మదుపు చేశారు? మూలధన రాబడులను రెండు రకాలుగా వర్గీకరిస్తారు.. ఒకటి స్వల్పకాలిక మూలధన లాభం. రెండోది దీర్ఘకాలిక మూలధన లాభం. మనం యూనిట్లను విక్రయించే వ్యవధిని బట్టి ఈ రెండూ ఆధారపడి ఉంటాయి.

మదుపరి ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్ పథకాన్ని కొని, ఏడాదికి మించి కొనసాగించినప్పుడు వచ్చిన మూలధన రాబడిపై ఎలాంటి పన్నూ వర్తించదు. ఒకవేళ మదుపరి, ఏడాదిలోపు ఆ యూనిట్లను విక్రయిస్తే.. అప్పుడు వచ్చే లాభాలను స్వల్పకాలిక మూలధన లాభంగా పరిగణించి, 15శాతం పన్ను విధిస్తారు.

ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్లు కాకుండా డెట్ ఫండ్లలాంటి వాటిల్లో మదుపు చేసి, మూడేళ్లకు మించి కొనసాగించినప్పుడు వచ్చిన లాభాన్ని దీర్ఘకాలిక మూలధన రాబడిగా పరిగణిస్తారు. ఇలాంటప్పుడు ద్రవ్యోల్బణ సూచీకి సర్దుబాటు చేసి, 20శాతం పన్ను విధిస్తారు. అదే మూడేళ్ల లోపే ఫండ్ యూనిట్లను విక్రయిస్తే.. దానిని స్వల్పకాలిక మూలధన లాభంగా పరిగణిస్తారు. అప్పుడు మదుపరులు ఈ లాభాన్ని తమ ఆదాయంలో కలిపి, వర్తించే పన్ను శ్లాబుల ప్రకారం ఆదాయపు పన్ను చెల్లించాలి.

ఏ తరహా మ్యూచువల్ ఫండ్ పథకాలైనా.. డివిడెండ్ల ద్వారా చేతికి వచ్చే ఆదాయానికి ఎలాంటి పన్నూ వర్తించదు. ఈక్విటీయేతర మ్యూచువల్ ఫండ్లపై వర్తించే డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్ (డీడీటీ)ని మ్యూచువల్ ఫండ్/అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థలు ముందుగానే చెల్లించి, మిగిలిన మొత్తాన్నే మదుపరులకు అందిస్తాయి.

ఎన్ఆర్ఐలు అయితే..

ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐ) కూడా మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేసేందుకు అవకాశం ఉంటుంది. అయితే, వీరు మదుపు చేసేప్పుడు కచ్చితంగా భారతీయ కరెన్సీ రూపంలోనే ఆ మొత్తాన్ని కేటాయించాల్సి ఉంటుంది. మన దేశంలోని మ్యూచువల్ ఫండ్ సంస్థలు విదేశీ కరెన్సీని అంగీకరించవు. అందువల్ల ఎన్ఆర్ఐలు ఇక్కడ మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేసేప్పుడు.. మూడు రకాల బ్యాంకు ఖాతాల్లో ఏదో ఒకటి ప్రారంభించాల్సి ఉంటుంది. 1) నాన్ రెసిడెంట్ ఎక్స్‌టర్నల్ రూపీ (ఎన్ఆర్ఈ) అకౌంట్ 2) నాన్ రెసిడెంట్ ఆర్డినరీ రూపీ (ఎన్ఆర్ఓ) అకౌంట్ 3) ఫారిన్ కరెన్సీ నాన్ రెసిడెంట్ అకౌంట్ (ఎఫ్‌సీఎన్ఆర్). ఈ ఖాతాలను ఏదో ఒక భారతీయ బ్యాంకులో తెరవాల్సి ఉంటుంది.

మ్యూచువల్ ఫండ్ యూనిట్లను విక్రయించినప్పుడు వచ్చిన మొత్తాన్ని చెక్కుల రూపంలో చెల్లిస్తారు. లేదా మదుపరి బ్యాంకు ఖాతాలోకి మళ్లిస్తారు. ఈ మొత్తాన్ని రూపాయల్లోనే చెల్లిస్తారు. ప్రవాసులు ఎన్ఆర్ఈ/ ఎఫ్‌సీఎన్ఆర్ ఖాతాల ద్వారా మదుపు చేసి, పెట్టుబడులను వెనక్కి తీసుకున్నప్పుడు.. ఆ మొత్తాన్ని తాము ఉంటున్న దేశానికి మళ్లించుకునే వెసులుబాటు ఉంటుంది. రాబడితోపాటు, డివిడెండ్లను కూడా వారు వెనక్కి తీసుకెళ్లవచ్చు. అయితే, ఎన్ఆర్ఓ ఖాతాద్వారా మదుపు చేసినప్పుడు పెట్టుబడుల ద్వారా వచ్చిన లాభాలను మాత్రమే తాము ఉంటున్న దేశానికి తీసుకెళ్లగలరు. పెట్టుబడి మొత్తాన్ని వెనక్కి తీసుకెళ్లలేరు.

ఇక్కడ ఉంటున్న వారికీ.. ప్రవాస భారతీయులకూ ఒకే రకం పన్ను నిబంధన వర్తిస్తుంది. అయితే, ఎన్ఆర్ఐలు పన్ను చెల్లించాల్సి వచ్చినప్పుడు మూలం వద్ద పన్ను కోత విధిస్తారు.

శ్రీనివాసకల్యాణం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం



శ్రీనివాసకల్యాణం సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. అదే రోజున ఫస్ట్ లుక్‌తో పాటు టైటిల్ లోగో కూడా విడుదల చేయడం విశేషం. అమలాపురంలో శ్రీనివాస కల్యాణం మొదటి రోజు షూటింగ్ జరిగింది. అక్కడి పచ్చటి పంటపొలాల మధ్య ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైనట్లు నితిన్ ట్వీట్ చేశాడు. నితిన్, రాశి ఖన్నా హీరో హీరోయిన్లుగా తెరకెక్కుతున్న ఈ సిని మాకు సతీష్ వేగేశ్న దర్శకుడు. గతంలో శతమానంభవతి లాంటి పూర్తి కుటుంబ కథా చిత్రాన్ని తీసింది ఇతడే. ఆ సినిమాకు ఏకంగా జాతీయ అవార్డు కూడా వచ్చింది. ఇప్పుడు కూడా అదే విధంగా కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రంగా శ్రీనివాసకల్యాణం సినిమాను తెరకెక్కిస్తున్నాడు. దిల్ రాజు నిర్మాతగా, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై వస్తోంది శ్రీనివాస కల్యాణం. ఈ సినిమాకు సమీర్ రెడ్డి సినిమాటోగ్రాఫర్ గా వర్క్ చేస్తుండగా, మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తున్నాడు.

ఏప్రిల్ 6న గులేబకావళి



ప్రభుదేవా, హన్సిక జంటగా నటించిన తమిళ చిత్రం గులేబకావళి. కల్యాణ్ దర్శకత్వం వహించారు. సీనియర్ నటి రేవతి ఓ శక్తివంతమైన పాత్రలో నటించారు. తమిళనాట సంక్రాంతికి విడుదలైన ఈచిత్రం అక్కడ ఘన విజయాన్ని నమోదు చేసుకుంది. కాగా ఇప్పుడు ఈ చిత్రాన్ని అదే పేరుతో సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై మల్కాపురం శివకుమార్ తెలుగులోకి అనువదిస్తున్నారు. ఏప్రిల్ 6న తెలుగు ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా నిర్మాత చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'తమిళంలో ఘనవిజయం సాధించిన ఈ చిత్రం తెలుగు నేటివిటికి దగ్గరగా వుంటుంది. యూనివర్శల్ కాన్సెప్ట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం తప్పకుండా తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుందనే విశ్వాసంతో తెలుగులోకి అనువదిస్తున్నాను. ఇటీవల విడుదలైన థియేట్రికల్ ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది. త్వరలోనే ఆడియోను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. గులేబకావళి అనే గ్రామంలో నిక్షిప్తమైన నిధి కోసం జరిగే అన్వేషణ నేపథ్యంలో ఈ కథ కొనసాగుతుంది. పూర్తి ఎంటర్‌టైన్‌మెంట్‌గా సాగే ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే హైలైట్‌గా వుంటుంది. అత్యధిక బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రంలో ఇండియాన్ మైఖేల్ జాక్సన్ ప్రభుదేవా నృత్యాలు, నటన ప్రధాన హైలైట్‌గా వుంటుంది' అని తెలిపారు. ప్రభుదేవా, హాన్సిక, రేవతి, మన్సూర్ అలీఖాన్, మధు, ఆనంద్‌రాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి స్టంట్స్ : పీటర్ హెయిన్స్, సంగీతం : వివేక్ మెర్విన్, కెమెరా : ఆర్ఎస్ ఆనంద్‌కుమార్, ఆర్ట్: కదీర్, పాటలు: సామ్రాట్, దర్శకత్వం: కల్యాణ్, నిర్మాత: మల్కాపురం శివకుమార్.

కమల్ జతగా నయనతార



కమల్ హాసన్-శంకర్ భారీ బడ్జెట్ చిత్రం 'ఇండియన్-2'కి హైదరాబాద్ వేదిక కాబోతుంది. ఫిల్మ్ సిటీలో ఈ చిత్రంలోని ఎక్కువ భాగాన్ని చిత్రీకరించనున్నాడట శంకర్. సందేశాత్మక కథాంశాలను వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించే శంకర్.. 22 ఏళ్ల తర్వాత తన 'ఇండియన్' చిత్రానికి సీక్వెల్ చేస్తున్నాడు. తొలి భాగంలో 'భారతీయుడు'గా ఆకట్టుకున్న విశ్వనటుడు కమల్ హాసనే సీక్వెల్ లోనూ కరెప్షన్‌పై కదంతొక్కబోతున్నాడు. ఇటీవల తైవాన్‌లో ప్రారంభమైన ఈ భారీ బడ్జెట్ చిత్రం ఎక్కువ భాగం హైదరాబాద్‌లో షూటింగ్ జరుపుకోనుందట. రామోజీ ఫిల్మ్ సిటీలో ఈ సినిమా కోసం బడా సెట్స్ నిర్మించే ఆలోచనలో ఉన్నాడట శంకర్. లైకా ప్రొడక్షన్స్ నిర్మాణంలో భారీ బడ్జెట్‌తో రూపొందే ఈ సినిమాకి ప్రస్తుతం ప్రి-ప్రొడక్షన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయట. ఇందులో కమల్ సరసన కథానాయికగా నయనతారను ఖరారు చేశారట. తొలి భాగానికి సంగీతాన్నందించిన ఎ.ఆర్.రహమాన్ కాకుండా ఈ చిత్రానికి అనిరుధ్‌ను మ్యూజిక్ డైరెక్టర్‌గా ఎంపిక చేసుకునే ఆలోచనలో ఉన్నాడట శంకర్. వేసవిలో రెగ్యులర్ షూట్‌ను ఆరంభించుకోబోతున్న ఈ సినిమా వచ్చే యేడాది ప్రథమార్థంలో ప్రేక్షకుల ముందుకు వస్తుందట. మరి తొలి పార్ట్‌తో సంచలన విజయం సాధించిన కమల్ హాసన్-శంకర్.. 'ఇండియన్-2' తో ఏ స్థాయి సక్సెస్ అందుకుంటారో చూడాలి.



కిరాక్ పార్టీ ఫస్ట్ డే కలెక్షన్లు



నిఖిల్, సంయుక్త హేగ్డే, సిమ్రాన్ పరీన్జా హీరోహీరోయిన్లుగా నటించిన సినిమా కిరాక్ పార్టీ. ప్రపంచవ్యాప్తంగా ఈనెల 16న విడుదలైన ఈ సినిమా మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా 2 కోట్ల 22 లక్షల రూపాయల నెట్ రాబట్టింది. ఇక తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాకు తొలిరోజు కోటి 60 లక్షల రూపాయల షేర్ వచ్చింది.

ఏపీ, నైజాం ఫస్ట్ డే కలెక్షన్లు, నైజాం - రూ.0.54 కోట్లు, సీడెడ్ -రూ.0.25 కోట్లు, ఉత్తరాంధ్ర - రూ.0.26 కోట్లు, ఈస్ట్ - రూ.0.12 కోట్లు, వెస్ట్-రూ. 0.10 కోట్లు, గుంటూరు - రూ. 0.17 కోట్లు, కృష్ణా - రూ. 0.15 కోట్లు, నెల్లూరు -రూ. 0.04 కోట్లు

భారీ సెట్‌లో 'నేల టికెట్'

'టచ్ చేసి చూడు' చిత్రంతో ఇటీవలే ప్రేక్షకుల్ని పలకరించిన రవితేజ ప్రస్తుతం 'నేల టికెట్' చిత్ర పనుల్లో బిజీగా ఉన్నారు. మంచి బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమా కోసం రామోజీ ఫిల్మ్ సిటీలో భారీ సెట్ వేశారట. ఈ సెట్లోనే ఎక్కువ శాతం షూటింగ్ జరగనుందని తెలుస్తోంది. అలాగే మే నెల ఆరంభానికి షూటింగ్ మొత్తం పూర్తయి.. అదే నెలాఖరున చిత్రం విడుదలవుతుందట. ఉగాది సందర్భంగా ఈ చిత్రం ఫస్ట్ లుక్ ను రిలీజ్ చేయనున్నారు. మాళవిక శర్మ కథానాయకిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని రామ్ తాళ్ళూరి నిర్మిస్తుండగా.. 'ఫిదా' ఫేమ్ శక్తికాంత్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఇకపోతే రవితేజతో శ్రీను వైట్ల దర్శకత్వంలో 'అమర్ అక్బర్ ఆంటోని' అనే చిత్రాన్ని కూడ ఇటీవలే మొదలుపెట్టారు.

'విశ్వరూపం-2' సెన్సార్ పూర్తి



విలక్షణ నటుడు కమల్ హాసన్ ప్రస్తుతం 'విశ్వరూపం-2' సినిమాను పూర్తిచేసే పనిలో ఉన్నారు. కొన్నేళ్లుగా నిలిచిపోయిన ఈ ప్రాజెక్టును అసలు నిర్మాత ఆస్కార్ రవిచంద్రన్ నుండి పూర్తిగా తన చేతుల్లోకి తీసుకున్న కమల్.. అన్ని జాగ్రత్తలు తీసుకుని చివరి దశకు చేర్చారు. ఇటీవలే ఈ చిత్ర సెన్సార్ కార్యక్రమాలు కూడా పూర్తయ్యాయి. సెన్సార్ బోర్డు ఈ సినిమాకు యు/ఏ సర్టిఫికెట్ ను జారీ చేసింది. త్వరలో ట్రైలర్‌ను కూడ విడుదల చేయనున్నారు. తమిళ కొత్త సంవత్సరం సందర్భంగా ఏప్రిల్ 13న చిత్రాన్ని విడుదలచేసే అవకాశాలున్నాయని కోలీవుడ్ వర్గాల సమాచారం. కమల్ నటించడడం, నిర్మించడమేగాక, తనే విడుదల చేస్తున్న ఈ సినిమాలో పూజా కుమార్, ఆండ్రియా, రాహుల్ బోస్, శేఖర్ కపూర్ తదితరులు నటిస్తున్నారు.

'మనం సైతం' టీషర్టు ఆవిష్కరించిన తమన్నా

నిస్సహాయులకు అండగా నిలుస్తున్న 'మనం సైతం' సంస్థ కార్యక్రమాలను ప్రముఖ నాయిక తమన్నా అభినందించారు. మనం సైతం నిర్వాహకులు కాదంబరి కిరణ్‌ను ప్రశంసించారు. ఈ సేవా సంస్థకు తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని ఆమె తెలిపారు. మనం సైతం టీషర్టును ఆవిష్కరించిన తమన్నా...పరిశ్రమలో అండ లేని వాళ్లను ఆదుకునేందుకు మనం సైతం లాంటి సంస్థను ప్రారంభించడం, వందలాది మందికి సహాయం అందించడం గొప్ప విషయమన్నారు. 'మనం సైతం కార్యక్రమాల గురించి తెలుసుకున్నాను. ఎంతో మంది పేదవాళ్లను ఆదుకుంటోంది మనం సైతం. ఈ సంస్థ సేవా కార్యక్రమాల్లో ఇకపై నేనూ భాగస్వామి అవుతాను. ఇండస్ట్రీలోని ఇరవై నాలుగు విభాగాల కార్మికులకు మనం సైతం అండగా నిలవడం సంతోషంగా ఉంది. కాదంబరి కిరణ్, అతని బృందానికి నా అభినందనలు' అన్నారు. ఈ సందర్భంగా కాదంబరి కిరణ్ మాట్లాడుతూ..తమన్నా లాంటి స్టార్ హీరోయిన్ మా మనం సైతం కార్యక్రమాలకు చేయూత ఇవ్వడం ఆనందంగా ఉంది అన్నారు.

నాని, అవసరాల సినిమాకు కథ సిద్ధం

నాని, అవసరాల శ్రీనివాస్ సినిమాకు డేట్ ఫిక్స్ అయ్యింది. మేమిద్దరం కలిసి ఓ మూవీ చేస్తాం అని చాన్నాళ్లుగా ఊరిస్తూ వస్తోన్న ఈ స్నేహితులు ఫైనల్‌గా ఓ కథను లాక్ చేసుకున్నారు. నాని, అవసరాల శ్రీనివాస్ కాంబినేషన్లో సినిమా వస్తుందని ఎప్పటినుంచో ప్రచారం జరుగుతోంది. అవసరాల, నాని కూడా మేమిద్దరం కలసి ఆడియన్స్‌ని అలరిస్తామని చెప్పారు. అయితే ఇప్పటి వరకు ఆ ప్రాజెక్ట్ పట్టా లెక్కలేదు. అవసరాల శ్రీనివాస్ నటుడిగా బిజీ కావడం, నాని కూడా వేరే కమిట్మెంట్స్‌తో బిజీగా ఉండడంతో వీళ్ల సినిమా హోల్డ్‌లోకి వెళ్లిపోయింది. దీంతో 'అష్టా-చమ్మా' స్నేహితులు కలసి ఎప్పుడు సినిమా చేస్తారని అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. అయితే ఫైనల్‌గా సాయి కొర్రపాటి ఈ కాంబోని సెట్స్‌కు తీసుకెళ్లడానికి సిద్ధం అయిపోయాడు. శ్రీనివాస్ ఇటీవలే నేచురల్ స్టార్‌కు కథను వినిపించాడట. ఈ కథకు నాని కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని సమాచారం. వారాహి బ్యానర్‌లో సాయి కొర్రపాటి ఈ సినిమా నిర్మిస్తాడట. ప్రస్తుతం నాని 'కృష్ణార్జున యుద్ధం'తో బిజీగా ఉన్నాడు. అలాగే నాగార్జునతో ఓ మల్టీస్టారర్ కమిట్ అయ్యాడు. ఈ రెండు సినిమాలు పూర్తయ్యాక జూన్ ఆఖరులో గానీ, జులై మొదటి వారంలో గానీ స్నేహితులు సినిమా మొదలవుతుందట. మరి 'జ్యో అచ్యుతానంద'లో గెస్ట్ క్యారక్టర్‌తో నానిని డైరెక్ట్ చేసిన శ్రీనివాస్ ఇప్పుడు ఫుల్ లెంగ్త్ రోల్‌లో నాని ని ఎలా చూపిస్తాడో చూడాలి.

జగన్ ఉచ్చులో బాబు..: ఎంపీ హరిబాబు



న్యూ ఢిల్లీ: జగన్ ఉచ్చులో సీఎం చంద్రబాబు చిక్కుకున్నారని ఏపీ బీజేపీ అధ్యక్షుడు, ఎంపీ కంభంపాటి హరిబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. టీడీపీ, బీజేపీ విడిపోతే జగన్‌కు లాభం చేకూరుతుందని, ఆ క్రమంలోనే జగన్ టీడీపీని రెచ్చగొట్టడంతో చంద్రబాబు ఎన్డీయే నుంచి బయటకు వచ్చి.. అవిశ్వాసం పెట్టారన్నారు. రాష్ట్రంలో వైసీపీ, టీడీపీ ఒకరి మీద మరొకరు పైచేయి సాధించాలని జరిపే రాజకీయ క్రీడలో అవిశ్వాసం ఒక భాగం మాత్రమే అన్నారు. ఒక వ్యూహం ప్రకారం టీడీపీని రెచ్చగొట్టి.. జగన్ విజయం సాధించారని అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కేంద్రంపై అవిశ్వాసం తీర్మానం పెట్టి యుద్ధాన్ని ప్రకటించిన నేపథ్యంలో ఎంపీ హరిబాబు ఢిల్లీకి వెళ్లారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాతో ఇవాళ సాయంత్రం భేటీ కానున్నారు. ఈ నేపథ్యంలో విలేఖరులతో మాట్లాడుతూ, జగన్ వ్యూహంలో చిక్కుకుని.. వైసీపీ ఏం కోరుకుందో చంద్రబాబు దాన్ని నెరవేర్చారన్నారు. టీడీపీతో బీజేపీ విడిపోతే తమకు ఆసరాగా ఉంటుందని వైసీపీ నేతలు భావించారన్నారు. నాలుగేళ్లుగా టీడీపీకి, రాష్ట్రానికి కేంద్రం వెన్నుదన్నుగానే ఉందన్న హరిబాబు.. లేనిపోని అపోహలతో టీడీపీ నేడు ఎన్డీయే నుంచి బయటకు వచ్చిందన్నారు. ఏపీలో స్పష్టమైన అభివృద్ధి కన్పిస్తోందని, కేంద్రం సహకారంతోనే ఇది సాధ్యమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్యాయం చేసిందనేది కేవలం నెపం మాత్రమే అని తెలిపారు.

యోగి ప్రభుత్వానికి మరో షాక్!



లక్నో : లోక్‌సభ ఉపఎన్నికల్లో ఓటమి నుంచి కోలుకోకముందే ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వానికి మరో ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్ర కేబినెట్ మంత్రి స్వామి ప్రసాద్ మౌర్య అల్లుడు శనివారం సమాజ్‌వాదీ పార్టీలో చేరారు. ఆ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, మరో నేత ఆజం ఖాన్ సమక్షంలో మౌర్య అల్లుడు నావల్ కిషోర్ ఎస్పీలో చేరుతున్నట్లు ప్రకటించారు. స్వామి ప్రసాద్ మౌర్య గతంలో బీఎస్పీలో ఉన్నారు. 2016 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆయన బీఎస్పీ నుంచి బీజేపీలో చేరి విజయం సాధించారు. ప్రస్తుతం రాష్ట్ర కార్మిక, పట్టణాభివృద్ధి శాఖమంత్రిగా మౌర్య బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గాల ఉపఎన్నికల్లో బీజేపీ ఘోర ఓటమి పాలైన విషయం తెలిసిందే. యోగికి కంచుకోటలాంటి గోరఖ్‌పూర్‌ను ఎస్పీ తన ఖాతాలో వేసుకుంది. ఇది జరిగిన మూడు రోజుల వ్యవధిలోనే బీజేపీ మంత్రి కుటుంబసభ్యుడు ఎస్పీలో చేరడం గమనార్హం.

ఈసారి గెలుపు మనదే : సోనియా



న్యూఢిల్లీ : వచ్చే ఎన్నికల్లో కాంగ్రెసు పార్టీ గెలిచి తీరుతుందని యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీ ధీమా వ్యక్తం చేశారు. ఏఐసీసీ ప్లీనరీలో ఆమె శనివారం ఆమె మాట్లాడుతూ.. ప్రజల మనోభావాలకు అను గుణంగానే కాంగ్రెసు పాలన సాగిందని చెప్పారు. కాంగ్రెసు అస్తిత్వంపై సందేహాలు వ్యక్తం చేస్తున్నవాళ్లకు తగిన సమాధానం చెప్తామని అన్నారు. మారుతున్న రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా భావసారూప్యం గల పార్టీలతో పొత్తు పెట్టుకున్నట్లు తెలిపారు. కాంగ్రెసు ఓ రాజకీయ అంశం కాదు, ఉద్యమమని అన్నారు. కాంగ్రెసు అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన రాహుల్ గాంధీకి శుభాకాంక్షలు తెలిపారు. మీరే నా శక్తి అని అన్నారు. భారతీయ సంస్కృతిలో కాంగ్రెసు ఓ భాగమని అన్నారు. దేశ రాజకీయాల్లో కాంగ్రెసు మరోసారి క్రియాశీలం కావాలని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో అవినీతి పెరిగిపోయిందని సోనియాగాంధీ నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ ప్రారంభించిన సంక్షేమ పథకాలను నీరుగార్చే ప్రయత్నం జరుగుతుందన్నారు. దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేది కాంగ్రెస్ మాత్రమే అని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం అధికారంలోని బీజేపీ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతుందని ధ్వజమెత్తారు. 40 ఏళ్ల కిందట ఇందిరాగాంధీ చిక్‌మగ్‌లూరు నుంచి అఖండ విజయం సాధించి దేశానికి సేవలందించారు. త్వరలో జరిగే కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని సోనియా ధీమా వ్యక్తం చేశారు. అందరి ఐక్యత వల్లే పదేళ్లు అధికారంలో ఉండగలిగాం. 2004లో మన్మోహన్ సింగ్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడ్డాక ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. యూపీఏ-1లో చేసిన అభివృద్ధి వల్లే రెండోసారి అధికారంలోకి రాగలిగామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విజయం ప్రతి ఒక్కరి విజయంగా భావించాలి. కాంగ్రెస్ క్షీణిస్తున్న దశలో తాను పార్టీ బాధ్యతలు తీసుకోవాల్సి వచ్చింది. అన్యాయాలకు వ్యతిరేకంగా గొంతెత్తే పార్టీ కాంగ్రెస్ పార్టీ ఒక్కటేనని ఆమె స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని సోనియా పిలుపునిచ్చారు.

విద్వేషమే బీజేపీ అజెండా

కాంగ్రెస్ ప్లీనరీలో రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ : మత విద్వేషాలను రెచ్చగొడుతూ ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తూ బీజేపీ దేశాన్ని అడ్డగోలుగా చీల్చేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశం మొత్తం అసంతృప్తి, ఆగ్రహంతో ఉందని, ఎక్కడ చూసినా విభజన వాదమే కనిపిస్తోందని, ఈ పరిస్థితులను మార్చి, మళ్లీ దేశాన్ని ఏకతాటిపైకి తీసుకురావాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపైనే ఉందన్నారు. ఢిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో శనివారం 84వ కాంగ్రెస్ జాతీయ ప్లీనరీ సమావేశాలను ఆయన ప్రారంభించారు. రెండు రోజులపాటు అట్టహాసంగా ప్రారంభమైన ఈ ప్లీనరీకి అన్ని రాష్ట్రాలకు చెందిన ముఖ్య నాయకులు హాజరయ్యారు. అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాహుల్‌కు ఇది తొలి ప్లీనరీ కావడం విశేషం. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ 'నేను రెండు ఉపన్యాసాలు చెయ్యాలి. ప్రారంభ ఉపన్యాసం కంటే ముగింపు ఉపన్యాసంలో అన్ని విషయాలపై వివరంగా మాట్లాడుతా. ఈ రెండు రోజులూ.. మీరు మాట్లాడేది సావధానంగా వింటూ, సూచనలు చేస్తూంటా. ఇప్పటికైతే ముఖ్యమైన విషయాలు రెండు చెప్పాలనుకుంటున్నా.. అధికార బీజేపీ ప్రజల మధ్య విద్వేషాన్ని అంతకంతకూ పెంచి పోషిస్తూ.. దేశాన్ని విడగొట్టాలని చూస్తోంది. వాళ్లను అడ్డుకోవాల్సింది మనమే. తిరిగి దేశాన్ని ఏకం చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలదే..' అని చెప్పారు. ఈ ప్లీనరీ దేశానికి, కాంగ్రెస్‌కు మార్గదర్శనం కావాలన్నారు. పార్టీని నడిపేందుకు యువతకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉందని తెలిపారు. యువతకు అనుభవజ్ఞులు మార్గ నిర్దేశం చేయాలని రాహుల్ పేర్కొన్నారు. యువతను నిరుద్యోగం వెంటాడుతోందని, రైతులకు గిట్టుబాటు ధరలు లభించడంలేదన్నారు. ఈ దేశం ప్రజలందరిదీ, అన్ని మతాలది, అన్ని వర్గాలదన్నారు. అన్ని వర్గాలకు మార్గదర్శిగా కాంగ్రెస్ పని చేస్తోందని రాహుల్ గాంధీ తెలిపారు. అందరి లాభం కోసమే కాంగ్రెస్ ఏదైనా చేస్తుందన్నారు. దేశంలో అసహనం పెరుగుతోందన్నారు. ఈ ప్లీనరీ ద్వారా పార్టీని బలోపేతం చేయాలని రాహుల్ భావిస్తున్నారు. బీజేపీ పాలనతో దేశం చాలా అలసిపోయిందని, ఓ కొత్త దిశానిర్దేశం కావాలని, కాంగ్రెస్ పార్టీ మాత్రమే దేశాన్ని ఐక్యంగా ఉంచగలదని, కాంగ్రెస్ పార్టీ మాత్రమే దేశాన్ని ముమ్ముందుకు తీసుకువెళ్లగలదని రాహుల్ అన్నారు. యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్, గులాంనబీ ఆజాద్, అహ్మద్ పటేల్, మోతీలాల్ వోరా, మల్లిఖార్జున్ ఖర్గే, పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలతో పాటు అన్ని రాష్ట్రాల నుంచి హాజరైన పీసీసీ నేతలు, ఏఐసీసీ ప్రతినిధులు హాజరయ్యారు.

త్రిపుర మంత్రుల్లో ముగ్గురు నేరగాళ్లు

అగర్తాలా : త్రిపుర మంత్రివర్గంలో ముగ్గురు నేరగాళ్లు ఉన్నట్లు ఏడీఆర్ (అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్) సంస్థ వెల్లడించింది. ఈ మంత్రి వర్గంలో ఆరుగురు కోట్లాధిపతులు ఉన్నారు. నేరగాళ్ల జాబితాలోని ముగ్గురు మంత్రుల్లో.. ఇద్దరు కరుడగట్టిన నొటోరియస్ క్రిమినల్స్ అని స్పష్టం చేసింది. రతన్ లాల్ నాథ్‌పై నాలుగు కేసులు, మనోజ్ కాంతి దేవ్‌పై రెండు కేసులు, సుదీప్ రాయ్ బర్మన్‌పై కేసులు ఉన్నాయి. ఇక సంపన్నుల్లో జైష్ణు దేవ్‌వర్మ రూ.11 కోట్ల ఆస్తులు, ప్రణజిత్ రాయ్ రూ.5 కోట్లు, సుదీప్ రాయ్ బర్మన్ రూ.3 కోట్ల ఆస్తులను కలిగి ఉన్నట్లు ఏడీఆర్ వెల్లడించింది. ఇద్దరు మంత్రులు పోస్టు గ్రాడ్యుయేట్ పూర్తి చేశారు. త్రిపురలో 25 ఏళ్లు పాలించిన మాణిక్ సర్కార్‌ను దించి.. బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇటీవలే త్రిపుర సీఎంగా విప్లవ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. విప్లవ్ కుమార్‌తో పాటు 8 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. .

యూపీలో 37 మంది ఐఏఎస్‌ల బదిలీ...!

లక్నో : ఉప ఎన్నికల్లో బీజేపీ పరాజయం నేపథ్యంలో ఉత్తరప్రదేశ్‌లో భారీగా ఐఏఎస్‌లను బదిలీలు చేశారు. గోరఖ్‌పూర్ జిల్లా మేజిస్ట్రేట్‌కు మాత్రం సీంయోగి ఆదిత్యనాథ్ ప్రమోషన్ ఇచ్చారు. మొత్తం 37మంది ఐఏఎస్ అధికారులను, 16 మంది జిల్లా మేజిస్ట్రేట్‌లను బదిలీ చేసినట్లు అధికారులు శనివారం తెలిపారు. గోరఖ్‌పూర్‌లో మేజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న రాజీవ్ రౌతెలాకు మాత్రం ప్రమోషన్ ఇచ్చి దేవిపతాన్‌కు డివిజనల్ కమిషనర్‌గా చేశారు. ఈయన లోక్‌సభ ఉప ఎన్నికల వివరాలు బయటకు రానివ్వకుండా చేసేందుకు మీడియాపై కౌంటింగ్ సెంటర్ల వద్ద నిషేధం ప్రకటించి వివాదాస్పదమయ్యారు. దీంతో ఆయనకు ప్రమోషన్ ఇవ్వడంపై ఇప్పుడు సర్వత్రా చర్చ జరుగుతోంది. అధికారులు తెలిపిన సమాచారం ప్రకారం శుక్రవారం అర్ధరాత్రి నుంచి ఈ ఆదేశాలు అమల్లోకి వచ్చాయి.

ఐపీఎస్ విద్యుత్తు చౌర్యం...!

చండీఘడ్ : ఓ ఐపీఎస్ అధికారి విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ఘటన హర్యానా గురుగ్రామ్‌లో వెలుగుచూసింది. 2012 ఏప్రిల్ నుంచి 2014 ఆగస్టు వరకు గురుగ్రామ్ తూర్పు డీసీపీగా ఐపీఎస్ అధికారి నజ్నీన్ భాసిన్ పనిచేశారు. తన అధికారంతో 28 నెలల కాలానికి విద్యుత్తును అక్రమంగా వాడుకొని రూ.3.9 లక్షల బిల్లును ఎగవేసిందని సామాజికవేత్త హరీందర్ ధింగ్రా లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు.దీనిపై లోకాయుక్త ఆమెకు నోటీసు జారీ చేయగా. తాను విద్యుత్ చౌర్యానికి పాల్పడలేదని, తాత్కాలికంగా బ్యాటరీ సాయంతో విద్యుత్ ఉత్పత్తి చేసి వినియోగించుకున్నానని ఐపీఎస్ అధికారిణి నజ్నీన్ భాసిన్ సమాధానం ఇచ్చారు. ఐపీఎస్ అధికారిణి నజ్నీన్ భాసిన్ నేరుగా విద్యుత్ స్తంభం నుంచి నేరుగా తీగలు కలిపి విద్యుత్ చౌర్యానికి పాల్పడిందని ఏసీబీ పరిశీలనలో తేలినందున ఆమెపై కేసు పెట్టి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని హర్యానా లోకాయుక్త ఆదేశించింది.

డబ్ల్యూటీవో సదస్సుకు పాక్ నో...!

న్యూఢిల్లీ : త్వరలో ఢిల్లీలో జరగబోయే ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) సమావేశానికి తాము హాజరుకాలేమని పాక్ స్పష్టం చేసింది. ఈ మేరకు పాకిస్థాన్ దౌత్య వర్గాలు వెల్లడించినట్లు సమాచారం. మార్చి 19.20 తేదీల్లో ఢిల్లీ వేదికగా డబ్ల్యూటీవో మంత్రిత్వ స్థాయి సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి హాజరుకావాలని పాక్ వాణిజ్యశాఖ మంత్రి పర్వేజ్ మాలిక్‌కు గత నెలలో భారత్ ఆహ్వానం పంపింది. ప్రస్తుతం ఆయన ఈ సమావేశానికి రావడం లేదు. 'ఇటీవల ఇరు దేశాల మధ్య చోటుచేసుకున్న విభేదాల నేపథ్యంలో డబ్ల్యూటీవో సమావేశం నుంచి పాకిస్థాన్ తప్పుకుంటుంది' అని పాక్ దౌత్యవర్గాలు తెలిపాయి. సదస్సుకు రాకూడదని పాక్ చివరి నిమిషంలో నిర్ణయం తీసుకుందని.. దీనిపై తాము స్పందించబోమని భారత అధికారులు చెబుతున్నారు. ఇటీవల భారత్, పాక్ మధ్య దౌత్యాధికారుల విషయమై విభేదాలు తలెత్తిన విషయం తెలిసిందే.

మ్యూజియంగా ఆనంద్ భవన్


న్యూఢిల్లీ : బీజుపట్నాయక్ పూర్వీకుల నివాసం 'ఆనంద్ భవన్'ను 'మ్యూజియం, అభ్యసన కేంద్రం'గా శనివారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దేశానికి అంకితమిచ్చారు. మొదటిసారి ఒడిశాను సందర్శించిన కోవింద్ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్, ప్రముఖుల సమక్షంలో ఈ మ్యూజియంను ప్రారంభించారు. మ్యూజియం ప్రారంభోత్సవం అనంతరం ప్రజల సందర్శనకు ఆనంద్ భవన్ దోహదపడేలా నిర్ణయించిన సీఎం నవీన్‌పట్నాయక్‌ను, ఆయన కుటుంబ సభ్యులను రాష్ట్రపతి ప్రశంసించారు.

బాలీవుడ్ స్టార్ లాయర్ అరెస్టు..!

ముంబై : కాల్ డేటా రికార్డు స్కామ్ కేసులో ప్రముఖ బాలీవుడ్ నటుడు నవాజ్‌ద్దీన్ సిద్ధిఖీ న్యాయవాది రిజ్వాన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. రిజ్వాన్ ఇంతకు ముందు ప్రముఖ సెలబ్రిటీలకు న్యాయవాదిగా వ్యవహరించడంతో ఈ కేసుకు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా కాల్ డేటా రికార్డు స్కాం కేసు ముంబైలో కలకలం రేపుతోంది. నలుగురు ప్రైవేటు డిటెక్టివ్స్ అరెస్ట్‌తో వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారంలో ఇప్పటి వరకు 11 మందిని పోలీసులు అదుపు లోకి తీసుకున్నారు. తాజాగా ఈ కేసుతో సంబంధం ఉన్న రిజ్వాన్‌ను థానే పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు మాట్లాడుతూ.. చట్ట విరుద్ధంగా ఇతరుల కాల్ డేటాను రికార్డ్ చేస్తున్న నలుగురు ప్రైవేటు డిటెక్టివ్స్‌ను జనవరి 24న అరెస్ట్ చేశాం. వీళ్ల ద్వారా నవాజుద్దీన్ భార్య కాల్ డేటాను లాయర్ రిజ్వాన్ పొందినట్లు నిందితుడు ప్రశాంత్ పాలేకర్ విచారణలో అంగీకరించాడు. కాల్ డేటా కోసం 50 వేల రూపాయలు వారికి చెల్లించినట్టు తెలిసింది. ఇదే అంశంపై రిజ్వాన్‌తోపాటు నవాజుద్దీన్ దంపతులకు నోటీసులు పంపాం. శుక్రవారం విచారణకు హాజరైన రిజ్వాన్ కాల్ డేటా పొందినట్టు రుజువు కావడంతో అతన్ని అదుపులోకి తీసుకున్నాం. నవాజుద్దీన్ దంప తులు దీనిపై విచారణకు హాజరు కావాల్సొఉందని తెలిపారు.

రైతులకు మద్దతు ధర కోసం కృషి

ప్రధాని మోడీ



న్యూఢిల్లీ : రైతులు ప్రకటిత మద్దతు ధరలు పొందేందుకు రాష్ట్రాలతో కలిసి కేంద్రం పనిచేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. ఉత్పత్తి ధరకు కనీసం 1.5 రెట్లు రైతులకు మద్దతు ధర లభించే విధంగా చూస్తామని తద్వారా రైతుల ఆదాయం పెరుగుతుందని చెప్పారు. మద్దతు ధర ప్రయోజనాలు రైతులకు అందే విధంగా చూసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కి సంబంధించి అనేక మంది వదంతులు వ్యాప్తి చేస్తున్నారని, దీనివల్ల చెడు వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. ఇక్కడి పూసా అగ్రి కాంప్లెక్స్‌లో శనివారం జరిగిన కృషి ఉన్నతి మేళా 2018లో మోడీ మాట్లాడారు. వివిధ పంటలకు ఎంఎస్‌పీని నిర్ణయించేటప్పుడు ఇన్‌పుట్ వ్యయాలన్నింటిని కలపను న్నామని, ఈ నిర్ణయం 2022 నాటికి వ్యవసాయా దాయం రెట్టింపు కావడానికి తోడ్పడుతుందని తెలిపారు. దేశం వంటనూనెల దిగుమతిపై ఆధారపడకుండా చూసేందుకు మరిన్ని తైలపంటలు సాగు చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. 2022 నాటికి యూరియా వినియోగాన్ని కనీసం సగానికి తగ్గించాలని కూడా మోడీ కోరారు. వ్యర్థపం టలను కాల్చివేయవద్దని, అలా చేయడం వాయుకాలుష్యానికి దారితీయడంతో పాటు భూసారంపై ప్రభావం చూపుతుందని అన్నారు. వ్యవసాయం ఎదుర్కొం టున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం నిరంతరాయంగా కృషి చేస్తోందని తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంపొందించేందుకు వ్యవసాయ మార్కెట్లను పెంచుతున్నామని చెప్పారు. "రైతులు అధునాతన విత్తనాలు, తగినంత విద్యుత్ పొందేందుకు ప్రభుత్వం రాత్రి, పగళ్లు కృషి చేస్తోంది. రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్ చేయడంలో ఎటువంటి ఇబ్బంది పొందకుండా చూస్తున్నాం. ఉత్పత్తులకు తగిన ధర పొందే విధంగా చూస్తున్నాం" అని మోడీ తెలిపారు.

ఎస్పీ ఆఫీసులో బీఎస్పీ నేత ఫ్లెక్సీ

లక్నో : ఒకప్పుడు ఉప్పు, నిప్పులా రగిలిపోయిన యూపీలోని ఎస్పీ, బీఎస్పీ మధ్య సఖ్యత వెల్లివిరుస్తోంది. ఒక పార్టీని మరో పార్టీ అమితంగా గౌరవించుకునే పరిస్థితి ఏర్పడింది. ఉప ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం యూపీ సమాజ్‌వాది పార్టీ ప్రధాన కార్యాలయం వద్ద అనూహ్యంగా బీఎస్పీ అధినేత్రి పోస్టర్లు వెలిశాయి. యూపీ మాజీ సీఎం ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, మరో మాజీ సీఎం బీఎస్పీ అధినేత్రి మాయావతి ఫొటోలతో ఫ్లెక్సీలు పెట్టారు. అంతేకాదు, బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం, ఎస్పీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్, మరో ఎస్పీ నేత అజాం ఖాన్ ఫొటోలు కూడా ఈ ఫ్లెక్సీల్లో పెట్టారు. మరింత ఆశ్చర్యకరంగా మాయావతి ఫొటో మాత్రం చాలా పెద్దగా వేశారు. ఫుల్పూర్, గోరఖ్‌పూర్‌లో తమకు విజయాన్ని అందించిన ప్రజలకు ధన్యవాదాలు అని పేర్కొంటూ ఎస్పీ కార్యకర్త అహ్మద్ లారీ ఈ ఫ్లెక్సీలు వేయించారు. ప్రస్తుత సీఎం యోగి ఆదిత్యనాథ్, డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్య ఒకప్పుడు ప్రాతినిథ్యం వహించిన గోరఖ్‌పూర్, ఫుల్పూర్ నియోజవర్గాలను బీఎస్పీ సాయంతో బీజేపీని ఓడించి ఎస్పీ తమ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ విజయం అనంతరం అఖిలేశ్ బీఎస్పీ అధినేత్రి మాయావతి వద్దకు వెళ్లి ధన్యవాదాలు కూడా చెప్పారు. ఈ నేపథ్యంలోనే కొత్తగా పోస్టర్లు వెలువడటం చర్చనీయాంశంగా మారింది.

ప్రధానిపై ఆనందీబెన్ ప్రశంసల జల్లు

అహ్మదాబాద్ : మధ్యప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్ ప్రధాని నరేంద్రమోడీపై ప్రశంసల జల్లు కురిపించారు. అమేయా లత్కార్ రాసిన 'కర్మ యాత్రి' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, పార్టీకి అంకితభావంతో పనిచేసే కార్యకర్తలను ఎంపిక చేసే సత్తా మోడీకి ఉండటం వల్ల కేంద్రంలో బీజేపీ అధికారం చేజిక్కించుకుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ చీఫ్ అమిత్‌షా, గుజరాత్ సీఎం విజయ్ రూపానీ, ప్రముఖులు పాల్గొన్నారు.

కేరళ రాష్ట్రీయ ఫలం పనస



తిరువనంతపురం : కేరళ అధికార జంతువు ఏనుగు,పక్షి : లకుముకి పిట్ట, పుష్పం: పసుపురంగులో గుత్తులుగా కాసే రేల, చేప: కొరమీను తర్వాత అధికారిక ఫలంగా పనసను ప్రకటించింది. చెట్టుకు ఉండే అతి పెద్ద ఫలం ప్రత్యేకమైన వాసనతోపాటు మంచి రుచికూడా కలిగి ఉంటుంది. మార్చి 21న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా దీనిపై ప్రకటన చేయనుంది. దేశ విదేశాల్లో ఈ పండులో లభించే పోషక పదార్థాలపై అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. పనస పండ్ల అమ్మకాల ద్వారా ఏడాదికి రూ. 15 వేల కోట్లు రాబట్టాలని వ్యవసాయ మంత్రి వీఎస్ సునీల్ కుమార్ వెల్లడించారు. దీనిపై అసెంబ్లీలో కూడా ప్రకటన చేస్తామని సునీల్ తెలిపారు. రాష్ట్రంలో విరివిగా పండే పండు పనస అని, దీనిలో చాలా రకాలు ఉన్నాయన్నారు. ఇది ఎరువులు, పురుగుమందులు లేకుండా స్వతహా సిద్ధంగా పండే ఫలాలని, రాష్ట్రీయ ఫలంగా దీన్ని ప్రకటించడంతో పనస ఆధారిత ఉత్పత్తులకు మార్కెట్ పెరుగుతుందన్నారు. పనస చెట్ల పెంపకాన్ని స్థానికంగా 'ప్లవు' అంటారు. ప్రభుత్వం ఈ మొక్కలను పంపిణీ చేస్తోంది. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అంబాల వాలాలో పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతిఏడాది పనసపండు పండగను నిర్వహించి ఈ పండు ప్రాధాన్యతను వివరిస్తామన్నారు. పండు రుచి, వాసన, పోషకాహారమే కాకుండా చెట్టుకాండానికి కూడా అధిక ప్రాధాన్యత ఉందని మంత్రి వివరిస్తూ, కర్బన ఉద్గారాలను తగ్గించడంలో పనస అమోఘమైన పాత్ర పోషిస్తుందన్నారు.

దక్షిణాది తిరగబడితే.. కేంద్రం ఏకాకే

కర్ణాటక సీఎం సిద్ధరామయ్య



బెంగళూరు : దక్షిణాది రాష్ట్రాల పట్ల కేంద్రంలోని సర్కారు సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని కర్ణాటక సీఎం సిద్ధ రామయ్య మండిపడ్డారు. పరిపాలనలో రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అభిప్రాయపడ్డారు. దక్షిణాది రాష్ట్రాలు ఎదురు తిరిగితే కేంద్రం ఏకాకి అయ్యి రోడ్డున పడుతుందని, ఆ విషయం ప్రధాని నరేంద్ర మోడీ గుర్తు పెట్టుకోవాలని హెచ్చరించారు. తన ఫేస్ బుక్ ఖాతాలో సీఎం కేంద్ర ప్రభుత్వం తీరుపై తీవ్రస్థాయిలో విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం విదేశాలతో ఏకపక్షంగా చేసుకుంటున్న ఒప్పందాల కారణంగా దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతున్నాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలను దెబ్బకొట్టడానికే ఇలాంటి ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. భారత దేశం వివిధ రాష్ట్రాల సమాహారంతో ఏర్పడిన సమాఖ్య వ్యవస్థ అనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం మరిచిపోయిందని, రాష్ట్రాలకు ప్రజాహిత, పరిపాలన నిర్ణయాలు తీసుకోవడానికి మరింత స్వయం ప్రతిపత్తి కల్పించాలనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వం వియత్నాం మిరియాల్ని శ్రీలంక నుంచి దిగుమతి చేసుకునే ఒప్పందం కుదుర్చుకోవడంతో కేరళ, కర్ణాటకలోని మిరియాల రైతులు బజారుపాలు అయ్యారని, వస్తు సేవల పన్ను మాదిరి వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతికి ప్రత్యేక మండలిని ఏర్పాటు చెయ్యాలని డిమాండు చేశారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాలు అధిక మొత్తంలో పన్ను చెల్లిస్తుంటే కేంద్ర ప్రభుత్వం కేవలం ఎంగిలి మెతుకులు విదుల్చుతోందని, దక్షిణాది రాష్ట్రాలను ఏవిధంగానూ ప్రోత్సహించడం లేదని, మోడీ ప్రభుత్వం వెన్నుపోటు పొడుస్తోందని సిద్ధరామయ్య ఆరోపించారు. కర్ణాటక పన్ను రూపంలో చెల్లిస్తున్న ప్రతి రూపాయికి కేంద్ర ప్రభుత్వం రూ.47 పైసలు మాత్రమే తిరిగి చెల్లిస్తోందని, మిగిలిన రూ.53 పైసలు ఉత్తర భారతదేశం కోసం ఖర్చు పెడుతోందని, అదే ఉత్తరప్రదేశ్ ఒక్క రూపాయి చెల్లిస్తే తిరిగి ఆ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం రూ.1.79 పైసలు చెల్లిస్తోందని సీఎం ఆరోపించారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం మీద ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ తిరుగుబాటు చేసిన సమయంలో మహారాష్ట్రలోని శివసేన, కర్ణాటకలోని కాంగ్రెస్ పార్టీ ప్రత్యక్షంగా, పరోక్షంగా టీడీపీకి మద్దతు ఇస్తోంది. కేంద్రంలో మోడీ ప్రభుత్వంపై ఎదురుదాడికి దిగుతున్నారు. బెంగళూరులో బీజేపీకి బలమైన మద్దతు ఉంది. బెంగళూరు నగరంలో తెలుగు ప్రజలు అధిక శాతంలో ఉన్నారు. బెంగళూరు తెలుగు ప్రజలను ఆకర్షించడానికి కాంగ్రెస్ పార్టీ ఎంతో కాలంగా ప్రయత్నాలు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం నిరాకరించడంతో తెలుగు ప్రజలను ఆకర్షించడానికి సీఎం సిద్ధరామయ్య ప్రయత్నాలు చేస్తున్నారు

చెట్టును ఢీకొని కారు మూడు ముక్కలు

సేహూర్ : అతి వేగంతో ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టి మూడు ముక్కలైంది. కారులోని ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్-ఇండోర్ హైవేపై శనివారం ఉదయం ఈ ఘోర ప్రమాదం జరిగింది. టైరు పేలినట్లు పెద్ద శబ్దం రావడంతో పరుగున వెళ్లామని, అక్కడి దృశ్యాలు చూసి స్థాణువైపోయామని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. ప్రమాదాన్ని గుర్తించిన వెంటనే అంబులెన్స్‌కు, పోలీసులకు సమాచారం అందించామని పేర్కొన్నారు. ప్రమాదానికి గురైన కారు జబల్‌పూర్ వాసులదిగా గుర్తించామని, మితిమీరిన వేగం వల్లే దుర్ఘటన జరిగినట్టు భావిస్తున్నట్లు పోలీసులు వివరించారు.

జార్ఖండ్‌లో బాంబు నిర్వీర్యం

రాంచీ : జార్ఖండ్‌లో 80 కిలోల ఐఈడీ బాంబును పోలీసులు నిర్వీర్యం చేశారు. శాడిల్ హథీ - హథీ చౌక్ మధ్య రోడ్డుపై ఐఈడీ బాంబును పాతిపెట్టినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడ జేసీబీతో తవ్వకాలు జరిపి బాంబును నిర్వీర్యం చేశారు. బాంబును రోడ్డుపై పాతిపెట్టారని ముందే సమాచారం అందడంతో పెను ప్రమాదం తప్పిందని పోలీసులు తెలిపారు.

ఐదేళ్ల చిన్నారిపై అత్యాచారం

థానే : ముంబైలో బందూప్ గుర్తు తెలియని వ్యక్తి ఐదేళ్ల చిన్నారిని కిడ్నాప్ చేసి థానేలో అత్యాచారానికి పాల్పడ్డాడని పోలీసులు శనివారం తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుందని తెలిపారు. బందూప్‌లో బాలిక నివాసం వద్దే కిడ్నాప్ జరిగిందని, థానేలో అజాద్ నగర్‌కు తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడని చెప్పారు. ఘటన అనంతరం ఆ వ్యక్తి చిన్నారిని అక్కడే వదిలి వెళ్లిపోయాడని, చిన్నారి ఏడుపు విని స్థానికులు సమాచారమిచ్చారని చెప్పారు. కేసు దర్యాప్తు జరుగుతోందని చెప్పారు.

ప్రత్యేక ప్యాకేజీ కోరనున్న త్రిపుర సీఎం

అగర్తల : త్రిపుర సీఎం విప్లవ్‌కుమార్ దేవ్ ప్రధాని నరేంద్రమోడీని కలవనున్నారు. రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో కేంద్రం నుంచి ప్రత్యేక ప్యాకేజీని కోరేందుకు సీఎం ప్రధానిని కలవనున్నారని ఆ రాష్ట్ర మంత్రి ప్రణజిత్ సింఘా తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రత్యేక ప్యాకేజీ అంశంపై సీఎం దేవ్ ప్రధానితోపాటు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీని కూడా కలవనున్నారని చెప్పారు. శుక్రవారం రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితిపై మంత్రిమండలి సమీక్ష సమావేశం జరిగిందని తెలిపారు.

డ్రగ్స్ రాకెట్ కేసులో నలుగురి అరెస్టు

న్యూఢిల్లీ : అక్రమంగా మత్తు మందును రవాణా చేస్తున్న ముఠా గుట్టు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) రట్టుచేసిందని ఆ ఏజెన్సీ శనివారం తెలిపింది. ముఠాసభ్యులు నలుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుండి 55,875 జోల్‌ఫిడెం మత్తు టాబ్లెట్లను స్వాధీనం చేసుకుందని చెప్పారు. ఘజియాబాద్, లక్నో నుంచి కొరియర్ సర్వీసులను నడుపుతూ వారు అక్రమంగా మత్తు పదార్థాలను రవాణా చేస్తున్నారని తెలిపారు.

పామాయిల్ అక్రమ నిల్వలపై విజిలెన్స్ దాడులు



విశాలాంధ్ర - అద్దంకి : ప్రకాశం జిల్లా అద్దంకి మండలంలోని ఓ హోటల్‌లో పామాయిల్, డీజిల్ అక్రమ నిల్వలపై ఒంగోలు విజిలెన్స్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. 2 వేల లీటర్ల పామాయిల్, 100 లీటర్ల డీజిల్‌తోపాటు ఓ లారీ స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరుజిల్లా కృష్ణపట్నం పోర్టు నుంచి హైదరాబాద్ వెళ్లే ఆయిల్ ట్యాంకర్లను అద్దంకి - సంతమాగులూరు రోడ్డులోని శ్రీనివాసనగర్ వద్ద ట్యాంకరు సీలు తొలగించి పామాయిల్‌ను డ్రమ్ములకు నింపి సమీపంలోని సాయి హోటల్‌లో నిల్వ చేస్తున్నారు. అక్కడ నుంచి రోజూ హోటళ్లు, రెస్టారెంట్లకు కొందరు పామాయిల్‌ను అక్రమంగా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో శనివారం దాడులు చేసినట్లు ఒంగోలు విజిలెన్స్ సీఐ టీవీఎస్ అజయ్‌కుమార్ తెలిపారు. ఆయిల్‌ట్యాంకర్, హోటల్‌లో నిల్వచేసిన 2వేల లీటర్ల పామాయిల్, 100 లీటర్ల డీజిల్‌ను సీజ్ చేసినట్లు వివరించారు. హోటల్ నిర్వాహకుడు వలిని అదుపులోకి తీసుకున్నామన్నారు. దాడుల్లో అద్దంకి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ చెంచురామయ్య, విజిలెన్స్ కానిస్టేబుళ్ళు మల్లికార్జున, నరసయ్య, హోమ్‌గార్డు రామక్రిష్ణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకిచ్చిన హామీలు అమలు చేయాలి



విశాలాంధ్ర - గుంటూరు (జిల్లాపరిషత్) : అంగన్‌వాడీ కార్మికులకు ప్రభుత్వం యిచ్చిన హామీలు అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి జె.హెబ్బాఫ్లారెన్స్ డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేట మల్లయ్యలింగంభవన్‌లో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ కార్మికసంఘం విజయ వాడలో నిర్వహించిన ధర్నా ఫలితంగా, మంత్రి పరిటాల సునీత ఆదేశంతో కమిషనర్ అరుణ్ కుమార్‌తో సంప్రదింపులు జరిపినట్లు చెప్పారు. ఏపీ రాష్ట్ర ప్రభుత్వం కూడా తెలంగాణా రాష్ట్రం ఇస్తున్నట్లు కనీసవేతనం రూ.18వేలు ఇవ్వాలని ప్రభుత్వానికి సిఫారసు చేస్తానని, అలాగే గ్యాస్ ఖర్చులు రెట్టింపు యిస్తానని హామీ యిచ్చినట్లు చెప్పారు. ఇంటి అద్దె బకాయిలు, రిటైరైన కార్మికులకు రావలసిన బకాయిలు ఒక నెలలోగా చెల్లించటానికి అంగీకరించారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కార్మికుల చట్టాలు అమలు చేయాలని, పీఎఫ్, గ్రాట్యుటీ సాధన కోసం ఈ నెల 27వ తేదీన విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణమూర్తి తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు కె.స్వరూపరాణి పాల్గొన్నారు.

అకాల వర్షం..అపార నష్టం

- నెల్లూరు జిల్లాలో భారీ నష్టం
- గాలివానకు వరి పంట నేలపాలు
- ఆదుకోవాలని రైతుల వేడుకోలు

విశాలాంధ్ర - నెల్లూరుబ్యూరో : ప్రకృతి మరోసారి రైతులపై కన్నెర్రజేసింది. నెల్లూరు, గుంటూరు, ప్రకాశం, గోదావరి జిల్లాల్లో ఆకాల వర్షానికి అన్నదాతలు అపారంగా నష్టపోయారు. నెల్లూరు జిల్లాలో శుక్రవారం రాత్రి ఒంటి గంట నుంచి శనివారం ఉదయం 5 గంటల వరకు కురిసిన వర్షం దెబ్బకు రైతులు తల్లడిల్లిపోయారు. వేలాది ఎకరాల్లో పంట దెబ్బతింది. ధాన్యపు రాశులు తడిసి ముద్దయ్యాయి. సుమారు రెండు కోట్ల రూపాయల పంట నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. నాలుగేళ్లుగా వర్షాలు సక్రమంగా లేక నానాకష్టాలతో బావులు, బోర్లు ఆధారంగా సాగు సమరం చేసినా కనీస దిగుబడి చేతికి రాక కరవు జిల్లా రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగు సమయంలో జాడ లేని వర్షం అవసరం లేని సమయంలో శుక్రవారం రాత్రి కురిసి అన్నదాత నడ్డి విరిచింది. ప్రస్తుతం జిల్లాలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కొందరు ధాన్యాన్ని పొలాల్లోనే నిల్వ చేసుకుని విక్రయిస్తున్నారు. మరికొందరు గోదాముల్లో నిల్వచేసుకున్నారు. గాలీవాన బీభత్సంతోపాటు భారీ వర్షానికి జిల్లాలో వేలాది ఎకరాల్లో పంట దెబ్బతింది. సుమారు రూ.2 కోట్ల విలువైన పంట నష్టం వాటిల్లినట్టు అంచనా. వరి కోత సమయంలో గాలీవాన ధాటికి గింజలు రాలిపోయాయి. కొన్నిచోట్ల పొలాల్లోని ధాన్యపు రాశులు తడిసి ముద్దయ్యాయి. ఎకరాకు 40 బస్తాల దిగుబడి వస్తుందని ఆశపడినా 20 బస్తాలు కూడా అయ్యే పరిస్థితి లేదు. దొరవారిసత్రం, చిట్టమూరు, తడ, సూళ్లూరుపేట, పెళ్లకూరు, నాయుడుపేట, ఆత్మకూరు, ఉదయగిరి, ఏఎస్‌పేట, రాపూరు, పొదలకూరు, అనంతసాగరం, కొండాపురం, కలిగిరి, కావలి రూరల్ మండలం, కోట, వాకాడు, నెల్లూరు రూరల్, ఇందుకూరుపేట, మనుబోలు, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు తదితర మండలాల్లో వేల ఎకరాల్లో ధాన్యపు రాశులు తడిసిపోయాయి. కొన్నిచోట్ల కోతలు కోసిన ఓదులు తడిసిపోయాయి. పొలాలు, రోడ్లపై ధాన్యం ఆరబోసిన రైతులు రాత్రి సమయంలో వర్షం కురవడంతో బస్తాల్లోకి ఎత్తేందుకు వీలులేకుండా పోయింది. పట్టాలు కప్పుదామని ప్రయత్నించినా దొరకని పరిస్థితి. వర్షంలో పరుగులు తీసి పట్టాలు కప్పినప్పటికీ ప్రయోజనం లేదు. శనివారం ఉదయాన్నే పొలాల్లోని వర్షపు నీటితో తడిసిన ధాన్యాన్ని బయటకు తీసి ఆరబోశారు. ఆరబోసినప్పటికీ వాటిలో తేమ శాతం తగ్గలేదు.



నెల్లూరు జిల్లాలో శనివారం పొలంలో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు ట్రాక్టర్‌లో రోడ్డుపైకి తరలిస్తున్న రైతులు

తడిసిన ధాన్యం కొనుగోలుకు ఎవరూ ముందుకు రారని రైతులు వాపోతున్నారు. ధాన్యం బస్తాలు ఆరుబయటే నిల్వ చేసిన చోటా తడిసి ముద్దయ్యాయి. బస్తాల్లోని ధాన్యం ఆరబోసు కునేందుకు కూడా వీలులేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆత్మకూరు, ఉదయగిరి ప్రాంతాల్లో గోదాముల్లో ధాన్యం నిల్వచేశామని, కనీసం పట్టాలు కూడా ఇవ్వలేదని రైతులు వాపోతున్నారు. వ్యవసాయాధికారులు నష్టాన్ని అంచనా వేస్తున్నారు. సర్వేపల్లి టీడీపీ ఇన్‌చార్జి సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నియోజకవర్గంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటా మని తెలిపారు. శనివారం సాయంత్రం నుంచి వాతావరణం మేఘావృతమై ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మళ్లీ వర్షం కురిస్తే గింజ కూడా చేతికి రాదని వాపోతున్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. రంగుమారిన ధాన్యానికి గిట్టుబాటు ధర ఉండదని, నల్లగా మారిపోతే బియ్యం ఎరుపుగా ఉంటుందని, తక్కువ ధరకు కొనుగోలు చేస్తారని రైతులు తెలిపారు. ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

తడిసిన మిర్చి, కందులు



విశాలాంధ్రబ్యూరో - గుంటూరు : గుంటూరు జిల్లాలో రెండురోజులు కురుస్తున్న మోస్తరు వర్షంతో మిర్చి, కంది రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కల్లాల్లోని మిర్చి, కందులు పాడవకుండా టార్పాలిన్‌లు కప్పుకుని రక్షించుకునేందుకు నానాపాట్లు పడుతున్నారు. మాచర్ల, వెల్దుర్తి, వినుకొండ, వినుకొండ రూరల్ ప్రాంతాలలో జల్లులతో కూడిన వర్షం దెబ్బతీసింది. మాచర్ల యార్డులోని మిర్చి, కందులు తడిసిముద్దయ్యాయి. వినుకొండ యార్డులో కందులను కాపాడుకునేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. వేలాది రూపాయలు పెట్టుబడులతో పండించిన పంటలు చేతికొచ్చిన తరుణంలో అకాల వర్షం రావడంతో కంగుతిన్నారు. రెండేళ్ల క్రితం పంటలు చేతికొచ్చే తరుణంలో వర్షాలకు తీవ్రంగా నష్టపోయారు.

కల్లాల్లోనే మిర్చి మునిగిపోయింది



కాకినాడ : తూర్పు గోదావరి జిల్లా దేవీపట్నం, ఎటపాక, వేలేరుపాడు మండలాల్లో శనివారం కురిసిన అకాలవర్షంతో రైతులు తల్లడిల్లిపోయారు. శెనగ, మొక్కజొన్న, మిరప పంటలకు నష్టం వాటిల్లింది. ఎటపాక మండలంలో పొలాల్లో ఆరబోసిన మిరప పంట నీట మునిగింది. పంటలను రక్షించుకునేందుకు పరదాల కోసం ప్రయత్నించిన ప్రయోజనం కానరాలేదు. గత ఏడాది ధరలు లేక అప్పుల పాలైన రైతులను ఈ ఏడాది అకాల వర్షం నిండా ముంచిందని రైతులు వాపోతున్నారు.

'నేటి చదువులు'పై షార్ట్ ఫిల్మ్ పోటీలు



విశాలాంధ్ర - విజయవాడ (లబ్బీపేట) : సమాజంలో కొంతైనా మార్పు వస్తుందన్న ఉద్దేశంతో సోషల్ మీడియా ఫర్ సొసైటీ (ఎస్ఎంఎస్) ఆధ్వర్యంలో 'నేటి చదువులు' అనే అంశంపై షార్ట్ ఫిల్మ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ దర్శకుడు, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ తెలిపారు. సోషల్ మీడియా ఫర్ సొసైటీ (ఎస్ఎంఎస్) రెండో వార్షికోత్సవం పోస్టర్‌ను శనివారం విజయవాడలోని ఎంబీభవన్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భరద్వాజ మాట్లాడుతూ ఎస్ఎంఎస్ రెండో వార్షికోత్సవం మే నెలలో తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో నిర్వహించనున్నామన్నారు. నేటి విద్యా విధానంలో మార్పు రావాల్సిన అనివార్య పరిస్థితి ఉందన్నారు. విద్యార్థులకు ఒత్తిడిలేని చదువులు, స్వేచ్ఛ అవసరమన్నారు. ప్రస్తుతం సినిమాలు సమాజంలో మార్పునకు కారణమవుతున్నాయని, ఆ మార్పు అభివృద్ధికి తోడ్పడాలన్నారు. షార్ట్ ఫిల్మ్ దర్శకులు మంచి ఆలోచనలతో పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎస్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు విజయప్రకాష్ మాట్లాడుతూ ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా తమ్మారెడ్డి భరద్వాజ, పి.సునీల్‌కుమార్‌రెడ్డి, వి.ఎస్.ఆతిథ్య వ్యవహరిస్తారని తెలిపారు. 'ఈ క్షణం (EKSHANAM.COM)' వెబ్‌సైట్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని, ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు ఎంట్రీలను స్వీకరిస్తామని తెలుగు షార్ట్‌ఫిల్మ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తెలిపారు. మే 12న ఎంపిక చేయబడిన షార్ట్‌ఫిల్మ్ ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.20 వేలతోపాటు కేటగిరీల వారీ 5 ప్రత్యేక బహుమతులు అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9701387080, 9493276001, 8333013761 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. సమావేశంలో ఎస్ఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాసరావు, రాష్ట్ర కోశాధికారి సురేంద్ర, తెలుగు షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ నాయకులు ప్రేమ్, ఎస్ఎంఎస్ నాయకులు పవన్ పాల్గొన్నారు.

నాగార్జునకొండలో తైవాన్ దేశీయుల సందడి



విశాలాంధ్ర - విజయపురిసౌత్ : గుంటూరు జిల్లాలోని నాగార్జునసాగర్‌ను శనివారం 95 మందితో కూడిన తైవాన్ దేశీయుల బృందం సందర్శించింది. సాగర్ కొండపై మ్యూజియంలోని పురాతన శిలా ఫలకాలను, లోహపు పాత్రలు, బుద్ధుని కాలం నాటి పాలరాతి విగ్రహాలను ఆసక్తిగా తిలకించారు. మ్యూజియం గైడ్ బాబు చరిత్రను వివరించారు. నృత్య భంగిమలతో రాతిబండలపై చెక్కిన కళారూపాలను ఆసక్తిగా వీక్షించారు. అనంతరం పునర్నిర్మిత మహాస్తూపం, స్నానఘట్టం, అశ్వమేధ యజ్ఞశాలను చూశారు.

చెంచు గిరిజనుల అభివృద్ధికి కృషి



విశాలాంధ్ర - పెద్దదోర్నాల : నల్లమల అటవీ ప్రాంతంలోని చెంచు గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కారం శివాజీ తెలిపారు. ప్రకాశం జిల్లా పెద్దదోర్నాలలోని బొగ్గవరపు వారి కళ్యాణ మండపంలో శనివారం చెంచు గిరిజనుల సమస్యలపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ చెంచుల సమస్యలపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. అటవీఫలాలు చెంచు గిరిజనులకే చెందేలా అటవీశాఖ సిబ్బందితో చర్చిస్తానన్నారు. గిరిజన గూడాల్లో ఎంతమంది పిల్లలు, అక్షరాస్యత, గృహ నిర్మాణాలు, ఎంత బడ్జెట్ కేటాయించారని ఐటీడీఏ అధికారులను ప్రశ్నించినా సరైన సమాచారం ఇవ్వకపోవడంతో అధికారులపై మండిపడ్డారు. ఎన్ఆర్ఈజీఎస్ పనులు కూడా సక్రమంగా జరగడం లేదని చెంచులు ఆయన దృష్టికి తెచ్చారు. గిరిజన నాయకుడు అంజయ్య మాట్లాడుతూ గూడేల్లో గృహాలు శిథిలావస్థలో ఉన్నాయన్నారు. ప్రైవేటు వైద్యశాలల్లో చెంచు గిరిజనులు వైద్యం చేయించుకుంటే డబ్బు సక్రమంగా రావడం లేదని కమిషనర్ దృష్టికి తీసుకురావడంతో స్పందించిన శివాజీ రూ.30 వేలు పైన బిల్లులకు సీఎం రిలీఫ్‌ఫండ్ కింద వారికి మంజూరు చేయిస్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు, ఐటీడీఏ అధికారి రామశేషు, ఆర్డీవో పెంచల కిశోర్, డీఎస్పీ రామాంజనేయులు, డీటీడబ్ల్యు సింగయ్య, తహశీల్దారు రమణారావు, డాక్టర్ శ్రీనివాసరావు, చెంచుగిరిజనుల నాయకులు మంతయ్య పాల్గొన్నారు.

సమాజంలో న్యాయవాదుల పాత్ర కీలకం

విశాలాంధ్ర - బెలగాం : సమాజంలో న్యాయవాదుల పాత్ర ఎంతో కీలకమైనదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎన్ వీ రమణ అన్నారు. విజయనగరం జిల్లా పార్వతీపురంలో నూతనంగా నిర్మించిన కోర్టు భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజసేవలో న్యాయవాదుల పాత్ర ఎంతో కీలకమైనదని అన్నారు. కక్షిదారులకు కోర్టు భయాన్ని పోగొట్టేలా న్యాయవాదులు కృషిచేయాలన్నారు. పూర్తిస్థాయిలో న్యాయమూర్తుల నియామకం జరగకపోవడంతో తీర్పుల విషయంలో ఆలస్యం అయ్యే పరిస్థితి ఉందన్నారు. న్యాయవాదుల పరిపాలన తెలుగులో జరిగేలా కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి టి.రజని, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ సీహెచ్. మానవేంద్రనాథ్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాజిల్లాలో దంపతుల దారుణహత్య

విశాలాంధ్ర - గుడివాడ : కృష్ణాజిల్లా గుడివాడ పట్టణంలోని రాజేంద్రనగర్‌లో శనివారం తెల్ల వారుజామున రాజ్యలక్ష్మి రైస్‌మిల్ యజమాని బొప్పన సాయిచౌదరి (72), భార్య నాగమణి (67) దారుణహత్యకు గురయ్యారు. నిత్యం నిఘా నీడలో ఉండే ఈ ప్రాంతంలో ఈ జంటహత్యలతో పట్టణవాసులు ఉలిక్కిపడ్డారు. శనివారం ఉదయం ఇంట్లో పనిమనిషి వచ్చి చూడగా దంపతులు రక్తపుమడుగులో పడి ఉండటంతో స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ మహేష్ ఘటనాస్థలికి చేరుకున్నారు. జిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి హుటాహుటిన గుడివాడకు చేరుకున్నారు. క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్ ఘటనా స్థలిలో ప్రాథమిక ఆధారాలు సేకరించాయి. దోపిడీ దొంగల పనేనని, విభేదాల నేపథ్యంలో జరిగి ఉండవచ్చనే వాదనలు వినిపిస్తున్నాయి.

వాట్సప్‌లో టెన్త్ హిందీ పేపర్ హల్‌చల్

విశాలాంధ్ర - చిత్తూరు : పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో శనివారం హిందీ పేపర్ వాట్సప్‌లో హల్‌చల్ చేసింది. పరీక్ష ప్రారంభమైన అర్ధ గంటలోనే సెల్‌ఫోన్‌లో ప్రత్యక్షం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు గందర గోళానికి గురయ్యారు. ఈ ఘటనపై చిత్తూరుజిల్లా కలెక్టర్ ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారు. చిత్తూరు జిల్లాలోని పరీక్షా కేంద్రం నుంచి బయటకు వచ్చిందా, ఇతర ప్రాంతాల నుంచి బయటకొచ్చిందా అన్న అంశం పోలీసుల విచారణలో తేలనుంది. తొలుత విజయపురం మండలం నుంచి సెల్‌ఫోన్‌లో వచ్చినట్లు వదంతులు వ్యాపించాయి. ఈ దశలో డీఈవో పాండు రంగస్వామి జిల్లా ఎస్పీ రాజశేఖర్‌బాబుకు ఫిర్యాదు చేశారు. వదంతులు నమ్మవద్దని డీఈవో సూచించారు. విచారణలో నిజమని తేలితే దోషులను కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరినట్టు డీఈవో తెలిపారు.

ఇద్దరు ఇన్విజిలేటర్ల సస్పెన్షన్

ఏలూరు : పదవ తరగతి పబ్లిక్ పరీక్షల విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన ఇద్దరు ఇన్విజిలేటర్లను సస్పెండ్ చేసినట్లు పశ్చిమ గోదావరి జిల్లా డీఈఓ రేణుక తెలిపారు. హిందీ పరీక్షలో కాపీలు రాస్తూ పట్టుబడిన ముగ్గురు విద్యార్థులను డీబార్ చేసినట్టు ప్రకటించారు. జిల్లాలోని యర్న గూడెం జెడ్పీ హైస్కూలులో ఒకటి, ఎల్‌బీచర్ల సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో రెండు కేసులు నమోదు చేశామన్నారు.

'పోలవరం' సగం పూర్తయింది

రాష్ట్ర మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : బహుళా ర్ధ సాధక పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఇప్పటి వరకు 54.4 శాతం పనులు పూర్తయ్యాయని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం లా హాస్పిన్ హోటల్‌లో శనివారం ఆయన నేషనల్ వాటర్ కమిషన్, పోలవరం ప్రాజెక్టు ఎక్స్‌పర్ట్ కమిటీ, జిల్లా కలెక్టర్, జల వనరులశాఖ, రెవెన్యూశాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం ఉమా విలేకరు లతో మాట్లా డుతూ పోలవరం కుడి ప్రధాన కాలువ పనులు 91 శాతం, ఎడమ ప్రధాన కాలువ పనులు 59.6 శాతం, హెడ్ వర్క్స్ 41.2 శాతం పూర్తయ్యాయన్నారు. నూతన ల్యాండ్ ఎక్విజిషన్ యాక్ట్ ప్రకారం 18 సంవత్సరాల వయస్సు కలిగిన నిర్వాసితులకు కూడా సహాయం అందించడం కోసం ప్రాజెక్టు రివైజ్‌డ్ కాస్ట్ ప్రతిపాదనలను రూ.58 వేల కోట్లతో కేంద్ర ప్రభుత్వానికి పంపించి నట్లు వెల్లడించారు. కమిటీ చైర్మన్ ఎండీ మసూద్ హుస్సేన్, కమిటీ సభ్యులు ఆర్.కె.పచౌరి, అనిల్ జైన్, జి.యల్. భన్సాల్, చిత్రా రాజారత్నం, యస్.కె హాల్దార్, కె.కె ప్రధా న్, డి.రంగారెడ్డి, ఆర్.కె.గుప్తా, జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా పాల్గొన్నారు.

ఉల్లిని చేలోనే వదిలేస్తున్నారు

- మార్కెట్ మాయాజాలంలో ధర పతనం
- మహారాష్ట్ర దిగుమతులతో పెనుముప్పు
- కర్నూలు ఉల్లి రైతు కన్నీరు





విశాలాంధ్రబ్యూరో - కర్నూలు : మార్కెట్ మాయాజాలం ఉల్లి రైతును మరోసారి నిట్టనిలువునా ముంచింది. గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టాలపాల్జేసింది. ఆరుగాలం చమటోడ్చి ఉల్లిపాయలను పండించిన రైతు అప్పుల ఊబిలో చిక్కుకున్నారు. మార్కెట్‌కు తరలించినా రవాణా ఖర్చు కూడా రావడంలేదన్న ఆవేదనతో కొందరు పొలాల్లోనే పంటను పశువులకు వదిలేస్తున్నారు. ఇది కర్నూలు జిల్లాలో ఉల్లి రైతుల దయనీయస్థితి. ఈ ఏడాది రబీలో జిల్లావ్యాప్తంగా సుమారు 5 వేల హెక్టార్లలో ఉల్లి సాగు చేశారు. డోన్, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాలలో అత్యధికంగా పండిస్తున్నారు. డోన్ మండలంలోని చిన్న మల్కాపురం, గోసానిపల్లె, డోన్, కొచ్చెర్వు, గుమ్మకొండ, క్రిష్ణగిరి మండలంలోని కోయలకొండ, కంబాలపాడు, గుడెంపాడు, గోనెగండ్ల, మండలంలోని హెచ్ కైరవాడి, కలుముల, అల్వాల, వేమగోడు, పుట్టపాశం, తిమ్మాపురం, బైరుప్పల, గంజిహళ్ళి గ్రామాలతోపాటు నందవరం మండలాల్లో ప్రధాన పంటగా ఉంది. ఉల్లినారు దగ్గర నుంచి సేద్యం, మందులు, ఎరువులు ఇతర ఖర్చులు కలిపి ఎకరాకు సగటున రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో తొలి దశలో దిగుబడి వచ్చిన రైతులు క్వింటా ధర రూ.2 వేల నుంచి రూ.3 వేల చొప్పున విక్రయించి లాభాలు ఆర్జించారు. పంట మొత్తం రైతుల చేతికొచ్చిన తర్వాత వ్యాపారుల మాయాజాలం, మహారాష్ట్ర నుంచి పెద్దఎత్తున దిగుమతి కావడంతో ధర అమాంతంగా పడిపోయింది. ప్రస్తుతం క్వింటా ధర రూ.500 నుంచి రూ.600 మధ్య ఉండటంతో నష్టాల్లో చిక్కుకున్నారు. పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేకపోవడంతో అప్పులు తప్పవని వాపోతున్నారు. రవాణా ఖర్చు వచ్చే పరిస్థితి లేకపోవడంతో కొందరు పంటను పొలాల్లోనే పశువులు, గొర్రెలు, మేకలకు వదిలేస్తున్నారు. కనీసం క్వింటా రెండు వేల రూపాయల ధర పలికినా శ్రమ మిగులుతుందని రైతులు అంటున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఉల్లి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

పొలంలోనే 350 క్వింటాళ్లు

నందవరం రైతు మురళి ఎకరం పొలంలో ఉల్లి సాగు చేశారు. రూ.55 వేల వరకు పెట్టుబడి పెట్టాడు. మార్కెట్‌లో ప్రస్తుతం క్వింటా ధర రూ.550 నుంచి రూ.600 మధ్య ఉంది. ఏమి చేయాలో తెలియక 350 క్వింటాళ్ళ సరకును పొలంలోనే ఉంచేశాడు. ఫిబ్రవరిలో క్వింటా ధర రూ.1500 నుంచి రూ.3 వేలు ఉన్నప్పటికీ ఆకస్మికంగా పడిపోవడంతో నష్టపోకతప్పదని వాపోతున్నాడు.

పంటను చేలోనే వదిలేశాడు

గోనెగండ్ల గ్రామానికి చెందిన ఉల్లి రైతు కారుమంచి షేక్ అహ్మద్ పరిస్థితి మరింత దారుణం. గోనెగండ్లలో మూడు ఎకరాల్లో ఉల్లి సాగుచేశారు. ఎకరాకు రూ.60 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం మార్కెట్ ధరకు సరకు అమ్మితే పెట్టుబడులు కూడా రాని పరిస్థితి. పంట కోత కూలి, మార్కెట్ రవాణా ఖర్చులు చూస్తే గిట్టుబాటు కాదని భావించి పొలంలోనే పంటను గొర్రెలకు, మేకలకు వదిలేశాడు. ఇలాంటి రైతులు ఎంతోమంది కన్నీరు పెడుతున్నారు.

ప్రభుత్వం కొనుగోలుచేయాలి

ఉల్లి ధర క్వింటా రూ.550కు కొనుగోలు చేయడం చాలా అన్యాయం. కనీసం రూ. 2 వేలు అయినా ఉండాలి. కర్నూలు మార్కెట్‌లోని 20 మంది వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గిస్తున్నారు. వేసవిలో దిగుబడి తక్కువగా ఉన్నప్పటికీ ధర తగ్గించి రైతులను మోసగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వమే ఉల్లిని కొనుగోలు చేసి రైతుబజార్ల ద్వారా ప్రజలకు సరఫరా చేయాలి. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి. ప్రస్తుత ధరకు విక్రయిస్తే పెట్టుబడులు కూడా రాని పరిస్థితి.

కె. జగన్నాథం, జిల్లా కార్యదర్శి, ఏపీ రైతుసంఘం

ఉత్తరాంధ్రలో భారీగా
నకిలీ టీ పొడి స్వాధీనం

విశాలాంధ్రబ్యూరో - విజయనగరం : విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో విజిలెన్స్ అధికారులు శనివారం దాడుల్లో భారీగా నకిలీ టీపొడిని గుర్తించారు. రీజినల్ విజిలెన్సు అండ్ ఎన్ఫోర్సుమెంట్ అధికారులు ఉదయం శ్రీకాకుళం జిల్లా చిలకపాలెం వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఒక వాహనంలో 60 సంచులలో, సంచికి 30 కిలోల చొప్పున 1800 కిలోలు టీ పొడిని రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. 250 గ్రాములు, 100 గ్రా, 50 గ్రా, 25 గ్రాముల పాకెట్‌లను కనుగొన్నారు. ఈ టీపొడి శ్రీ ఆదిత్య టీ కంపెనీ, విజయనగరం నుండి శ్రీకాకుళం జిల్లాలోని వివిధ పట్టణాలకు తీసుకువెళ్తున్నట్లు తెలుసుకొన్నారు. టీపొడి నాణ్యతను పరిశీలించడానికి అవసరమైన పరీక్షల నిమిత్తం ఆహార భద్రతాధికారులకు పంపించారు. రీజినల్ విజిలెన్సు అండ్ ఎన్ఫోర్సుమెంట్ అధికారి టి.హరికృష్ణ విజయనగరం పట్టణంలోని శ్రీ ఆదిత్య టీ కంపెనీలో కూడా విస్తృతంగా తనిఖీ చేసేందుకు ఒక బృందాన్ని హుటాహుటిన పంపించారు. ఈ బృందం విజిలెన్స్ అధికారి ప్రసాదరావు ఆధ్వర్యంలో విజయనగరం ఫుడ్ సేఫ్టీ అధికారి కరిముల్లాతో కలసి శ్రీ ఆదిత్య టీ కంపెనీలో తనిఖీలు నిర్వహించారు. ఇక్కడ టీపొడిని ప్రాథమికంగా పరిశీలించగా, కృత్రిమ రంగులు కలిపినట్లు తేలింది. దీనివల్లే ఆ పాకెట్లపై తయారుచేసిన తేదీని ముద్రించలేదని అనుమానిస్తున్నారు. టీపొడి నమూనాలను లేబొరేటరీ పరీక్ష నిమిత్తం, హైదరాబాద్‌లోని స్టేట్ లేబొరేటరీకి పంపించాలని నిర్ణయించారు. ఈ తనిఖీలో సుమారు రూ. 7,45,200 విలువైన 4140 కేజీల టీ పౌడర్ పాకెట్‌లను స్వాధీనం చేసుకున్నారు.

నేడు తేలికపాటి జల్లులు

• సోమవారం నుంచి ఎండలే • రాయలసీమ, ప్రకాశంలో నమోదైన భారీ వర్షాలు

విశాలాంధ్ర-విశాఖపట్నం : ఆగ్నేయ అరేబియా సముద్రంలో కర్ణాటక తీరానికి అనుకుని 1.5 కి.మీ ఎత్తులో ఉపరితల ఆవర్తనం, ఆగ్నేయ బంగాళాఖాతంలో భూ మధ్య రేఖా ప్రాంతంలో అల్పపీడన ద్రోణి కొనసాగుతున్నట్లు భారత వాతావరణ శాఖ పేర్కొంది. మరో వైపు ఉత్తర భారతదేశంలో పశ్చిమ అటంకాలు ఏర్పడ్డాయని, బంగాళాఖాతంలోని ద్రోణి ఆంధ్రప్రదేశ్‌కు దిగువ భాగాన ఉండటంతో దాని ప్రభావం రాష్ట్రంపై లేదని విశాఖ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కర్ణాటక తీరంలోని ఆవర్తనం ప్రభావంతోనే కోస్తా, రాయలసీమల్లో తేమ గాలులు రావడంతో మేఘాలు ఏర్పడి వర్షాలు కురిసినట్లు చెప్పారు. తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా మేఘాలు ఏర్పడినట్లు వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. శనివారం పశ్చిమ గోదావరి, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా ఉరుములుతో కూడిన ఓ మోస్తరు నుంచి తేలికపాటి జల్లులు పడినట్లు వివరించారు. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు కోస్తాలోని నెల్లూరు, ప్రకాశం, పశ్చిమ గోదావరి, రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో పలు చోట్ల భారీ నుంచి ఓ మోస్తరు వర్షాలు నమోదయ్యాయి. ఆదివారం కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా ఉరుములతో కూడిన తేలికపాటి జల్లులు కురుస్తాయని, ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లగా ఉంటుందని తెలిపారు. సోమవారం నుంచి పొడి వాతావరణం నెలకొంటుందన్నారు.

కలుషిత నీటి నివారణకు పటిష్ట చర్యలు : నారాయణ



విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్ : నగరంలోని ఆనందపేట, సంగడిగుంట తదితర ప్రాంతాలలో కలు షిత త్రాగునీటి వలన ఏర్పడిన పరిస్థితిపై జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి పటిష్టమైన నివారణ చర్యలు తీసుకున్నదని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ పేర్కొన్నారు. శనివారం స్థానిక బీఆర్ స్టేడియం వద్ద ఉన్న వాటర్ ట్యాంకులను రాష్ట్ర మంత్రు లు నారాయణ, పి. పుల్లారావు, నక్కా ఆనంద్ బాబు పరిశీలించి త్రాగునీరు, వాటర్ క్లోరినేషన్ తదితర ఏర్పా ట్లపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అనంతరం నారాయణ మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో పటిష్ట మైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని 110 మున్సిపాలిటీలలో పాత పైప్‌లైన్ల స్థానంలో కొత్త పైపులైన్ల నిర్మాణాలు చేపట్టి ప్రజలందరికీ 24 గంటలు త్రాగునీటి సరఫరాకు ప్రణాళికలు రూపొం దిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రూ.2700 కోట్ల రూపాయలతో అమృత పథకం కింద ఈ కార్య క్రమాన్ని చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుం టున్నట్లు నారాయణ వివరించారు. ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ గుంటూరులోని 6 వార్డులలో త్రాగునీరు కలుషితం కావ డంతో అనారోగ్యానికి గురై 8 మంది చనిపోయారని, ప్రభావిత ప్రాంతాలలో ఇప్పటికీ వైద్య శిబిరాలను నిర్వ హిస్తూ అన్ని నివారణ చర్యలు పటిష్టంగా అమలు చేస్తు న్నట్లు తెలిపారు. నక్కా ఆనంద్ బాబు మాట్లాడుతూ ఈ ఘటన వలన అనారోగ్యానికి గురైన వారికి మెరుగైన వైద్య సేవలందించడంతో పాటు ఆయా ప్రాంతాలలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్య క్రమంలో పుర పాలక సంచాలకులు కన్నబాబు, నగర కమిషనర్ చల్లా అనురాధ, పురపాలక శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజనీర్ల వైఫల్యమే

• తక్షణమే మున్సిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి
• గుంటూరు ధర్నాలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల



విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్ : మున్సిపల్ ఇంజనీర్ల పూర్తి వైఫల్యం కారణంగానే గుంటూరు నగరంలో డయేరియా సోకి ఇప్పటికి 24 మంది చనిపోయారని, ఇందుకు బాధ్యతగా నగర కమిషనర్ చల్లా అనురాధను తక్షణమే సస్పెండ్ చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండు చేశారు. గుంటూరులో కలుషిత నీరుకు కారణమైన బాధ్యులను సస్పెండ్ చేయాలని కోరుతూ సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట శనివారం శవయాత్ర నిర్వహించి ధర్నా చేపట్టారు. "మున్సిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి, పురపాలక శాఖ మంత్రి నారాయణ మంత్రి పదవికి రాజీనామా చేయాలి, ప్రజల చావుకు కారణమైన మున్సిపల్ అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలి" అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మున్సిపల్ కార్యాలయంలోకి చొచ్చుకొనిపోయేందుకు ప్రయత్నించగా మున్సిపల్ సిబ్బంది పోలీసుల సహకారంతో గేట్లకు తాళాలు వేసి, కార్యకర్తలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ మంచినీటిలో మురుగునీరు కలుషితం కావడం వలన నగర ప్రజలు భయభ్రాంతులకు గురౌతున్నారన్నారు. అధికారులు సకాలంలో చర్యలు తీసుకోనందునే ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పటల్స్‌లో ఇప్పటికి డయేరియాతో 24 మంది చనిపోయారని చెప్పారు. డయేరియాకు కారణమైన ఉన్నతాధికారుల మీద చర్యలు తీసుకోవాలని, గుంటూరు నగరంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని ఆయన డిమాండు చేశారు. డయేరియా బాధితులకు ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి న్యాయం చేయాలని, లేనిపక్షంలో సోమవారం నుంచి ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఘటనకు నైతికబాధ్యత వహించి మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తన పదవికి రాజీనామా చేయాలని కోరారు. ఇప్పటికీ కొన్ని ప్రాంతాలలో కలుషిత నీరు సరఫరా అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. డయేరియా బాధితులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి మాట్లాడుతూ డయేరియా బాధితులకు నామమాత్రంగానే చెక్కులు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. గుంటూరు నగరంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండే విధంగా శాశ్వతమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యవర్గ సభ్యులు నూతలపాటి వెంకటేశ్వరరావు, సురేష్‌బాబు, అమీర్‌వలి, కుమార్ నాయక్, గుమ్మా పాపారావు, అలివేలు మంగమ్మ, ఏఐటీయూసీ నగర కార్యదర్శి అరుణ్‌కుమార్, అధ్యక్షులు అంజిబాబు, మహిళా సమాఖ్య అధ్యక్షులు అత్తమ్మ, కార్యదర్శి శివమ్మ, వీధి విక్రయదారుల నగర కార్యదర్శి డి.వెంకటరత్నం, వైఎఫ్ జిల్లా కార్యదర్శి సాగర్, నగర అధ్యక్షులు మరియదాసు, కార్యదర్శి వేమూరి సుబ్బారావు, నగర కౌన్సిల్ సభ్యులు వలి, నవీన్, నాగేశ్వరరావు, గోగినేని వెంకటరావు, సింగయ్య, సుబ్బారెడ్డి, గిరి, శ్రీను, బోసు, ఇన్సాఫ్ నగర కార్యదర్శి ఎం.డి జైద్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అవిశ్వాసానికి మద్దతివ్వండి

కేసీఆర్‌ను కోరిన కె.రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా, విభజన చట్టంలోని అంశాల అమలు కోసం డిమాండ్ చేస్తూ పార్లమెంటులో ప్రవేశపెడుతున్న అవిశ్వాస తీర్మానానికి మద్దతివ్వాలని టీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌ను సీపీఐ ఏపీ కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. రాజ్యసభలో టీఆర్‌ఎస్ పక్ష నేత కె.కేశవరావు ఇప్పటికే మద్దతు ప్రకటించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందని ప్రకటించిన ముఖ్యమంత్రి అవిశ్వాస తీర్మానానికి బాసటగా నిలిచి తమ చిత్తశుద్ధిని నిలుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. శనివారం సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో పార్టీ ఏపీ కార్యదర్శివర్గ సభ్యుడు రావుల వెంకయ్యతో కలిసి రామకృష్ణ మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం అంతిమపోరాటం సాగించేందుకు ఈనెల 19న విజయవాడలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని, దీనికి టీడీపీ, బీజేపీ తప్ప అన్ని రాజకీయ పార్టీలు, మేధావులు, ప్రజాసంఘాలు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులతో పాటు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కూడా పాల్గొంటారన్నారు. ఆంధ్రప్రదేశ్ అంశం జాతీయ సమస్యగా మారి, పార్లమెంటునే కుదిపేస్తుందని, అవిశ్వాస తీర్మానానికి జాతీయ, ప్రాంతీయ పార్టీలు సైతం మద్దతు పలికాయని రామకృష్ణ తెలిపారు. కేంద్రమంత్రులు అవాస్తవ ప్రకటనలు చేస్తున్నారన్నారు. ఐదేళ్ల ప్రత్యేక హోదా ఇస్తామని నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రకటించారని, దానిని అమలు చేయకుండా ప్రధాని నరేంద్రమోడీ ఆంధ్రప్రదేశ్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్యాకేజీ ఇస్తామన్నా తీసుకునేవారు లేరని అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. 2014లో రూ.16 వేల లోటు బడ్జెట్‌ను ఇవ్వాలని కోరితే ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. వివిధ పద్దుల కింద ఏపీకి రావాల్సిన రూ.74వేల కోట్లను కేంద్రం తక్షణమే ఇవ్వాలని, ఇచ్చేవరకు పోరాటం సాగిస్తామని రామకృష్ణ వెల్లడించారు. ఈనెల 27న జరిగే సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో అనేక అంశాలపై కార్యాచరణ ఖరారు చేస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక న్యాయాన్ని తుంగలో తొక్కారని, 11 మంది పార్లమెంటు సభ్యులు అగ్రవర్ణాల వారే ఉన్నారన్నారు. ఇటీవల తెలంగాణ రాజ్యసభకు ఇద్దరు బీసీలను కేసీఆర్ ఎంపిక చేశారని గుర్తుచేశారు. ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టేందుకు ప్రత్యేక వేదికను ఏర్పాటు చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీతో చేతులు కలిపినవారిని బంగాళాఖాతంలో కలుపుతామని రామకృష్ణ అన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని వెంకయ్యనాయుడు కేంద్రానికి సూచించాలని, లేకపోతే రాజీనామా చేయాలని ఆయన డిమాండు చేశారు. బీజేపీకి చెందిన ఇద్దరు ఎంపీలు, నలుగు ఎమ్మెల్యేలు దమ్ముంటే రాజీనామా చేయాలని సవాల్ చేశారు. తిరిగి గెలిస్తే బీజేపీ గురించి తాము ఒక్క మాట కూడా మాట్లాడమని ఆయనన్నారు.

డయేరియాపై న్యాయ విచారణ చేయాలి

మధు డిమాండు



విశాలాంధ్రబ్యూరో-గుంటూరు : గుంటూరులో తీవ్ర స్థాయిలో ప్రబలిన డయేరియాపై ప్రభుత్వం వెంటనే ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు డిమాండు చేశారు. డయేరియా తీవ్రత వల్ల మరణించిన వారి కుటుంబ సభ్యులను, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను ఆయన శనివారం పరామర్శించారు. అనంతరం గుంటూరు జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ గుంటూరులో నీటి కాలుష్యంతో ఇప్పటి వరకూ 25 మంది చనిపోయారని, ప్రభుత్వం వాస్తవాలను దాచిపెడుతూ, మృతుల వివరాలు, వ్యాధి గ్రస్తుల సంఖ్యను తగ్గించిచూపే ప్రయత్నం చేస్తున్నదన్నారు. డయేరియా వ్యాప్తికి గల మూలాలను గుర్తించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులపై ఒత్తిడి చేసి డయేరియాతో చనిపోయిన వారిని గుండెపోటు, కిడ్నీ సంబంధ సమస్యలతో మృతి చెందినట్టు నమోదు చేయిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్యానికి నిరసనగా ఆదివారం గుంటూరులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 48 గంటల్లోగా శాశ్వత పరిష్కారం చూపాలని, లేకుంటే గుంటూరు బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. పదో తరగతి పరీక్షలు జరుగుతున్నందున ఎలాంటి ఆందోళన నిర్వహించాలన్న అంశంపై ఆదివారం తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. డయేరియా నియంత్రణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సరిగా లేవన్నారు. పరిస్థితి చేయిదాటిపోతున్నా ప్రభుత్వం సీరియస్‌గా స్పందించడం లేదన్నారు. విలేకరుల సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.కృష్ణయ్య, సీపీఎం తూర్పు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సీపీఎం నగర కార్యదర్శి నళినీకాంత్ పాల్గొన్నారు.

నేడు ఉద్దండరాయునిపాలెంలో పవన్ పర్యటన

విశాలాంధ్ర-అమరావతి: నవ్యాంధ్ర రాజధానిలోని ఉద్దండరాయుని పాలెంలో జనసేన అధిపతి పవన్ కల్యాణ్ ఉగాదిన పర్యటించనున్నారు. గ్రామంలోని లంక భూముల ఎస్సీ రైతులు విజయవాడలోని జనసేన పార్టీ తాత్కాలిక కార్యాలయంలో పవన్‌కళ్యాణ్‌ను శనివారం కలిశారు. రాజధాని భూ సేకరణలో ప్రభుత్వం తీసుకున్న భూములకి పరిహారం చెల్లించే విషయంలో తమకు జరుగుతున్న అన్యాయాన్ని ఆయన ముందుంచారు. ఉగాదిన గ్రామానికి రావాలని పవన్‌ను ఆహ్వానించారు. అందుకు సుముఖత వ్యక్తం చేసిన జనసేన అధినేత ఆదివారం ఉదయం 10 గంటలకు ఉద్దండరాయుయునిపాలెం సందర్శిస్తానని వారికి తెలిపారు.

టీడీపీ అవిశ్వాసానికి అనూహ్య స్పందన

• ఓటింగ్ కోసం పట్టుబట్టండి
• ఎంపీలకు సీఎం చంద్రబాబు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి జాతీయ స్థాయిలో అనూహ్య స్పందన లభిస్తోందని సీఎం చంద్రబాబు తెలిపారు. కేంద్రంపై టీడీపీ అవిశ్వాస తీర్మానం పెట్టాలని నిర్ణయించిన గంటలోనే అనేక రాజకీయ పార్టీల నుండి సానుకూల స్పందన రావటం జాతీయస్థాయిలో తెలుగుదేశం విశ్వసనీయతకు నిదర్శనమని చంద్రబాబు అన్నారు. టీడీపీ ఎంపీలతో ముఖ్యమంత్రి శనివారం ఉదయం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, అసెంబ్లీ వ్యూహ కమిటీ ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. ప్రధానమంత్రి కార్యాలయం చుట్టూ ఏ2 విజయసాయిరెడ్డి చక్కర్లు కొడుతుండడంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అవిశ్వాసం పెడతామని ముందుగానే చెప్పినా ఎవ్వరూ నమ్మలేదన్నారు. కేసుల మాఫీ కోసమే విజయసాయి రెడ్డి పీఎంవో చుట్టూ తిరుగుతూ కేంద్ర పెద్దలకు పాదాభివందనాలు, ప్రదక్షిణలు చేస్తున్నారని ఆరోపించారు. జగన్ కేసులకు సడలింపులు ఎందుకు వస్తున్నాయో కేంద్ర పెద్దలు చెప్పాలని చంద్రబాబు ప్రశ్నించారు. జగన్ అనుచరులు పీఎంవోలోనే ఉంటున్నారని, దానికి ప్రతిగానే కేసులలో సడలింపులని ఎంపీలతో అన్నారు. రేపోమాపో జగన్ కేసులు కొట్టివేస్తారనే ప్రచారం జరుగుతోందని చంద్రబాబు చెప్పారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, తగిన గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు. టీడీపీ అవిశ్వాసానికి దేశవ్యాప్తంగా అనేక పార్టీలు మద్దతు ఇస్తున్నందున ఓటింగ్‌కు గట్టిగా పట్టుబట్టాలని, డివిజన్‌కు డిమాండు చేయాలని ఎంపీలకు సీఎం దిశానిర్దేశం చేశారు. సెలవులు అయినప్పటికీ ఆరుగురు సభ్యుల ఎంపీల బృందం ఈ రెండు రోజులు ఢిల్లీలోనే ఉండాలని ఆదేశించారు. అన్ని పార్టీల నేతలను వ్యక్తిగతంగా కలిసి, అవిశ్వాసానికి మద్దతు కూడగట్టాలన్నారు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నామని చెప్పిన చంద్రబాబు, మూడు పార్టీల మహా కుట్రను ప్రజల్లో బయటపెట్టామని చెప్పారు. జగన్, పవన్ కేంద్రాన్ని ప్రశ్నించకుండా తనను విమర్శించటమేమిటని చంద్రబాబు మండిపడ్డారు. ఈ సమయంలో తనను బలహీనపరిచే ప్రయత్నం చేసి ఎవరికి లాభం చేకూరుస్తున్నారని ప్రశ్నించారు. దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపే చూస్తోందని, జాతీయ స్థాయిలో ఏపీ ప్రజల గొంతు వినిపించామని, ఇకపై కూడా మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. మనకు కావాల్సింది రాజకీయం కాదని, రాష్ట్రానికి న్యాయం జరగడమే లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు.

టీడీపీ హయాంలో రైతులకు అన్యాయం : జగన్



విశాలాంధ్ర-కాకుమాను : రాష్ట్రంలోని రైతులను తెలుగుదేశం ప్రభుత్వం మోసం చేస్తుందని వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ప్రజా సంకల్ప యాత్ర శనివారం ప్రత్తిపాడు నియోజకవర్గంలో కాకుమాను మండల పరిధిలోని తెలగాయపాలెం గ్రామం నుంచి మొదలైంది. ఈ సందర్భంగా జగన్‌కు పార్టీ శ్రేణులు, మహిళలు, అభిమానులు మేళతాళాలతో పూలతో ఘనంగా స్వాగతం పలికారు. తెలగాయపాలెం నుంచి గరికపాడు, బి.కె.పాలెం గ్రామాల మీదుగా కాకుమాను సమీపానికి యాత్రలో స్థానిక ప్రజల సమస్యలు వింటూ అందరిని ఆప్యాయంగా పలకరించుకుంటూ సాగించారు. కాకుమాను సమీపంలో ఏర్పాటు చేసిన రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి రాగానే ప్రతి ఏడాది మే నెలలో ప్రతి రైతుకు రూ.12,500 వ్యవసాయ పెట్టుబడుల కింద అందిస్తామని, ధరల స్థిరీకరణకు ప్రతి ఏడాది రూ.3 వేల కోట్లు కేటాయించనున్నట్లు హామీ ఇచ్చారు. పాడి పరిశ్రమను అభివృద్ధికి పాల ఉత్పత్తిదారులకు ప్రతి లీటరు పాలకు రూ.4 ఇన్సెంటివ్స్ ఇచ్చి పాడి పరిశ్రమను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వలన ఏర్పడే నష్టనివారణకు రైతులకు రూ.4 వేల కోట్లు కేటాయిస్తామని, ప్రమాదవశాత్తు మరణించిన రైతు కుటుంబాలకు భరోసాగా వైఎస్సార్ బీమా ఏర్పాటు చేసి వారి కుటుంబానికి రూ.5 లక్షలు నేరుగా అందిస్తామని తెలిపారు. నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్, గుంటూరు చానెల్‌ను పొడిగింపు కోసం తాము చేస్తున్న పోరాటానికి మద్దతు తెలిపాలని జగన్‌ను కోరగా సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు అంబటి రాంబాబు, రావి వెంకటరమణ, మాజీ ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, లావు శ్రీకృష్ణదేవరాయలు, ఆళ్ళ రామకృష్ణారెడ్డి, బాలశౌరి, రామకృష్ణ పాల్గొన్నారు.

కంభంపాటికి కేంద్రమంత్రి పదవి?

బీజేపీ నేతల భేటీలో ప్రశాంత్‌కిషోర్



న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ తెలుగు దేశం పార్టీ ఎన్డీఏ నుంచి బయటికి రావడం, కేంద్ర మంత్రి పదవులకు సుజనాచౌదరి, అశోక్‌గజపతిరాజు రాజీనామా చేయడంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబుకు కేంద్రమంత్రివర్గంలో స్థానం కల్పించే అవకాశం లభించింది. వాస్తవంగా గతంలోనే హరిబాబుకు మంత్రి పదవి లభిస్తుందని పార్టీ శ్రేణులు భావించాయి. వివిధ కారణాల వల్ల అది సాధ్యం కాలేదు. టీడీపీ ఎంపీలు కేంద్రమంత్రి వర్గం నుంచి వైదొలగడం హరిబాబుకు కలిసొచ్చింది. శనివారం సాయంత్రం ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆ నేతలు సమావేశమయ్యారు. హరిబాబును కేంద్రమంత్రి వర్గంలోకి తీసుకుంటే రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు ఎవరికి అప్పగించాలనే దానిపై కసరత్తు జరిగినట్లు సమాచారం. సోము వీర్రాజు, ఆకుల సత్యనారాయణ, విష్ణుకుమార్ రాజులలో ఒకరికి అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఏ సామాజిక వర్గానికి చెందిన నేతకు అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తే పార్టీకి మేలు జరుగుతుందనే అంశాన్ని నిశితంగా పరిశీలిస్తున్నారు. బీజేపీ నేతల భేటీకి ఏపీలో వైసీపీ వ్యూహకర్త ప్రశాంత్‌కిషోర్ హాజరుకావడం రాజకీయవర్గాల్లో సంచలనంగా మారింది. ప్రశాంత్ కిషోర్ ఏడాదిన్నరగా ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై అధ్యయనం చేస్తున్నందున ఆయన సలహాలను అమిత్ షా పరిగణనలోకి తీసుకుంటున్నారు. ప్రశాంత్ కిషోర్ జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యూహకర్తగా ఉన్నారు. ప్రశాంత్ కిషోర్ కేంద్రంలో బీజేపీకి, రాష్ట్రంలో వైసీపీకి వ్యూహకర్తగా పనిచేయడంపై రాజకీయవర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. బీజేపీ, టీడీపీలకు మద్దతిచ్చిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ గతంలో కాకినాడ సభలో కాషాయపార్టీపై విమర్శలు గుప్పించడం, తాజాగా మంగళగిరిలో జరిగిన జనసేన ఆవిర్భావ సభలో టీడీపీపై అవినీతి ఆరోపణలు చేయడం వంటి అంశాలపై బీజేపీ నేతలు సుదీర్ఘంగా చర్చించారు. పవన్ కల్యాణ్ రాజకీయ వైఖరి ఏమిటి, రాష్ట్రంలో ఎలాంటి వ్యూహం అనుసరించాలనే దానిపై చర్చించారు. ప్రత్యేక హోదాపై టీడీపీ చేస్తున్న ఆరోపణలు తిప్పికొట్టాలని, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన సాయాన్ని రాష్ట్ర ప్రజలకు వివరించాలని బీజేపీ నేతలు నిర్ణయించారు. హోదాతో వచ్చే సాయాన్ని ప్యాకేజీ ద్వారా ఇస్తామని చెప్పిన మాటకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నామని రాష్ట్ర ప్రజలకు వివరించనున్నారు.

ఎదుగుదల కోసమే బీజేపీపై విమర్శలు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్రంలోని టీడీపీ, వైసీపీ తమ ఎదుగుదల కోసమే బీజేపీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమ్ముల శ్యామ్ కిశోర్ విమర్శించారు. ఆ రెండు పార్టీలకు అభివృద్ధి, ప్రజా ప్రయోజనాలకన్నా, స్వప్రయోజనాలే ముఖ్యమన్నారు. విజయవాడ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్యామ్ కిశోర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో సమస్యలను పరిష్కరించలేక, అవినీతికి గురైన టీడీపీ ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందని, వైసీపీ ఒత్తిడితో ప్రత్యేక హోదా కోసం డిమాండు చేస్తోందని విమర్శించారు. ఏపీ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని, విభజన చట్టంలోని పేర్కొన్న సంస్థలను పదేళ్లలో ఏర్పాటు చేయాలని ఉన్నప్పటికీ, మూడున్నర సంవత్సరాల్లోనే 85 శాతం సంస్థలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విశాఖ రైల్వేజోన్, కడప స్టీల్ ప్లాంట్‌కు సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు. 2014-15 ఆర్థిక సంవత్సరానికి రెవెన్యూ లోటు రూ.1,600 కోట్లను ఇచ్చేందుకు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ సంసిద్ధతను వ్యక్తం చేసినా, రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రాకపోవటం శోచనీయమన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ వెనుక బీజేపీ హస్తం ఉందంటూ టీడీపీ విమర్శించటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఎన్డీఏ నుంచి టీడీపీ వైదొలిగిన నేపథ్యంలో రాష్ట్రంలో బలపడేందుకు వ్యూహాన్ని అమలు చేస్తామని శ్యామ్ కిషోర్ వెల్లడించారు.

విభిన్న ప్రతిభావంతులకు అందని వాహనాలు

• కొంతకాలంగా ఆటంకాలు • మొదటికొచ్చిన టెండర్ల ప్రక్రియ • అర్హతల సడలింపు

విశాలాంధ్ర-అమరావతి : విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అందించాలనుకున్న సహకారానికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. మూడు చక్రాల సైకిల్‌కి సెలవిచ్చి మోటారు వాహనాలపై ప్రయాణించవచ్చు అనుకున్న వారి కలలకి ఏదో రూపంలో ఇబ్బందులు అడ్డుగా నిలుస్తున్నాయి. ఇటీవల చంద్రబాబు సర్కార్ విభిన్న ప్రతిభావంతుల కోసం వారికి ఊతమిచ్చేలా మోటారు వాహనాలు అందించాలని నిర్ణయించింది. అందులో భాగంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు అర్హులైన విభిన్న ప్రతిభావంతులకి మోటారు వాహనాలు ఇస్తామని ప్రకటించారు. ప్రభుత్వం ప్రత్యేక పథకం ద్వారా మోటారుతో నడిచే ద్విచక్ర వాహనాలను ఇచ్చే ప్రక్రియకు సంబంధించిన ప్రణాళిక సిద్ధం చేయాలని శాఖ అధికారులను ఆదేశించింది. కాగా రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల కార్పొరేషన్ అధికారులు అర్హులను దరఖాస్తులు చేసుకోవాలని ప్రకటన విడుదల చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నా ఇక్కడే అసలు ఇక్కట్లు మొదలయ్యాయి.

నిధులున్నా నత్త నడకనే..

మోటారుతో నడిచే ద్విచక్ర వాహనాలు అందించేందుకు ప్రభుత్వం రూ.14 కోట్ల రూపాయలు కేటాయించింది. విభిన్న ప్రతిభావంతులైన వారికి ఈ నిధులు వినియోగించాలని సూచించింది. అయితే నిధులు ఉన్నా సంకల్పం మాత్రం సక్రమంగా నెరవేరే పరిస్థితి కనిపించడం లేదు. మోటారు వాహనాలు అందించే అంశమై టెండర్ ప్రకటించగా ఓ ప్రముఖ కంపెనీ ముందుకొచ్చి టెండర్ దక్కించుకుంది. పలువురు పోటీ పడినప్పటికీ అందుబాటు ధరలో ఇచ్చేందుకు ముందుకొచ్చిన సదరు కంపెనీకి అప్పగించాలని నిర్ణయించారు. ఇంతలోనే టెండర్‌లో పాల్గొన్న మరో కంపెనీ టెండర్ ప్రక్రియ అవకతవకలుగా ఉందని ఫిర్యాదు చేయటంతో కథ మళ్ళీ మొదటికి వచ్చింది. దీంతో టెండర్లు మరోసారి పిలవాలని సర్కార్ ఆదేశించింది. అయితే ముందుగా ఎంపికైన కంపెనీ రూ.60 వేల వంతున వాహనాలు సరఫరా చేసేందుకు ముందుకు రాగా, మరో ద్విచక్ర వాహన కంపెనీ రూ.55 వేలకే అందిస్తామని ముందుకు వచ్చి ప్రభుత్వానికి వినతి చేసుకుంది. సమాలోచనలు చేసిన సర్కార్ ఈ క్రమంలో మరోసారి టెండర్లు పిలిచేందుకు సమాయత్తమైంది.

భారీగా దరఖాస్తులు

ప్రభుత్వం రాయితీతో ఇచ్చే మోటారు ద్విచక్ర వాహనాల కోసం రాష్ట్ర వ్యాప్తంగా మూడువేలకు పైబడి విభిన్న ప్రతిభావంతులు భారీగా దరఖాస్తు చేసుకున్నారు. అయితే 2,500 మందికి వాహనాలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దరఖాస్తులు మాత్రం మూడు వేల వరకు రావడంతో పూర్తిస్థాయిలో అర్హులైన వారిని ఎంపిక చేయాలని రాష్ట్ర స్త్రీ, శిశు, విభిన్న ప్రతిభావంతుల వయో వృద్ధుల సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించింది. అర్హులకు ఏదో రూపంలో ఆటంకాలు ఎదురవుతూ ఉండటంతో తీవ్ర నిరాశ చెందుతున్నారు.

నిబంధనలతో ఇబ్బందులు

మోటారు ద్విచక్ర వాహనాలను పొందేందుకు ప్రభుత్వం కొన్ని నిబంధనలు విధించింది. పీజీ కోర్సులు చేస్తున్న వారు, స్వయం ఉపాధి పొందుతున్న వారు మాత్రమే రాయితీతో కూడిన మోటారు ద్విచక్ర వాహనాలు పొందేందుకు అర్హులు అంటూ షరతులు పెట్టింది. చాలామంది ఆశవాహులు ప్రభుత్వం విధించిన అర్హతలు లేనివారు కావటంతో ద్విచక్ర వాహనాలు పొందే అవకాశం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో చాలా మంది విభిన్న ప్రతిభావంతులు పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారిని అర్హులుగా ఎంపిక చేయాలని కోరుతు వినతులు అందించారు. ఈక్రమంలో స్పందించిన సర్కార్ పదో తరగతి అర్హతగా నిర్ణయం తీసుకున్నారు. దీంతో నిబంధనలు ఇబ్బందులు నుంచి కొంత మేర ఉపశమనం లభించింది. అయితే ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ మరోసారి ప్రారంభం కావాల్సి ఉండటంతో ఈ అంశం సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

త్వరలోనే వాహనాలు అందిస్తాం

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం చైర్మన్ కోటేశ్వరరావు

ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులకు అందిస్తున్న మోటారు ద్విచక్ర వాహనాలు పూర్తిగా వంద శాతం సబ్సిడీతో అందిస్తున్నాం. త్వరలోనే అర్హులైన ప్రతి ఒక్కరికి వాహనాలు ఇస్తారు. మొదట్లో నిబంధనలు విధించడం జరిగినప్పటికీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లటంతో ఆయన సానుకూలంగా స్పందించారు. పీజీ అర్హతను పదో తరగతిగా మార్పు చేశారు. నాణ్యతతో కూడిన వాహనాలు ఇవాలన్నదే సీఎం లక్ష్యం. రానున్న కాలంలో ఈ అర్హతల నిబంధన లేకుండా అర్హులైన వారందరికీ మోటారు ద్విచక్ర వాహనం అందించేందుకు కృషి చేస్తాం.

'కోహ్లి జోకర్‌లా ప్రవర్తించాడు'

దర్బన్: తమతో జరిగిన ద్వైపాక్షిక సిరీస్‌లో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి ఓ జోకర్‌లా వ్యవహరించాడని దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు పాల్ హారిస్ ఘాటు వ్యాఖ్యలు చేశాడు. కొన్ని రోజులు క్రితం ఆసీస్ కెప్టెన్ స్టీవ్ స్మిత్, దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబడాల మధ్య వివాదం చోటు చేసుకున్న నేపథ్యంలో మధ్యలోకి కోహ్లిని లాగాడు హారిస్. ఆ సిరీస్‌లో కోహ్లి చిల్లరగా, జోకర్‌లా ప్రవర్తించినా అతనిపై ఐసీసీ ఎందుకు చర్యలు తీసుకోలేదన్నాడు. 'దక్షిణాఫ్రికాతో ఆడిన మూడు టెస్టుల్లోనూ కోహ్లిని చాలా దగ్గరగా గమనించా. అతను చాలా చిల్లరగా, జోకర్‌లా ప్రవర్తించాడు. కానీ అతనిపై ఐసీసీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. రబడాతో ఐసీసీకి ఏదో ఇబ్బంది ఉందేమో. కాకపోతే మా జట్టు దక్షిణాఫ్రికాతోనైనా ఏదైనా సమస్య ఉండవచ్చు' అని హారిస్ ట్వీట్ చేశాడు. ఇటీవల దక్షిణాఫ్రికా-ఆసీస్ జట్ల మధ్య జరిగిన రెండో టెస్టు మ్యాచ్‌లో స్మిత్-రబడాల మధ్య వివాదం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. స్మిత్ అవుటై పెవిలియన్‌కు వెళ్లే సమయంలో రబడా అతిగా ప్రవర్తించాడు. దాంతో రబడాపై ఐసీసీ రెండు మ్యాచుల నిషేధంతో పాటు మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత పెట్టిన సంగతి తెలిసిందే.



పీఎస్ఎల్‌పై మొయిన్ మండిపాటు

కరాచీ: పాకిస్తాన్ సూపర్ లీగ్(పీఎస్ఎల్) భాగంగా తమ దేశంలో జరగబోయే ప్లే ఆఫ్ మ్యాచ్‌లు ఆడటానికి విదేశీ క్రికెటర్లు ఆసక్తి చూపకపోవడంపై ఆ దేశ మాజీ క్రికెటర్ మొయిన్ ఖాన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఇది చాలా బాధాకర విషయమని ఆవేదన వ్యక్తం చేసిన మొయిన్.. దీనింతటికీ తమ దేశ క్రికెట్ బోర్డు పీసీబీనే కారణమన్నాడు. ఈ సీజన్ పీఎస్ఎల్ లీగ్ మ్యాచ్‌లు యూఏఈ వేదికగా జరగగా, ప్లే ఆఫ్ మ్యాచ్‌లు మాత్రం పాకిస్తాన్‌లో జరగాల్సి ఉంది. అయితే పాకిస్తాన్‌కు రావడానికి విదేశీ ఆటగాళ్లు నిరాకరించడంపై మొయిన్ ఖాన్ మండిపడ్డాడు. ఇలా జరగడానికి పీసీబీ ఉదాసీనతే కారణమని విమర్శలకు దిగాడు. 'ఇటువంటి బాధాకర పరిస్థితికి మా క్రికెట్ బోర్డు పెద్దలే కారణం. పాకిస్తాన్‌లో విదేశీ ఆటగాళ్లు ఆడితేనే పీఎస్ఎల్లో ఆడటానికి అనుమతించాలి. మా బోర్డు మాత్రం లీగ్‌లో పాల్గొనే ఆటగాళ్లకు ఎటువంటి ఆంక్షలు విధించలేదు. అందుకే పాకిస్తాన్‌లో ప్లే ఆఫ్ మ్యాచ్‌లకు విదేశీ ఆటగాళ్లు రావడానికి మొగ్గుచూపడం లేదు. మా బోర్డుకు నా మాటలు రుచించకపోవచ్చు. భవిష్యత్తులో కూడా ఇలానే ఉంటే పాకిస్తాన్ క్రికెట్ పరిస్థితి, పీఎస్ఎల్ పరిస్థితి దారుణంగా మారుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. పాకిస్తాన్‌లో క్రికెట్‌ను బ్రతికించుకునేందుకు పీసీబీ సీరియస్‌గా దృష్టి సారించాలి' అని మొయిన్ ఖాన్ తెలిపాడు. పీఎస్ఎల్‌లో క్వెటా గ్లాడియేటర్స్ హెడ్ కోచ్‌గా మొయిన్ ఖాన్ వ్యవహరిస్తున్నాడు.



అక్టోబర్‌లో భారత్‌కు విండీస్

కోల్‌కతా: వెస్టిండీస్ జట్టు ఈ ఏడాది అక్టోబరు-నవంబరు నెలల్లో భారత్‌లో పర్యటించనుంది. ఇందులో భాగంగా మూడు టెస్టులు, ఐదు వన్డేలు, ఓ టీ 20 మ్యాచ్ ఆడనుంది. ఈ నేపథ్యంలో విండీస్ టీ20 మ్యాచ్‌కు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ ఆతిథ్యం ఇవ్వనున్నట్లు క్యాబ్ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ వెల్లడించారు. మిగతా వేదికలకు సంబంధించి వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. అంతేకాదు ఐపీఎల్ 2018 టోర్నీలోని క్వాలిఫైయర్స్ మ్యాచ్‌లకు కూడా ఈడెన్ గార్డెన్స్ వేదికగా నిలిచే అవకాశముందని సౌరభ్ చెప్పారు. 2014లో విండీస్ భారత్‌లో పర్యటించింది. ఆ సమయంలో వెస్టిండీస్ బోర్డులో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో అర్థాంతరంగా పర్యటనను రద్దు చేసుకుని తిరిగి వెళ్లిపోయింది. తర్వాత ఆ జట్టు 2016లో జరిగిన టీ20 ప్రపంచ కప్‌లో పాల్గొనేందుకు మాత్రమే భారత్‌కు వచ్చింది. భారత్ మాత్రం రెండు సార్లు విండీస్‌లో పర్యటించింది. 2016లో టెస్టు మ్యాచ్‌లతో పాటు 2017లో పరిమిత ఓవర్ల సిరీస్‌లో ఆడింది.



షకీబ్‌కు భారీ జరిమానా!



- లంక మ్యాచ్‌లో గందరగోళంపై ఐసీసీ సీరియస్
- షకీబ్‌తో పాటు నురుల్ మ్యాచ్ ఫీజులో కోత

కొలంబో: నిదహాస్ ట్రోఫీలో భాగంగా శుక్రవారం శ్రీలంకతో జరిగిన టీ20 మ్యాచ్‌లో క్రీడాస్ఫూర్తి మరచి ప్రవర్తించిన బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్ అల్ హసన్, రిజర్వ్ ప్లేయర్ నురుల్ హసన్‌లపై అంతర్జాతీయ క్రికెట్ నియంత్రణ మండలి (ఐసీసీ) జరిమానా విధించింది. మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించడమే కాకుండా ఓ డీమెరిట్ పాయింట్ కేటాయించింది. బంగ్లాదేశ్ బ్యాటింగ్ చివరి ఓవర్లో మైదానంలో గందరగోళ పరిస్థితి ఏర్పడిన విషయం తెలిసిందే. రెండు బంతులు భుజం కంటే ఎత్తులో వెళ్లినా అంపైర్లు నోబాల్ ఇవ్వకపోవడంపై బంగ్లా బ్యాట్స్‌మన్ అసహనానికి గురయ్యారు. ముస్తఫిజుర్ రనౌటైన గ్యాప్‌లో గ్రౌండ్‌లోకి వచ్చిన బంగ్లా రిజర్వ్ ప్లేయర్ నురుల్ శ్రీలంక కెప్టెన్ తిసారా పెరిరాతో వాగ్వాదానికి దిగాడు. అంపైర్లు కలగజేసుకుని సర్దిచెప్పేలోపే కెప్టెన్ షకీబ్ బౌండరీ దగ్గరకొచ్చి 'బయటికి వచ్చేయండి..' అంటూ గట్టిగా కేకలు వేశాడు. ఈ ఘటనను సీరియస్‌గా పరిగణించిన మ్యాచ్? రిఫరీ క్రిస్ బోర్డ్ ఐసీసీ కోడ్ 2.1.1 ప్రకారం షకీబ్, 2.1.2 కింద నూరుల్ క్రీడాస్ఫూర్తిని దెబ్బతీస్తూ నిబంధనలు అతిక్రమించారని జరిమాన విధించారు. ఈ వివాదంపై రిఫరీ విచారం వ్యక్తం చేశారు. ఉత్కంఠగా సాగుతున్న ఆటలో ఇలాంటి ఉద్వేగాలు సహజమే కానీ ఆటగాళ్లు ఇలా ప్రవర్తించాల్సింది కాదని అభిప్రాయపడ్డారు. ఇక ఫోర్త్ అంపైర్ షకీబ్‌ను ఆపకపోవడం, మైదానంలోని అంపైర్లు నూరుల్, తిసారాల మధ్య గొడవ జరుగుతుండగా కల్పించుకోకపోవడం పరిస్థితి మరింత అధ్వాన్నంగా మార్చాయని చెప్పుకొచ్చారు. ఇక ఈ ఉత్కంఠకర మ్యాచ్‌లో లంకపై బంగ్లాదేశ్ ఓ బంతి మిగిలి ఉండగానే విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆదివారం జరిగే ఫైనల్లో భారత్‌తో బంగ్లాదేశ్ తలపడనుంది.

బంగ్లా ఆటగాళ్లపై తిలింగా ఫైర్

కొలంబో: నిదహాస్ ట్రోఫీలో భాగంగా శుక్రవారం జరిగిన ఉత్కంఠకర మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఆటగాళ్ల తీరుపై శ్రీలంక క్రికెట్ ఛీఫ్ తిలింగా సుమతిపాలా అసంతృప్తి వ్యక్తం చేశారు. మ్యాచ్ జరుగుతుండగా అంపైర్ల నిర్ణయం పట్ల బంగ్లా ఆటగాళ్లు వ్యవహరించిన తీరు ఆహ్వానించదగినది కాదని, విచారకరమైన ఘటనగా ఆయన అభివర్ణించారు. ఇక ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ బ్యాటింగ్ చివరి ఓవర్లో గందరగోళం ఏర్పడిన విషయం తెలిసిందే. అంపైర్లు నోబాల్ ఇవ్వడం లేదని బంగ్లా ఆటగాళ్లు అసహనానికి లోనయ్యారు. అంతేగాకుండా బంగ్లా కెప్టెన్ షకీబ్ అల్ హసన్ బ్యాట్స్‌మన్‌ను మైదానం వీడమని సూచించడం మైదానంలో ఉత్కంఠకు తెరలేపింది. ఇక రిజర్వ్ ఆటగాడు నురుల్ లంక కెప్టెన్ పెరీరాతో వాగ్వాదానికి దిగడం గొడవకు మరింత ఆజ్యం పోసినట్టైంది. దీంతో మైదానంలో గందరగోళ పరిస్థితులు ఏర్పాడ్డాయి. చివరికి బంగ్లా ఓ బంతి మిగిలి ఉండగానే మ్యాచ్ గెలిచింది. అనంతరం బంగ్లా ఆటగాళ్లు నాగినీ డ్యాన్స్‌లతో చిందేశారు. ఈ నేపథ్యంలో లంక ఆటగాళ్లతో మరోసారి వాగ్వాదం చోటు చేసుకుంది. ఇక మ్యాచ్ ప్రజెంటేషన్ అనంతరం బంగ్లా డ్రెస్సింగ్ అద్దాలు ధ్వంసమవ్వడంతో దుమారం రేగింది. అయితే ఈ అద్దాలు బంగ్లా ఆటగాళ్లు విజయ సంబరాలు జరుపుకుంటుండగా ధ్వంసమైనట్లు తెలిసింది. ఈ ఘటనపై స్పందించిన ఐసీసీ బంగ్లా కెప్టెన్ షకీబ్ అల్ హసన్, రిజర్వు ఆటగాడు నురుల్ మ్యాచ్ ఫీజులో 25 శాతం కోతతో పాటు ఓ డీమెరిట్ పాయింట్ విధించారు.



ఎట్టకేలకు ఊరట..

షమీ ఆడేందుకు అంగీకరించిన బీసీసీఐ!

న్యూఢిల్లీ: తన భార్య చేస్తున్న ఆరోపణలతో సతమతమవుతున్న టీం ఇండియా క్రికెటర్ మహ్మద్ షమీకి ఎట్టకేలకు స్వల్ప ఊరట లభించింది. ఐపీఎల్‌లో ఢిల్లీ డేర్ డెవిల్స్ జట్టు తరఫున ఆడే షమీ ఈ ఏడాది లీగ్‌లో పాల్గొనే అవకాశాలు లేవని వార్తలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో షమీ కెరీర్ ముగిసినట్లే అని అందరూ భావించారు. కానీ ఈ వార్తలను తారుమారు చేస్తూ.. షమీ ఐపీఎల్‌లో ఆడేందుకు పాలక మండలి అనుమతిచ్చింది. "షమీ జీవితంలో జరుగుతున్న ప్రతీ విషయం అతని వ్యక్తిగతం. ఈ పరిస్థితులు అతని కెరీర్‌పై ప్రభావం చూపించకూడదు. అందుకు అతను ఐపీఎల్‌లో ఆడేందుకు పాలక మండలి అంగీకరించింది. అతను ఓ అద్భుతమైన క్రికెటర్" అని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. అతను లైంగికంగా వేధించినట్లు.. ఆమెపై అతను హత్యాయత్నం చేసినట్లు, అతనికి హసీన్‌తో కాకుండా చాలా మంది అమ్మాయిలతో అక్రమ సంబంధాలు ఉన్నట్లు షమీ భార్య హసీన్ జహాన్ తీవ్ర ఆరోపణలు చేసింది. దీనిపై ఆమె కోల్‌కతా పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అతనిపై ఇండియన్ పీనల్ కోడ్ 498ఏ, 323, 307, 376, 506, 328, 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అయితే షమీకి ఐపీఎల్‌లో ఆడేందుకు లైన్ క్లియర్ అయినప్పటికీ పోలీసు విచారణలో అతను దోషిగా తేలితే అతని కెరీర్‌పై ఘోరంగా దెబ్బపడే అవకాశం ఉందని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు.

సిమోనా హలెప్‌కు చుక్కెదురు

కాలిఫోర్నియా: ఇండియన్ వెల్స్ మాస్టర్స్ టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్ టెన్నిస్ క్రీడాకారిణి సిమోనా హలెప్‌కు చుక్కెదురైంది. మహిళల సింగిల్స్‌లో భాగంగా శుక్రవారం రాత్రి జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో హలెప్ 3-6, 0-6 తేడాతో జపాన్‌కు చెందిన అన్ సీడెడ్ క్రీడాకారిణి నయోమి ఒసాకా చేతిలో ఓటమి పాలైంది. 64 నిమిషాల పాటు జరిగిన పోరులో హలెప్ ఏ దశలోనూ ఆకట్టులేకపోయింది. అనవసర తప్పిదాలతో తొలి సెట్‌ను కోల్పోయిన హలెప్.. రెండో సెట్‌లో కూడా అదే పునరావృతం చేసింది. ఫలితంగా టోర్నీ నుంచి హలెప్ నిష్క్రమించగా, ఒసాకా ఫైనల్‌కు చేరింది. ఆదివారం జరిగే తుదిపోరులో రష్యాకు చెందిన దారియా కసాత్కినాతో ఒసాకా అమీతుమీ తేల్చుకోనుంది.



మాట నిలబెట్టుకున్న రోహిత్

కొలంబో: టీం ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ తన అభిమానికి ఇచ్చిన మాట నిలబెట్టుకొని అందరి మనస్సు దోచుకున్నాడు. నిదహాస్ ట్రై సిరీస్ ఫైనల్స్ కోసం టీం ఇండియా కసరత్తు చేస్తోంది. ఫైనల్స్ కోసం జరుగుతున్న ప్రాక్టీస్‌లో బిజీగా ఉన్న రోహిత్ తన షెడ్యూల్ నుంచి కొంత సమయాన్ని తన ఫ్యాన్ కోసం కేటాయించాడు. కొలంబోలో ఉండే అతని ఫ్యాన్ మహ్మద్ మిలన్ ఇంటికి వెళ్లి అతనితో కొంత సమయం గడిపాడు. గతేడాది శ్రీలంక భారత పర్యటనకు వచ్చిన సమయంలో మిలన్ తండ్రికి క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు సమాచారం అందింది. ఆ సమయంలో కొలంబో వెళ్లేందుకు అతని వద్ద తగినంత డబ్బు లేదు. ఈ విషయం సచిన్ టెండూల్కర్ అతి పెద్ద అభిమాని సుధీర్ ద్వారా తెలుసుకున్న రోహిత్ అతనికి ఫ్లైట్ టికెట్ బుక్ చేయడమేకాక, అతనికి అవసరమైన డబ్బు కూడా ఇచ్చి పంపించాడు. ఆ సమయంలో ఈసారి శ్రీలంక వచ్చినప్పుడు తమ ఇంటికి రావాలని మిలన్ రోహిత్ కోరగా.. అతను వస్తానని మాటిచ్చాడు. ఇచ్చిన మాట కోసం రోహిత్ మిలన్ ఇంటికి వెళ్లాడు. ఈ సందర్భంగా మిలన్ మాట్లాడుతూ "రోహిత్ స్వచ్ఛమైన మనస్సు ఉన్న వ్యక్తి. ఆ రోజు నా తండ్రి అనారోగ్యంగా ఉన్నప్పుడు రోహిత్ చేసిన సహాయం ఎప్పటికీ మర్చిపోలేను. రోహిత్ మాత్రమే కాదు... భారత జట్టులోని ప్రతి ఆటగాడు చాలా మంచి వాళ్లు.. సుధీర్ సచిన్‌కి నెం.1 ఫ్యాన్ అయితే.. రోహిత్‌కి నేను నెం.1 ఫ్యాన్‌ని" అని తెలిపాడు. రోహిత్ మిలన్ ఇంటికి వెళ్లి అతనితో కలిసి దిగిన ఫోటో ప్రస్తుతం సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తోంది.



'నా భార్యపై లైంగికదాడి జరగలేదు'



కోల్‌కతా: తన భార్య హసీన్ జహాన్‌పై లైంగిక దాడి జరిగిందన్న ఆరోపణల్లో వాస్తవం లేదని టీమిండియా పేసర్ మహ్మద్ షమీ స్పష్టం చేశాడు. భార్య హసీన్‌ను తన సోదరుడు అత్యాచారం చేశాడనే వార్తలపై స్పందించిన షమీ.. అందులో ఎటువంటి నిజం లేదని పేర్కొన్నాడు. 'హసీన్ చెబుతున్నట్టు డిసెంబర్ 7న నా సోదరుడు ఇక్కడ లేడు. ముర్దాబాద్‌లో ఉన్నాడు. డిసెంబర్ 6న భువనేశ్వర్ కుమార్ రిసెప్షన్‌కు నా భార్యతో కలిసి వెళ్లాను. అంతకుముందు డిసెంబర్ 2 నుంచి 6వ తేదీ వరకూ టెస్టు మ్యాచ్ ఆడా. ఆ తర్వాత భువీ రిసెప్షన్‌కు భార్యతో కలిసి హాజరయ్యా. డిసెంబర్ 7న మధ్యాహ్నం గం.3.30ని.లకు మా హోమ్ టౌన్‌కు వెళ్లాం. మరి అటువంటప్పుడు ఆమెపై మా సోదరుడు అత్యాచారం చేశాడని ఆరోపించడం అర్థం లేనిది. ఈ కేసును సీరియస్‌గా తీసుకుని పూర్తి విచారణ చేయండి. ఈ కేసుతో చాలా జీవితాలు ముడిపడి ఉన్నాయి' అని ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో షమీ తెలిపాడు.

ఆఖరి మ్యాచ్ ఆడేశా : పీటర్సన్



దుబాయి: ఇంగ్లాండ్ స్టార్ బ్యాట్స్‌మెన్ కెవిన్ పీటర్సన్ తన క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. ఆఖరి మ్యాచ్ కూడా ఆడేశానని ప్రకటించాడు. ప్రస్తుతం అతడు పాకిస్థాన్ క్రికెట్ ప్రీమియర్ లీగ్‌లో క్వెట్టా గ్లాడియేటర్స్ తరపున బరిలోకి దిగాడు. ఇక తన పూర్తి సమయం కుటుంబానికే కేటాయిస్తానంటూ ప్రకటించాడు. 'బూట్స్ అప్! కృతజ్ఞతలు!' అని ట్వీట్ చేశారు. దీంతో ఆయన గతంలో చెప్పినట్లే ఇదే ఆయన ఆఖరి టోర్నీ అని మరోసారి తేలిపోయింది. ఇంగ్లాండ్ జట్టులో మంచి ప్రతిభావంతుడిగా.. అరుదైన బ్యాట్స్‌మెన్‌గా పేరు తెచ్చుకున్న పీటర్సన్ .. అనేక వివాదాల ద్వారా వివాదాస్పద క్రికెటర్‌గానూ వార్తల్లోకెక్కాడు. 2013-14 యాషెస్ సిరీస్‌లో పేలవ ఫాం కారణంగా పీటర్సన్‌ను ఎంపిక చేయకపోవడంతో అతడి కెరీర్ అనూహ్యంగా ముగిసింది. తర్వాత ప్రపంచవ్యాప్తంగా అతడు అనేక లీగ్ టోర్నీలు ఆడాడు.



ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- మధుబని సభలో సురవరం ఆందోళన
- ఉత్సాహంగా సీపీఐ బీహార్ రాష్ట్ర మహాసభలు ప్రారంభం

మధుబని: కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరిస్తూ ప్రజావ్యతిరేక పాలన సాగిస్తోందని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి విమర్శించారు. ఎన్డీయే పాలనలో భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, రాజ్యాంగాన్ని పరిరక్షించాలని, ఇందుకోసం వామపక్ష, ప్రజాతంత్ర శక్తులతో విశాల ఐక్యవేదికను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) బీహార్ రాష్ట్ర 23వ మహాసభలు శనివారం ఇక్కడ ఉత్తేజపూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మహాసభలను పురస్కరించుకుని భారీ ర్యాలీ నిర్వహించారు. జనసేవాదళ్ కవాతు నగర ప్రజలను ఆకర్షించింది. ఈ నెల 20 వరకు జరిగే ఈ మహాసభల్లో 500 మంది ప్రతినిధులు పాల్గొంటారు. సురవరం ప్రసంగాన్ని కొనసాగిస్తూ, మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరించారు. బీజేపీ, సంఘ్‌పరివార్‌ను ఎదుర్కోనేందుకు లౌకిక, ప్రజాతంత్ర పార్టీలు చేతులుకలపాలన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి డా॥ కె. నారాయణ, రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ్ సింగ్ తదితరులు ప్రసంగించారు. రాష్ట్ర నాయకులు రామేంద్ర కుమార్, నాగేంద్రనాథ్ ఓఝా, రామ్‌నరేష్ పాండే తదితరులు పాల్గొన్నారు ధర్భాంగ, సమస్థిపూర్, బెగుసరాయ్, మధుబని జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో యువత ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

తయారీ రంగం వృద్ధి చెందకపోతే

భారత్‌కు నిరుద్యోగ ముప్పు తప్పదు

నోబెల్ గ్రహీత, అమెరికన్ ఆర్థిక వేత్త పాల్ క్రుగ్‌మెన్

న్యూఢిల్లీ: భారత్‌లో తయారీ రంగం వృద్ధి చెందకపోతే భవిష్యత్తులో తీవ్రమైన నిరుద్యోగ సమస్యను ఎదుర్కొనే ప్రమాదం ఉందని 2008 లో నోబెల్ బహుమతి గ్రహీత, ప్రసిద్ధ అమెరికన్ ఆర్థికవేత్త పాల్ క్రుగ్‌మెన్ హెచ్చరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి. భవిష్యత్తులో మనిషి రోగ నిర్ధారణ భారత్‌లో వైద్యుడికి ఔట్‌సోర్సింగ్ ఇవ్వబడినప్పటికీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(కృత్రిమ మేధస్సు) పై ఆధారపడిన సంస్థకే ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. ఇటువంటి విషయాలు భారతీయ సేవల రంగాన్ని కూడా అత్యంత ఆందోళన కలిగించే విషయమని క్రుగ్‌మన్ న్యూస్18 కార్యక్రమంలో వెల్లడించారు. జపాన్ సూపర్‌పవర్‌గా ఎక్కువకాలం ఎదగలేదనీ, ఎందుకంటే ఆ దేశంలో పని చేసే జనాభా తగ్గిపోతోందనీ, చైనాలోనూ అదే పరిస్థితి అని తెలిపారు. ఆసియా దేశాల్లో భారత్ సూపర్ పవర్‌గా ఎదిగే అవకాశాలు ఉన్నప్పటికీ కేవలం సేవల రంగాన్ని మాత్రమే కాకుండా తయారీ రంగాన్ని కూడా మరింత అభివృద్ధి చేసుకోవలసిన అవసరాన్ని నొక్కి వక్కాణించారు. ఉత్పాదక రంగంలో అభివృద్ధికి మరింత కృషి చేయవలసిన అవసరం ఉందని తెలిపారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు అభివృద్ధికి ఉపాధి



అవకాశాలు కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వాలదేనని పేర్కొన్నారు. భారతదేశ వృద్ధి చాలా ప్రత్యేకమైనదిగాపేర్కొంటూ మరోవైపు భారత్ ప్రపంచీకరణవైపు మొగ్గు చూపుతోందని అన్నారు. ప్రపంచంలో ఎక్కడాచూడని విధంగా ప్రపంచీకరణలో భాగంగా వృద్ధిని పెంపొందించే సర్వీసురంగం పెరుగుతోందనీ, ఇప్పుడే అది ప్రారంభమైందని అన్నారు. భారత దేశ అభివృద్ధికి ఇదే ప్రామాణికమన్నారు. ప్రపంచవ్యాప్తంగా సేవా వాణిజ్య రంగం భారీ సామర్థ్యాన్ని కలిగి ఉందన్నారు. ఇదొక్కటే భారత దేశ పురోగతికి, వృద్ధికి ఆధారమని క్రుగ్‌మన్ అన్నారు. భారతదేశంలో వృద్ధి రేటు ఎక్కువ స్థాయి కొనసాగుతోంది. పనిచేసేవారి వయస్సు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. జపాన్ నుంచి ఇటలీ, చైనా వరకు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు మానవ వనరులు కొరతతో ఇబ్బంది పడుతున్నాయి. అయితే భారత్‌లోని చాలా ప్రాంతాలు ఇంకా పూర్తి సామర్థ్యాన్ని గుర్తించాల్సి ఉంది. భారత్‌లోని అనేక ప్రాంతాలకు విద్యుత్ సౌకర్యం కల్పించే విషయమై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మాట్లాడుతున్నారు. అటువంటి ప్రణాళికను పరిపూర్తి చేసినపుడే ఆర్థిక వ్యవస్థ భారీ వృద్ధిని చూడవచ్చని క్రుగ్‌మెన్ పేర్కొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.